బుధవారం 28-2-2024


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 338



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

దేశానికే ఆదర్శంగా అన్నదాతలను అన్నివిధాలుగా చేయి పట్టుకు నడిపిస్తూ.. ఎన్ని కష్టాలు ఎదురైనా..
చెప్పిన సమయానికి చెప్పినట్లుగా రైతన్నల సంక్షేమానికి గతంలో ఎన్నడూ జరగని విధంగా రైతు భరోసా కల్పిస్తూ
వ్యవసాయాన్ని పండుగ చేసిన జగనన్న ప్రభుత్వం..

వరుసగా ఐదో ఏడాది.. ఈ ఏడాదికి మూడో విడతగా..

వైఎస్సార్ రైతు భరోసా -PM KISAN

రైతన్నలకు ఒక్కొక్కరికి ఏటా రూ. 13,500 చొప్పున వరుసగా 4 ఏళ్లు రైతు భరోసా -PM KISAN సాయం అందించడంతోపాటు ఐదో ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో ఒక్కొక్కరికి అందించిన సాయం రూ. 11,500..

మూడో విడతగా ఒక్కొక్కరికి మరో రూ. 2,000 చొప్పున 53.58 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.1,078.36 కోట్లను జమ చేసే కార్యక్రమం.. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నేడు ప్రారంభించనున్న గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..



నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఒక్కో రైతన్నకు కేవలం ఒక్క "రైతు భరోసా -PM KISAN" ద్వారా మేనిఫెస్టోలో చెప్పిన రూ.50,000 కన్నా మిన్నగా ఈ 57 నెలల్లో అందించిన మొత్తం సాయం రూ. 67,500

దేశంలో ఎక్కడా లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతన్నలతో పాటు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ కౌలు రైతులు, RoFR (అటవీ), దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతన్నలకు కూడా "వైఎస్సార్ రైతు భరోసా" క్రింద ఏటా రూ.13,500 రైతు భరోసా సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే..

ఇప్పుడు అందిస్తున్న సాయం రూ. 1,078.36 కోట్లతో కలిపి ఈ 57 నెలల్లో రైతన్నలకు అందించిన మొత్తంలో కేవలం "వైఎస్సార్ రైతు భరోసా - PM KISAN" సాయంగా మాత్రమే రూ. 34,288 కోట్లు..

చెప్పిన దాని కన్నా ముందుగా.. మాట ఇచ్చిన దానికన్నా మిన్నగా రైతన్నలకు సాయం..

మ్యానిఫెస్టోలో చెప్పింది - ఏటా రూ. 12,500 X 4సం॥ = రూ. 50,000
ప్రభుత్వం ఇచ్చింది - ఏటా రూ. 13,500 X 5సం॥ = రూ. 67,500
మ్యానిఫెస్టోలో చెప్పినదానికన్నా, ఒక్కో రైతన్నకు అదనంగా అందించిన మొత్తం రూ.17,500

"రైతు భరోసా - PM KISAN" క్రింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి అందిస్తున్న సాయం రూ.13,500..

మొదటి విడత	రెండవ విడత	మూడవ విడత
ఖరీఫ్ పంట వేసే ముందు మే / జూన్ నెలలో రూ.7,500	అక్టోబర్/ నవంబర్ నెలలో ఖరీఫ్ పంట కోత సమయం, రబీ అవసరాల కోసం రూ. 4,000	పంట ఇంటికి వచ్చే సమయాన, జనవరి/ఫిబ్రవరి నెలలో రూ. 2,000

ఈ 57 నెలల్లో రైతన్నలకు అందించిన సాయం..

పథకం	రైతుల సంఖ్య (లక్షల్లో)	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా - PM KISAN	53.58	34,288
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	54.55	7,802
ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం	22.82	1,967
ధాన్యం కొనుగోలు (నేటి వరకు)	37.73	65,258
ఇతర పంటల కొనుగోలు (నేటి వరకు)	6.17	7,726
2014-2019 కి సంబంధించి చెల్లించిన ధాన్యం సేకరణ బకాయిలు		960
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ		43,744
2014-2019 కి సంబంధించి చెల్లించిన కరెంటు బకాయిలు		8,845
పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంపుకు..		1,700
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ		3,497
శనగ రైతులకు బోనస్		300
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	7.33	3,365
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.53	248
వైఎస్సార్ యంత్ర సేవా పథకం		1,052
విత్తన సబ్సిడీ	76.10	1,380
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (2014-2019 కి సంబంధించి చెల్లించిన బకాయిలతో కలిపి)	84.66	2,051
2014-2019 కి సంబంధించి చెల్లించిన విత్తన బకాయిలు		384
మొత్తం సాయం		**1,84,567 కోట్లు**

వరుసగా నాలుగో ఏడాది

వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు



రబీ 2021-22, ఖరీఫ్ 2022 లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 10,78,615 మంది రైతన్నలకు రూ. 215.98 కోట్ల వడ్డీ రాయితీ సొమ్ము బటన్ నొక్కి వారి ఖాతాల్లో నేడు నేరుగా జమచేయనున్న గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

2014-15 నుండి 2018-19 వరకు పెండింగ్ పెట్టిన బకాయిలతో సహా..

నేడు అందిస్తున్న రూ. 215.98 కోట్లతో కలిపి ఈ 57 నెలల్లో "వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు" క్రింద 84.66 లక్షల మంది రైతన్నలకు అందించిన వడ్డీ రాయితీ రూ. 2,050.53 కోట్లు..

చక్రవడ్డీల పద్మవ్యూహంలో చిక్కుకొని అన్నదాతలు అప్పుల ఊబిలో పడిపోకుండా వారికి అండగా నిలుస్తూ.. ఈ-క్రాప్ డేటా ఆధారంగా లక్ష రూపాయల లోపు పంట రుణాలు తీసుకొని ఏడాది లోపు సమయానికి తిరిగి చెల్లించిన రైతన్నలకు **వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం** క్రింద వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తోంది..

వైఎస్సార్ రైతు భరోసా – PM KISAN, వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల పథకాల క్రింద రాష్ట్రంలోని రైతన్నలకు నేడు అందిస్తున్న మొత్తం సాయం

రూ.1,294.34 కోట్లు..

వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు, ఫిర్యాదులకై టోల్ ఫ్రీ నంబర్ **155251** ను సంప్రదించండి

శ్రీ. కాకాణి గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ & ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



డేటింగ్ విత్ డిప్రెషన్!

ఆన్‌లైన్ ప్రపంచంలో ప్రేమలను వెతుక్కోవడం అంటే సముద్రంలో పారబోసుకున్న మంచినీళ్లను దోసిళ్లతో పట్టుకోవాలనుకోవడం లాంటిది. డిజిటల్ యుగంలో ప్రపంచం చిన్నదైనప్పటికీ మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాలు ఒంటరితనం వైపుగా పయనిస్తున్నాయి. ఫలితంగా ఒంటరి మనసులు భావోద్వేగాల జడిని కనపడని వ్యక్తులతో పంచుకుంటున్నారు.

డేటింగ్ యాప్‌లలో మహిళలు భాగస్వాముల కోసం వెతుకుతూ, వారితో మానసిక అనుబంధాలను పెంచుకొని, కొంతకాలానికి డిప్రెషన్‌కు గురవుతున్నారని, వారి మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది అంటున్నారు మానసిక నిపుణులు.

పెరుగుతున్న సమస్య... 35 ఏళ్ల దాటిన వసు (పేరుమార్చడమైనది) లక్షల వ్యాపారాన్ని సులువుగా నిర్వహించే స్టార్టప్‌ను రన్ చేస్తుంది. కానీ, మానసిక సంబంధాన్ని సరిగా నిర్వహించలేక డిప్రెషన్ బారిన పడింది. వసు తల్లి ఈ విషయాన్ని చెబుతూ 'నా కూతురు సొంతంగా నిలదొక్కుకోవాలనే ఆలోచనతో పెళ్లి విషయంలో ఆలస్యం చేసింది. సెటిల్ అయ్యాక ఇక పెళ్లి చేసుకోవాలనే ఆలోచనతో డేటింగ్ యాప్‌లో ఒక అబ్బాయిని ఇష్టపడింది. అతను కూడా నా కూతురితో రోజూ ఆన్‌లైన్‌లో మాట్లాడుతుండేవాడు. ప్రేమిస్తున్నట్టు చెప్పాడు. కొన్నాళ్లు ఇద్దరూ చాటింగ్, వీడియో కాల్స్ చేసుకునేవారు. కానీ, కలవడానికి దూరంగా ఉండేవాడు. నా కూతురు అతనితో ఎమోషనల్‌గా అటాచ్ అయ్యింది. కానీ, ఆ అబ్బాయి సరైనవాడు అని నాకు అనిపించడం లేదు. ఎందుకంటే, కలుద్దామంటే అతను చూడటానికి రావడం లేదు. నా కూతురిని అతని నుంచి దూరంగా ఉంచాలంటే ఏం చేయాలో తెలియట్లేదు'అనేది ఆమె ఆవేదన.

'వర్చువల్ ప్రపంచంలో ప్రేమలు వెతికేవారి సంఖ్య ఇటీవల బాగా పెరుగుతున్న ఈ సమయంలో కూతుళ్ల పట్ల తల్లుల ఆందోళన కూడా పెరుగుతోంది' అంటున్నారు రిలేషన్‌షిప్ కౌన్సెలర్ డాక్టర్ మాధవీ సేథ్. ఈ విషయంలో కొన్ని సూచనలు చేస్తున్నారు.

తెలివిగా వ్యవహరించాలి... ఈ రోజుల్లో తల్లులు చాలా తెలివిగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే కూతుళ్లు బాగా చదువుకుంటూ, బిజినెస్ ఉమెన్‌గా నిలదొక్కుకుంటున్నవారున్నారు. వారికి తమ మంచి చెడులు బాగా తెలుసు. అందుకని, వాళ్లు చాటింగ్ చేయడాన్ని లేదా అబ్బాయితో మాట్లాడడాన్ని నిషేధిస్తే మీ మాట వినరు. నిఘా పెడితే మీ పై నమ్మకం కోల్పోతారు. నమ్మకాన్ని గెలుచుకోవడం ద్వారా మాత్రమే మీరు మీ కూతురిని అర్థం చేసుకోగలరు.

సమయం ఇవ్వండి.. స్త్రీ ఎంతటి సమర్థత, విజయం సాధించినా ప్రేమ విషయంలో చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. కాబట్టి ఆమె అవతలి వ్యక్తి లోపాలను చూడలేదు. కానీ, తెలివిగా ఆమెకు నిజం చెప్పాలి. దీని కోసం మీరు మీ కుమార్తెతో సమయం గడపడం అవసరం. మొదట ఆమె ఆ వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటుందో లేదో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అవును అయితే ఆ విషయం గురించి ప్రేమగానే మాట్లాడాలి. అబ్బాయిని ఇంటికి పిలవమని, అతని తల్లిదండ్రులను కలవడానికి ప్లాన్ చేయమని చెప్పాలి. తర్వాత నెమ్మదిగా సాక్ష్యాధారాలతో ఆ అబ్బాయి గురించి నిజాలను కూతురికి చెప్పాలి. నిజానికి ఈ విషయాలు చెప్పాలంటే కష్టం అనిపిస్తుంది. ఎందుకంటే 'ఆమె' ఒంటరితనం ఫీలవుతుంది. ఆమెకు మీ ప్రేమపూర్వక మద్దతు అవసరం. ప్రతి పరిస్థితిలో మీరు ఆమెతో ఉన్నారని మీ కుమార్తెకు భరోసా ఇవ్వండి. వీలైతే మీ కూతురిని కొంతకాలం దూరంగా ఎక్కడికైనా తీసుకువెళ్లండి. దీనివల్ల ఆమె మానసిక స్థితిలో సానుకూలమైన మార్పులు చోటు చేసుకోవచ్చు.

వర్చువల్ ప్రపంచం నుండి బయటకు రండి... ఆన్‌లైన్ ప్రేమ కోసం వెతుకుతున్న యువత వర్చువల్ ప్రపంచం నుండి బయట పడి జనంతో కలిసిపోవాలి. ఒకటి లేదా రెండు రోజులు ఆన్‌లైన్ చాటింగ్ అవతలి వ్యక్తి గురించి ఎక్కువ సమాచారాన్ని అందివ్వవు. డేటింగ్‌యాప్‌లలో మోసం జరిగే అవకాశాలు ఎక్కువ కాబట్టి వాస్తవ ప్రపంచంలో నిజమైన ప్రేమలను వెతుక్కోవాలి. ఒకరికొకరు పరస్పరం కలిసి మాట్లాడుకోవడంలో సాంత్వన పొందుతారు. ఇటువంటి వాటిలో మోసం, భయం ఉండవు. ప్రేమ సంబంధాలలో నమ్మకం ముఖ్యం.

వర్చువల్... నిజాలు... లండన్ లోని ఇంపీరియల్ కాలేజ్ పరిశోధన ప్రకారం దాదాపు 70 శాతం మంది డేటింగ్ యాప్‌లలో భాగస్వాముల కోసం వెతుకుతున్న వ్యక్తులు డిప్రెషన్‌కు గురవుతున్నారనీ, అది వారి మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతోందని తేలింది. ఈ రోజుల్లో వ్యక్తులు తరచుగా సంబంధాలను వదులుకోవడానికి చాలా త్వరపడుతుంటారు. ఎందుకంటే, ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటూ ఆ దిశగా అన్వేషణ చేయడం కూడా ఇందుకు కారణం అవుతుంటుంది. కోవిడ్ లాక్‌డౌన్ మార్పులు కూడా ఈ స్థితికి బాగా కారణమైంది. ఇంటి నుండి పని మొదలు డేటింగ్ యాప్‌లో రొమాన్స్ చేయడానికి ఓ కొత్తమార్గాన్ని ఎంచుకునే అవకాశాన్ని కల్పించింది.

మరికొన్ని సూచనలు.. ● ఒంటరిగా ఉండటం వల్ల కలిగే ప్రతికూలతలపై దృష్టి సారించే బదులు మీరు ఆనందించే అంశాలు, అది తెచ్చే స్వేచ్ఛపై దృష్టి పెట్టాలి ● జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యం, అభిరుచులవైపు మనసును మళ్లించాలి. కుటుంబం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

సామాజికంగా కలవాలి...

● ఆన్‌లైన్ డేటింగ్‌లో మరొక వ్యక్తి జీవితాన్ని, సంబంధాలను, వివరాలను ఎప్పటికీ తెలుసుకోలేరు. సోషల్ మీడియా పోస్ట్‌లో సంతృప్తికరమైన సంబంధంలా కనిపించేది నిజ జీవితంలో చాలా భిన్నంగా కనిపించవచ్చు ● ఒంటరిగా ఉన్నప్పుడు వర్చువల్ మీట్–అప్‌లను కూడా స్నేహితులతో ప్లాన్ చేయడం మంచిది ● వారానికి కొన్నిసార్లు మీ ప్రియమైన వారితో ఫోన్‌లో చాట్ చేసినా, ఆన్‌లైన్‌లో ఇంటరాక్ట్ అవుతున్నా మీ ఒంటరితనం అనే భావన దూరం అవుతుంటుంది ● స్వచ్ఛంద సేవ, స్థానిక స్పోర్ట్స్ క్లబ్‌లలో పాల్గొనడం, లీడర్స్ క్లబ్.. వంటివి ఏర్పాటు చేయడం వల్ల ఒంటరితనం దూరం అవడమే కాదు, మనసులో ఉన్న వ్యక్తులను కలుసుకునే అవకాశం కూడా దొరకవచ్చు ● జీవితం ఒక రేస్ కాదు. ఒక నిర్దిష్ట వేగంతో జీవితంలోని మైలురాళ్లను చేరుకోవాల్సిన అవసరం లేదు. అన్నింటి కన్నా ముందు మీకు మీరే ప్రియమైనవారని గుర్తుచేసుకోండి. డేటింగ్ యాప్‌లలోనే కాదు మీ ఆసక్తులు, లక్ష్యాలు, విలువలు పంచుకునే ఒంటరి వ్యక్తులు మీ చుట్టూ పుష్కలంగా ఉన్నారనే విషయం గ్రహించాలి.



– డాక్టర్ మాధవీ సేథ్,
రిలేషన్‌షిప్ కౌన్సెలర్

ప్రపంచ పర్యావరణానికి కొత్త గీతం



● గీతా బాత్రా

ఆడవాళ్లకు ఇంటి పని, వంటపని, మహా అయితే చిన్నదో పెద్దదో ఉద్యోగం చేయడం తప్ప పెద్ద పెద్ద ఆర్థిక వ్యవహారాలేం తెలుస్తాయి... అని చప్పరించేసే వారికి చెంపపెట్టు గీతాబాత్రా. భారతదేశానికి చెందిన ఆర్థికవేత్తల పేర్లు కొన్ని చెప్పమంటే మొదటి పది అంకెల్లోనే ఉండే పేరు ఆమెది. ఆర్థికవేత్తగా ఎంతో క్రమశిక్షణతో... అంతకుమించిన నిబద్ధతతో ఆమె తీసుకునే విధానపరమైన కీలక నిర్ణయాలే ప్రపంచ బ్యాంకు తాజా సమావేశంలో ఆమెను గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ ఫెసిలిటీ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేశాయి. అంతే కాదు, ఆ పదవిలో నియామకం అయిన తొలి మహిళా డైరెక్టర్‌గా కూడా యాభై ఏడు సంవత్సరాల గీతాబాత్రా పేరు ఒక్కసారిగా జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో పతాక శీర్షికలకు ఎక్కింది.

నిజానికి ఈ నియామకం ఇప్పటికిప్పుడు తీసుకున్న నిర్ణయం ఏమీ కాదు. సుమారు మూడు వారాల క్రితం వాషింగ్టన్‌లో జరిగిన జీఈఎఫ్ 66వ కౌన్సిల్ మీటింగ్‌లోనే ఆమె పేరు పరిశీలనకు వచ్చింది. ఆ తర్వాత గీతాబాత్రా అయితేనే ఈ పదవికి తగిన న్యాయం చేయగలదని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే ఆమెను ఈ స్థానంలో నియమించారు. అయితే జీఈఎఫ్ డైరెక్టర్‌గా నియమితురాలు కావడం ఆమెకు ఏదో గొప్ప పదవిని కట్టబెట్టినట్టు కాదు... ఎన్నో సవాళ్లతో కూడిన ఎంతో బాధ్యతాయుతమైన స్థానం అది.

1998లో వరల్డ్ బ్యాంక్‌లో చేరడానికన్నా ముందు ఆమె అమెరికాలోని కొన్ని ప్రైవేట్ బ్యాంక్‌లలో పై స్థాయిలో పని చేసింది. అసలు ఆమె నేపథ్యం ఏమిటో చూద్దాం.

గీతాబాత్రాది కొత్తదిల్లీ. ముంబాయిలోని విల్లా థెరిసా స్కూల్‌లో చదువు పూర్తయ్యాక చెన్నైలోని స్టెల్లా మేరిస్ కాలేజీలో అర్థశాస్త్రంలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత ఎంబీఏ ఫైనాన్స్ చేసింది. ఇక ఉద్యోగం చూసుకుందాం అనుకుంటుండగా ఆమె ప్రొఫెసర్‌లలో ఒకరి ప్రోద్బలంతో అమెరికా వెళ్లి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేసింది.



● భర్త ప్రకాష్, కుమార్తె రోషిణీలతో...

అక్కడే అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా కొన్ని సంవత్సరాలపాటు పని చేసింది. వరల్డ్ బ్యాంక్‌కు అనుబంధ సంస్థలలో ఆమె 2005 వరకు పని చేసింది. అప్పుడే ఆమె ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అడ్వైజరీ సర్వీసెస్‌లో పని చేసింది. ఆ తర్వాత ఆమె భారతదేశం నుంచి వరల్డ్ బ్యాంక్ ఐఈజీలో చీఫ్ ఎవల్యూటర్ అండ్ మేనేజర్‌గా కార్పొరేట్ థీమాటిక్ ఎవల్యూషన్ బాధ్యతలు చేపట్టింది. ఆ తర్వాత 2015 లో జీఈఎఫ్ ఐఈవోగా చేరి, నాటినుంచి టీమ్‌తో పని చేయిస్తోంది. నాటినుంచి ఆమె ఎన్నో విపత్కర పరిస్థితులను అధిగమించడంలో ఎంతో సమర్థనీయమైన పాత్రను పోషించింది. ఎన్నో పుస్తకాలు రాసింది. మరెన్నింటికో సంపాదకత్వ బాధ్యతలు వహించింది.

ప్రస్తుతం నార్దన్ వర్జీనియాలో భర్త ప్రకాష్, కుమార్తె రోషిణితో కలిసి జీవిస్తోంది.

జీఈఎఫ్ 'గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ ఫెసిలిటీ) పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ బ్యాంకు చేపట్టే అన్ని బాధ్యతలను ఆమె పర్యవేక్షించడమే కాదు.. అందుకు కావలసిన. కీలక నిర్ణయాలు కూడా తీసుకోనున్నారు.

దివ్యమైన ఫుడ్‌చైన్



● దివ్య

కందిపొడితో కలిసిన తాజా నేతి వాసన. కొబ్బరి పచ్చడిలో తాజా కరివేపాకు, మినపప్పుతో వేసిన పోపు వాసన వీధి చివరకు వస్తోంది. ముక్కు చెప్పినట్లు నడుచుకుంటూ వెళ్తే అక్కడ ఓ రెస్టారెంట్. లోపలకి వెళ్లేవాళ్లు, సంతృప్తిగా బయటకు వచ్చేవాళ్లు, క్యూలో ఉన్న వాళ్లను చూస్తే లోపల టేబుల్ దొరకడం కష్టమే, రష్ బాగానే ఉందనిపిస్తోంది. తలెత్తి చూస్తే విశాలమైన బోర్డు కుడివైపు 'ద రామేశ్వరం కేఫ్' అని ఇంగ్లిష్‌లో ఉంది. తమిళ రుచి అనుకునే లోపే ఎడమవైపు అదే పేరు కన్నడ భాషలో ఉంది. మధ్యలో చక్కటి ముగ్గుతో మూర్తీభవించిన దక్షిణాది సంప్రదాయం కనువిందు చేస్తోంది. బెంగళూరులో ఉన్న ఈ రెస్టారెంట్ తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు వేడి వేడిగా వడ్డిస్తూనే ఉంటుంది. ఈ రెస్టారెంట్‌ల యజమాని పాతికేళ్లు కూడా నిండని దివ్య. తాత, తండ్రుల వ్యాపార సామ్రాజ్యాన్ని ఈ అమ్మాయి వారసత్వంగా అందుకున్నదేమో అనుకుంటాం. కానీ ఇది పూర్తిగా ఆమె ఆలోచనే.

మెక్‌డీ... కేఎఫ్‌సీలేనా!

ఫుడ్ చైన్‌ను మించిన వ్యాపారం మరొకటి ఉండదని నమ్మింది దివ్య. సీఏ చేసిన తర్వాత ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో ఎంబీఏలో చేరినప్పటి నుంచి ఫుడ్ చైన్ బిజినెస్‌లో నెగ్గుకురావడం గురించిన మెళకువలు నేర్చుకోవడంలో మునిగిపోయింది. పాశ్చాత్య దేశాల్లో పుట్టిన మెక్ డీ, కేఎఫ్‌సీలను మనం ఆదరిస్తున్నాం. అలాగే దక్షిణాది రుచులను దేశమంతటా విస్తరించడం ఎందుకు సాధ్యం కాదు... అనుకుంది. మార్కెటింగ్ వ్యూహాలను తెలుసుకుంది. కోర్సు పూర్తి అయిన వెంటనే తన ఆలోచనను ఇంట్లో వాళ్ల ముందు బయటపెట్టింది. భర్త రాఘవరావు ఆహార పరిశ్రమల రంగానికి చెందిన వ్యక్తి కావడంతో అతడు మాత్రమే ఆమెకు మద్దతుగా నిలిచాడు. ఇక మిగిలిన వారంతా– 'సీఏ, ఐఐఎమ్‌లో పీజీ చేసిన అర్హతలకు పెద్ద కంపెనీలో భారీ వేతనంతో ఉద్యోగం దొరుకుతుంది, హాయిగా ఉద్యోగం చేసుకోక ఇంత చదువూ చదివి ఇడ్లీలు, దోశెలు, ఊతప్పాలా' అన్నారు. ఎవరెన్ని చెప్పినా ఆమె తన అభీష్టాన్ని నెరవేర్చుకుని తీరాలని నిర్ణయించుకుంది. ఇపుడామె కారం పొడి చల్లిన నెయ్యి దోశెలు, స్పాంజిలాగ మెత్తని ఇడ్లీలు, ఊతప్పం, గుంత పొంగనాలు, మూడు రకాల చట్నీలు, సాంబారు... ఈ ఘుమఘుమలు బెంగళూరు నుంచి మన హైదరాబాద్‌ను తాకి, దేశం దాటి దుబాయ్‌కి కూడా చేరాయి. ఇకపై సింగపూర్‌కి విస్తరించాలనేది దివ్య లక్ష్యం. తన ఫుడ్ చైన్‌కి 'ద రామేశ్వరం కేఫ్' అని పెట్టడానికి కారణం తాను అత్యంత ఎక్కువగా గౌరవించే మన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ సొంతూరు రామేశ్వరం (తమిళనాడు రాష్ట్రం) కావడమే అంటోంది. పెద్ద కలలు కనమని చెప్పిన కలామ్‌కి తన విజయాన్ని అంకితం చేసింది దివ్య.




● 'ద రామేశ్వరం కేఫ్' రెస్టారెంట్



● భర్త రాఘవరావుతో దివ్య

యూత్ పల్స్



'వ్యాపారం మొదలుపెట్టాలనుకుంటున్నాను. డబ్బు లేదు' అనే వాళ్లలో చాలామందికి ఐడియా ఉండదు. అంటే... ఏ వ్యాపారాన్ని ప్రారంభించాలి, ఎక్కడ ప్రారంభించాలి, ఎప్పుడు ప్రారంభించాలి... మొదలైన విషయాలపై అవగాహన ఉండదు. 'అద్భుతమైన ఐడియా' మన దగ్గర ఉంటే వ్యాపారం ప్రారంభించడానికి పెట్టుబడి అనేది పెద్ద సమస్య కాదని యువతరంలో ఎంతోమంది నిరూపించారు. 'షార్క్ ట్యాంక్ ఇండియా' నుంచి 'ఇండియన్ స్టార్టప్ స్టోరీస్' లాంటి ఎన్నో టీవీ షోల ద్వారా స్ఫూర్తి పొంది ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కంటున్న యువతరం ఆ కల దగ్గరే ఆగిపోవడం లేదు. దానిని సాకారం చేసుకోవడానికి ఎంతో ఇష్టంగా కష్టపడుతున్నారు...

'షార్క్ ట్యాంక్ అమెరికా కార్యక్రమాన్ని ఇష్టంగా చూసేదాన్ని. డల్లాస్ మావరిక్స్ ఓనర్ మార్క్ క్యూబన్, బ్రాక్‌సిస్టమ్స్ ఫౌండర్ రాబర్ట్ హర్జైవెక్, ఫర్ యువర్ ఈజీ వోస్లీ ఫౌండర్, ప్రెసిడెంట్ లారీ గ్రెనర్‌లు ఎంతోమంది ఎంటర్‌ప్రెన్యూర్‌లు కావడానికి సహాయం అందించారు. షార్క్‌ట్యాంక్ ఇండియన్ వెర్షన్ విషయంలో మొదట్లో ఆసక్తి ఉండేది కాదు. ఆ తరువాత మాత్రం ఆసక్తి పెరిగింది' అంటుంది ముంబైకి చెందిన సైకాలజీ స్టూడెంట్ అహానా గుప్తా.

'ఒక స్టార్టప్ విజయవంతం కావడానికి ఏ అంశాలు తోడ్పడతాయి, మార్కెట్‌కు సంబంధించిన సాధ్యాసాధ్యాలు ఏమిటి, వెంచర్ క్యాపిటలిస్టును ఒప్పించడానికి ఎలాంటి ప్రణాళికను అనుసరించాలి... మొదలైనవి షార్క్ ట్యాంక్ లాంటి టీవీ కార్యక్రమాల ద్వారా నేర్చుకున్నాను' అంటుంది కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ స్టూడెంట్ సుతీర్థ సుహా.

'డిస్కవరీ ప్లస్‌లో ఇండియన్ స్టార్టప్ స్టోరీస్ చూశాను. చూస్తున్న క్రమంలో నాకు తెలియకుండానే బిజినెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విషయాలపై ఆసక్తి పెరిగింది' అంటుంది చెన్నైకి చెందిన ఎంబీఏ స్టూడెంట్' శ్రేయా ఘోష్.

'స్టార్టప్‌లకు సంబంధించిన పరిజ్ఞానానికి పెద్ద నగరాలలో చదవాల్సిన పనిలేదని, ఐఐటీలు, ఐఐఎంలు మాత్రమే స్టార్టప్‌లను విజయవంతంగా సృష్టించగలవనే మూస ధోరణిని స్టార్టప్‌లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన టీవీ కార్యక్రమాలు బ్రేక్ చేస్తున్నాయి' అంటుంది దిల్లీకి చెందిన స్టాటిస్టిక్స్ స్టూడెంట్ సప్తర్షి.

'ఒక కంపెనీ ఈక్విటీ, వాల్యుయేషన్‌ను అర్థం చేసుకోవడానికి ఏ అంశాలు దోహదపడతాయి, మార్కెట్ నుంచి తెలుసుకోవాల్సిన విషయాలు ఏమిటీ... వంటివి షార్క్ ట్యాంక్ ద్వారా తెలుసుకున్నాను' అంటుంది వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ స్టూడెంట్ సహేలి సాహు.

అహానా, సుతీర్థ, శ్రేయ, సప్తర్షి, సహేలి మాత్రమే కాదు...

ఇంజినీరింగ్, కామర్స్, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్... తాము చదువుతున్నది ఏదైనా సరే దేశవ్యాప్తంగా ఎంతోమంది స్టూడెంట్స్ స్టార్టప్‌లకు సంబంధించి టీవీలో వచ్చే రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రాక్టికల్–లైఫ్ బిజినెస్ నాలెడ్జ్‌ను సొంతం చేసుకుంటున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్స్, బిజినెస్ స్ట్రాటజీల గురించి వివరంగా తెలుసుకోవడమే కాదు వ్యాపార రంగంలోకి కూడా అడుగుపెడుతున్నారు.

షార్క్ ట్యాంక్ మాత్రమే కాదు బిలియన్ డాలర్ బయర్(వూట్ టీవీ నెట్‌వర్క్), సిలికాన్ వ్యాలీ (డిస్నీ ప్లస్ హాట్ స్టార్), ఇండియన్ స్టార్టప్ స్టోరీస్ (డిస్కవరీ ప్లస్), స్టార్టప్ (అమెజాన్ ప్రైమ్ వీడియో), అప్‌స్టార్ట్స్ (నెట్‌ఫ్లిక్స్), ప్లానెట్ ఆఫ్ ది యాప్స్(యాపిల్ టీవీ). గర్ల్‌బాస్–టీవీ సిరీస్ (నెట్‌ఫ్లిక్స్)... మొదలైన షోలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి.

ది క్వర్కీ నారీ

మదురైకి చెందిన మాళవిక సక్సేనాకు మనసుకు నచ్చిన ఫుట్‌వేర్ కనిపించేది కాదు. ఏది చూసినా 'ఇది నాకు కరెక్ట్ కాదు' అనిపించేది. కొత్తదనం లోపించిన ఫుట్‌వేర్‌లను చూసీ చూసీ చివరికి హ్యాండ్–పెయింటెడ్ షూ బ్రాండ్ 'ది క్వర్కీ నారీ'ని లాంచ్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని క్రియేట్ చేసింది. ఇన్‌ఫ్లూయెన్సర్‌ల సహాయం తీసుకుంది. 'షార్క్ ఇండియా'లో 'ది క్వర్కీ నారీ' 35 లక్షల ఫండింగ్‌ను గెలుచుకుంది. 'ఎపిసోడ్ ప్రసారం కాగానే ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు పదివేల మంది కొత్త ఫాలోవర్‌లు యాడ్ అయ్యారు. కేవలం నలభై ఎనిమిది గంటల్లో అమ్మకాలు బాగా పెరిగాయి' అంటుంది మాళవిక సక్సేనా.



హార్ట్ అప్ మై స్లీవ్స్

సైకాలజీలో గ్రాడ్యుయేట్ అయిన రియాకు 'ఫ్యాషన్' అంటే ఇష్టం. ఫ్యాషన్ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా పేరు తెచ్చుకోవాలనేది తన కల. 18–33 ఏళ్ల వయసు ఉన్న మహిళలను దృష్టిలో పెట్టుకొని పదివేల రూపాయల పెట్టుబడితో 'హార్ట్ అప్ మై స్లీవ్స్' కంపెనీ మొదలుపెట్టింది. 'షార్క్ ట్యాంక్ ఇండియా' కార్యక్రమంలో తన ఐడియాను వినిపించిన తరువాత ఇన్వెస్టర్‌లు వినీతా సింగ్, అనుపమ్ మిట్టల్ నుంచి రూ. 25 లక్షల ఫండ్ అందుకుంది. 'ఎన్నో డ్రెస్‌లు ఉన్నా ఏది వేసుకోవాలో అనే దాని గురించి ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను... అనే మాట చాలా మంది మహిళల నోటి నుంచి విన్నాను. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్లీవ్స్ ద్వారా ప్రతి డ్రెస్‌కు గ్లామరస్ లుక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. వ్యాపారంలో వినీతా సింగ్, అనుపమ్ మిట్టల్‌లకు ఉన్న అనుభవం, సలహాలు మా వ్యాపారాన్ని విస్తరించడానికి సహాయపడతాయి అని నమ్ముతున్నాను' అంటుంది రియా.




కవచ్


'షార్క్ ట్యాంక్ ఇండియా'లో ఫండ్స్ అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది 13 సంవత్సరాల అనౌష్కా జాలీ. ఆరవ తరగతిలో యాంటీ–బుల్లీయింగ్ స్క్వాడ్(ఏబీఎస్) అనే వెబ్‌సైట్‌కు రూపకల్పన చేసింది. మూడు సంవత్సరాల పాటు యాంటీ–బుల్లీయింగ్ సెషన్స్ నిర్వహించిన అనౌష్క ఆ తరువాత బుల్లీయింగ్‌పై ఫైట్ చేయడానికి 'కవచ్' అనే యాప్‌ను రూపొందించింది. 'షార్క్ ట్యాంక్'లో 'కవచ్' 50 లక్షల ఫండింగ్‌ను గెలుచుకుంది.



హెల్త్ టిప్స్



● నిమ్మ చెక్క మీద ఉప్పు, మిరియాల పొడి చల్లి స్టౌ మీద ఉంచి, కొద్దిగా వేడి చేసి, ఆ రసాన్ని పిండుకొని తాగితే మైగ్రేన్ నుంచి ఉపశమనం దొరుకుతుంది ● నిమ్మ రసం, తేనె, గ్లిజరిన్‌లను సమపాళ్ళలో కలపాలి. రోజుకు మూడుసార్లు ఒక టీ స్పూను చొప్పున తీసుకుంటే దగ్గు త్వరగా తగ్గుతుంది ● ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి, తల తిరిగినట్లు ఉంటుంది. చిన్న అల్లం ముక్క నూరి నిమ్మరసంలో కలిపి తాగితే ఈ బాధల నుంచి ఉపశమనం కలుగుతుంది.


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 338

బుధవారం 28-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



33 బంతుల్లోనే..

టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన నమీబియా క్రికెటర్ జాన్ నికోల్ - 12లో



తుది దశకు దర్యాప్తు


చైనా రుణ యాప్‌ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం వెల్లడి - 13లో



కేజ్రీవాల్‌కు మళ్లీ నోటీసులు

మద్యం విధానం స్కామ్ కేసులో విచారణ కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఈడీ మరోసారి సమన్లు పంపింది.

వివరాలు 6లో ▸



బందీలను వదిలితే యుద్ధ విరామం

బందీలను హమాస్ విడిచిపెడితే.. యుద్ధానికి విరామం ఇచ్చేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



అంతటా మిత్రులే.. కేరళలో తప్ప

దేశమంతా మిత్రులుగా కొనసాగే కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు.. కేరళలో శత్రువులుగా ఉంటాయని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు.

వివరాలు 6లో ▸



హక్కుల కార్యకర్తకు 30 నెలల జైలు

ఉక్రెయిన్‌పై దాడిని తప్పుబట్టిన రష్యా మానవ హక్కుల కార్యకర్త ఒలెగ్ ఓర్లోవ్‌కు మాస్కో కోర్టు 30 నెలల జైలుశిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



మంగళగిరిలో నిర్వహించిన 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మొత్తం గెలుద్దాం

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'లో సీఎం జగన్ దిశానిర్దేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- మీ చేతికి.. 'మంచి' ఆయుధాలిచ్చా
- రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు మేలు చేశాం
- 99 శాతం హామీలను అమలు చేశాం.. విశ్వసనీయత చాటుకున్న పార్టీ మనదే
- 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో మనం గెలవాల్సిందే
- రానున్న 45 రోజులూ రెట్టించిన ఉత్సాహంతో పని చేయండి.. మంచి చేసి ఓటు అడుగుతున్నామన్న గొప్ప సంతృప్తితో ప్రతి ఇంటికీ వెళ్లండి
- ప్రజలకు వివరించి అత్యధిక మెజారిటీలతో గెలిచి రావాల్సిన బాధ్యత మీదే

2లో

“ ప్రతి ఇంటికి మంచి జరిగినప్పుడు ప్రతి గ్రామంలోనూ మనకు అత్యధిక మెజారిటీ ఎందుకు రాదు? గ్రామంలో వచ్చిన మెజారిటీ ప్రతి మండలంలోనూ ఎందుకు రాకుండా ఉంటుంది? ప్రతి నియోజకవర్గంలోనూ ఎందుకు రాకూడదు? అది కుప్పమైనా.. ఇచ్ఛాపురమైనా ఎందుకు జరగకూడదు? పేదవాడు బతకాలంటే, బాగుండాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ రావాలి. ఈ విషయం ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాలి. ప్రజలకు నేను చేయగలిగినంత మంచి చేశా. ఏ పార్టీ, ఏ రాజకీయ నాయకుడూ ఎప్పుడూ ఇవ్వని 'మంచి' ఆయుధాలను మీ అందరి చేతుల్లో పెట్టా. వీటితో ముందుకు వెళ్లి ఎన్నికల్లో గెలిచి రావాల్సిన బాధ్యత మీపై ఉంది. ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో ముందుకు అడుగులు వేయాలి.

- వైఎస్సార్‌సీపీ నాయకులతో సీఎం వైఎస్ జగన్

ఫ్యాక్ట్‌చెక్

వివాదాల 'విహారి'!

- ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్ హనుమ విహారిపై అనేక ఫిర్యాదులు
- తోటి ఆటగాళ్లను అసభ్యంగా దూషించడం నిత్యకృత్యం
- విహారి వ్యవహార శైలిపై కోచ్, హెడ్ కోచ్‌లూ ఫిర్యాదు
- కెప్టెన్‌గా కొనసాగించాలని విహారి బెదిరించి లేఖ రాయించారంటున్న ఆటగాళ్లు
- పృథ్వీరాజ్‌కు చాన్స్ ఇవ్వకుండా గాయపడ్డ ఆటగాడిని కీపర్‌ను చేసిన విహారి

11లో

పట్టు రైతులకు అండగా ప్రభుత్వం

- ఏటా పెరుగుతున్న విస్తీర్ణం, ఉత్పత్తి
- సకాలంలో రాయితీలు, ప్రోత్సాహకాలు చెల్లింపు
- చంద్రబాబు హయాంలో పట్టుగూళ్ల సగటు ధర కిలో రూ.350
- ప్రస్తుతం రూ.480 నుంచి రూ.550 మధ్య కిలో ధర
- భారీ లాభాలను కళ్లజూస్తున్న రైతులు.. అయినా ప్రభుత్వంపై 'ఈనాడు' విషప్రచారం

5లో



నేడు మూడో విడత రైతు భరోసా జమ

- వరుసగా ఐదో ఏడాది రైతు ఖాతాల్లో జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- 53.58 లక్షల మందికి రూ.1,078.36 కోట్ల లబ్ధి
- 10.79 లక్షల మందికి రూ.215.98 కోట్ల సున్నా వడ్డీ రాయితీ
- 57 నెలల్లో రైతన్నలకు రూ.1,84,567 కోట్ల లబ్ధి

3లో

వైద్య ఆరోగ్య శాఖలో మరిన్ని ఉద్యోగాలు

సెకండరీ హెల్త్‌లో 185 స్పెషలిస్ట్ వైద్య పోస్టుల భర్తీకి చర్యలు

- బుధ, శుక్రవారాల్లో వాకిన్ రిక్రూట్‌మెంట్
- అర్బన్ వెల్‌నెస్ సెంటర్లలో 189 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- నేటి నుంచి మార్చి 10వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో జీరో వేకెన్సీ (ఒక్క పోస్టు ఖాళీగా ఉండకూడదు) విధానాన్ని తీసుకువచ్చి పెద్ద ఎత్తున పోస్టుల భర్తీ చేపడుతోంది. వైద్య విద్యా కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. దీనిలో భాగంగా సెకండరీ హెల్త్ డైరెక్టరేట్(ఏపీవీవీపీ) పరిధిలో 185 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి బుధ, శుక్రవారాల్లో ఏపీ మెడికల్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ వాకిన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనుంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ..

మిగతా 3వ పేజీలో ▸





'గగన్‌యాన్' వ్యోమగాములు.. ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, సుభాన్షు శుక్లాను జాతికి పరిచయం చేస్తున్న ప్రధాని మోదీ

భారత 'సూపర్ ఫోర్'

గగన్‌యాన్ వ్యోమగాములను జాతికి పరిచయం చేసిన మోదీ


- ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రోదసిలోకి వెళ్లనున్న నలుగురు భారత వ్యోమగాములను ప్రధాని మోదీ మంగళవారం జాతికి పరిచయం చేస్తూ వారి పేర్లను స్వయంగా ప్రకటించారు. అనంతరం మానవసహిత యాత్రకు ముందు రోదసిలోకి వెళ్లనున్న హ్యూమనాయిడ్ రోబో వ్యోమమిత్రతో సరదాగా సంభాషించారు. మానవ సహిత గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా 2025లో ముగ్గురు వ్యోమగాములను రోదసిలోని 400 కి.మీ.ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలోకి పంపి 3 రోజుల తర్వాత సురక్షితంగా వెనక్కి తీసుకురావాలన్నది ఇస్రో లక్ష్యం.

6లో

“ నాలుగు దశాబ్దాలుగా దేశం కంటున్న కల. నలుగురు వ్యోమగాములు 140 కోట్ల మంది భారతీయుల కలలకు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలవనున్న నాలుగు ప్రబల శక్తులు. గగన్‌యాన్ మిషన్ పూర్తిగా దేశీయంగా రూపుదిద్దుకుని మేకిన్ ఇండియాకు తార్కాణంగా నిలిచింది. - ప్రధాని మోదీ

గ'ఘన'యానులు

కేంద్రంలో మరోసారి బీజేపీ సర్కార్



కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం విజయవాడ, ఏలూరులో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రానున్న ఎన్నికల్లోనూ విజయం సాధించి మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం. ఇతర పార్టీలు అధికారం కోసం పనిచేస్తాయి. బీజేపీ ప్రజలకు సేవ చేయడం కోసమే పనిచేస్తోంది. బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వ విజయాలను తెలియజేయాలి' అని సూచించారు.

3లో

ఇదండీ సంగతి



అదేదో సారు ఇప్పుడే కొత్తగా చేసినట్లు మాట్లాడుతున్నారే వెళ్లండీ!

అట్టుడుకుతున్న టీడీపీ

బాబుకు నిద్రలేని రాత్రిళ్లు!.. టీడీపీలో చల్లారని టికెట్ల చిచ్చు

- ఉండిలో రామరాజుకు సహకరించేది లేదన్న శివరామరాజు
- అవనిగడ్డ సీటు బుద్ధప్రసాద్‌కు ఇవ్వకపోవడంపై కేడర్ నిరసనలు
- పి.గన్నవరంలో మహాసేన రాజేశ్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ శ్రేణుల దాడి
- నిడదవోలు సీటుపై శేషారావు వర్గం ఆగ్రహజ్వాలలు
- కృష్ణాలో 4 నియోజకవర్గాల్లో తమ్ముళ్ల సిగపట్లు
- చంద్రబాబు వారించినా వెనక్కితగ్గని సీనియర్లు

10లో



పి.గన్నవరం టీడీపీ అభ్యర్థిగా రాజేశ్ వద్దంటూ ఆ పార్టీ నేత గంటి హరీశ్‌ను చుట్టుముట్టిన జనసేన కార్యకర్తలు



అంబాజీపేటలో జనసేన కార్యకర్తల దాడిలో ధ్వంసమైన టీడీపీ నేత హరీశ్ కారు అద్దాలు

ఆగ్రహ'సేన'

పవన్ నిర్ణయంపై తిరుగుబాటు

రోడ్లపైకొచ్చి ఆందోళనలు

10లో


- అంబాజీపేటలో జనసైనికుల వీరంగం
- గాల్లోకి లేచిన కుర్చీలు
- టీడీపీ నేత హరీష్ కారు అద్దాలు ధ్వంసం
- హైదరాబాద్‌లో దాక్కున్న పవన్ కళ్యాణ్

ఫిర్యాదు చేస్తే అంతు చూస్తాం

'మార్గదర్శి' బాధితులకు రామోజీ ముఠా బెదిరింపులు

సీఐడీకి ఫిర్యాదు చేసినవారి ఇళ్లకు వెళ్లి హెచ్చరికలు

- బాధితుల సంఘానికి సైతం బెదిరింపు ఫోన్ కాల్స్
- అక్రమాల డొంక కదులుతుండటంతో రాజగురివింద బెంబేలు
- సీఐడీ ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబర్‌కు భారీగా బాధితుల ఫిర్యాదులు



గురివింద రామోజీ-7

10లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పది మందికి ఉపాధి కల్పిస్తున్నా..



మాది మధ్య తరగతి కుటుంబం. ఇద్దరు బిడ్డల్ని పోషించుకుంటూ.. వారిని చదివించేందుకు ఎంతో కష్టపడేవాళ్లం. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లెలో కుటుంబ పోషణ కోసం 2008 నుంచి ఇంట్లోనే మగ్గం నేస్తున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సమకూరిన సుమారు రూ.8 లక్షల రుణంతో పాటు మరో రూ.2 లక్షలు సమకూర్చుకుని చంద్రగిరిలో శారీ రోలింగ్ సెంటర్ ప్రారంభించా. మొదట విడత ఆసరా డబ్బులతో మరో మగ్గంపై పని ప్రారంభించా. రెండో విడత ఆసరాతో టైలరింగ్, మూడో విడత ఆసరాతో శారీ రోలింగ్ యంత్రాలు ఏర్పాటు చేశా. నాలుగో విడత ఆసరా డబ్బులతో శారీ బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నా. ప్రస్తుతం విజయవాడ, హైదరాబాద్‌లో మాత్రమే శారీ బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిని తిరుపతి ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా. ప్రస్తుతం నా వ్యాపారం ద్వారా మరో పది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నా. ఆసరా ద్వారా వచ్చిన రూ.1.04 లక్షలు, డ్వాక్రా రుణం రూ.5.25 లక్షలు, సున్నా వడ్డీ కింద వచ్చిన రూ.20 వేలతో వ్యాపారం అభివృద్ధి చేసుకున్నాం. నా ఇద్దరు పిల్లల చదువులకు జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన అందించారు. వారు డిగ్రీ పూర్తి చేసుకుని, వ్యాపారంలో నాకు చేదోడుగా నిలిచారు. మా జీవితంలో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎస్‌.మునికుమారి, ఎగువ రెడ్డివారిపల్లి
(భూమిరెడ్డి నరేష్ కుమార్, విలేకరి, చంద్రగిరి)

మేము టీడీపీ.. అయినా పథకాలు ఆగలేదు



మాది రాజకీయ కుటుంబం. తెలుగుదేశం పార్టీకి చెందిన నేను 2007 నుంచి 2012 వరకు విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కొణిశ సర్పంచ్‌గా పని చేశాను. మా ఆయన సత్యనారాయణ రేషన్‌డీలర్‌గా కొనసాగుతున్నారు. మాకు కొద్దిపాటి వ్యవసాయ భూమి కూడా ఉంది. అందులో పంటలు సాగు చేసుకుంటున్నాం. ఇప్పటికీ మేము టీడీపీ సానుభూతి పరులమే అయినా మాకు అర్హత ఉందంటూ అన్ని ప్రభుత్వ పథకాలూ వర్తింపచేశారు. మా పార్టీ పాలనలో కనీసం ఇల్లు కూడా మంజూరు కాలేదు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 వంతున వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద నాకు ఇప్పటి వరకు రూ.18,200, మా పాప డిగ్రీ చదివినపుడు విద్యాదీవెన కింద రూ.6,500 వచ్చింది. మాకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం కూడా అందింది. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు మంజూరవుతున్నాయి. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నారనడానికి మేమే ఉదాహరణ.

– శీరంరెడ్డి లక్ష్మి, కొణిశ
(పాండ్రంకి అప్పలనాయుడు, విలేకరి, గజపతినగరం రూరల్)

కష్టాల నుంచి గట్టెక్కాం



రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం నాది. నేను లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడిని. మేం వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం గండికొవ్వూరులో భార్య వెంకటసుబ్బమ్మ, ముగ్గురు ఆడపిల్లలతో ఉంటున్నాం. 2019కి ముందు మాకు ఎలాంటి ప్రభుత్వ సాయం అందలేదు. నేను సంపాదించి తెస్తేనే నాలుగువేళ్లు నోట్లోకెళ్లేవి. ప్రస్తుతం ఆటో నడుపుతూ కుటుంబ పోషణ, పిల్లల చదువులు నెట్టుకొస్తున్నా. జగనన్న ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. జగనన్న సాయంతో పాటు నేను కూడబెట్టిన సొమ్ముతో పెద్ద కూతురు మనీషకు పెళ్లి చేశా. రెండో పాప అంజలి డిగ్రీ సెకెండియర్, చిన్నపాప జ్యోత్స్న ఓపెన్ స్కూల్లో ఇంటర్ చదువుతున్నారు. వాహన మిత్ర ద్వారా నాకు ఏటా రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందుతోంది. రైతు భరోసా కింద రూ.40 వేలు లబ్ధి కలిగింది. మా పాపకు అమ్మఒడి పథకంలో ఇప్పటి వరకు రూ.30 వేలు అందాయి. రెండో పాపకు విద్యా దీవెన పథకంలో రూ.13 వేలు, వసతి దీవెన కింద రూ.10 వేలు బ్యాంక్ ఖాతాలో జమయింది. నా భార్యకు సున్నా వడ్డీ ద్వారా రూ.10 వేలు లబ్ధి చేకూరింది. జగనన్న కాలనీలో ఇల్లు కూడా మంజూరైంది. అప్పటికే నేను కొత్తగా ఇల్లు కట్టుకుని ఉండటంతో వేరే వారికి ఇవ్వండని మనస్ఫూర్తిగా చెప్పేశా. ఇద్దరు బిడ్డల చదువు జగనన్న ప్రభుత్వమే చూసుకుంటోంది. జగనన్న ఉండగా మాకేం చింతలేదు. ఆయన మేలు ఎప్పటికీ మరచి పోలేం.

– గిత్తోళ్ల రామాంజనేయులు, గండికొవ్వూరు
(ఇందుకూరు మురళీధర్, విలేకరి, చక్రాయపేట)

డ్రగ్ పార్టీలో డైరెక్టర్ క్రిష్

మాదాపూర్ డీసీపీ వినీత్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్: గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన డ్రగ్ పార్టీలో ప్రముఖ సినీ దర్శకుడు క్రిష్ పాల్గొన్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్ తెలిపారు. అయితే కొకైన్ వాడారా? లేదా? అనేది తెలియాల్సి ఉందన్నారు. ఈ పార్టీ కోసం డ్రగ్ సరఫరా చేసిన (పెడ్లర్) సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీని అరెస్టు చేశామని చెప్పారు. రాడిసన్ హోటల్‌లో చాలాసార్లు డ్రగ్ పార్టీలు చేసుకున్నట్లు అతను చెప్పాడని మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ డీసీపీ తెలిపారు. క్రిష్ రెండురోజుల్లో విచారణకు వస్తారని, ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డీసీపీ చెప్పారు. డ్రగ్స్ హైదరాబాద్‌లోనే కొనుగోలు చేసినట్లు అబ్బాస్ చెబుతున్నాడని, అయితే ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందో విచారణలో తేలుతుందని చెప్పారు.

నేడు పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో సీఎం పర్యటన

29న జరగాల్సిన పామర్రు పర్యటన వాయిదా

సాక్షి,అమరావతి: సీఎం జగన్ ఈ నెల 28న (బుధవారం) పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి భీమవరం చేరుకుని అక్కడి రాధాకృష్ణ కన్వెన్షన్‌లో జరిగే వైఎస్సార్‌సీపీ నేత గుణ్ణం నాగబాబు కుమారుడు వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదిస్తారు. అనంతరం అక్కడి నుంచి విశాఖ చేరుకుని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే పార్టీ నేత కోలా గురువులు కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన అనంతరం సాయంత్రం తాడేపల్లికి చేరుకుంటారు. కాగా, ఈ నెల 29న కృష్ణా జిల్లా పామర్రులో జరగాల్సిన సీఎం జగన్ పర్యటన వాయిదా పడింది.

మొత్తం గెలుద్దాం

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'లో సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం





మంగళగిరిలో నిర్వహించిన సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో మరో 45 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. గత 57 నెలలుగా లంచాలు, వివక్షకు తావులేకుండా కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకూ 87 శాతం కుటుంబాలకు మంచి చేయగలిగాం. దేశ చరిత్రలో ఏ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు ఎప్పుడూ ఇవ్వని ఆయుధాలను మీ చేతుల్లో పెట్టా. ఇప్పటికే మన పార్టీ టిక్కెట్లన్నీ దాదాపుగా ఖరారయ్యాయి. రెట్టించిన ఉత్సాహంతో క్షేత్ర స్థాయిలోకి వెళ్లండి. ప్రజలకు మంచి చేసి ఓట్లు అడుగుతున్నామన్న గొప్ప సంతృప్తితో ఇంటింటికీ వెళ్లండి. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీలతో గెలిచి రావాల్సిన బాధ్యత మీదే' అని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో చరిత్రాత్మక విజయం సాధించామని గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికీ మంచి చేసిన నేపథ్యంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లోనూ గెలవాల్సిందేనని శ్రేణులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' పేరుతో మంగళవారం సీఎం జగన్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. 175 నియోజకవర్గాల నుంచి సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు, మండల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ, మండల, జగనన్న సచివాలయాల కన్వీనర్లు సహా పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

క్లాస్ వార్..

ఇవాళ జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. ఇది క్లాస్ వార్ అని గుర్తు పెట్టుకోండి. పేదవాడు ఒకవైపున.. పెత్తందార్లు మరొకవైపున నిలిచి యుద్ధం జరుగుతోంది. మీ జగన్ ఉంటే పేదవాడు బాగుపడతాడు. మీ జగన్ ఉంటే లంచాలు, వివక్ష లేకుండా పథకాలు కొనసాగుతాయి. ఇంటికే వలంటీర్ వస్తాడు. అవ్వాతాతలకు తోడుగా ఉంటూ సహాయం అందుతుంది. మీ జగన్ ఉంటేనే బడులు బాగుంటాయి. పేద బిడ్డలకు ఇంగ్లీషు మీడియం అందుతుంది. మీ జగన్ ఉంటేనే గ్రామాలలో విలేజ్ క్లినిక్‌లు పనిచేయడం కొనసాగుతుంది. విస్తరించిన ఆరోగ్యశ్రీ గొప్పగా సేవలు అందిస్తుంది. ఏ పేదవాడు ఆరోగ్యం కోసం అప్పులు పాలు కాకుండా వైద్యం అందే పరిస్థితి కొనసాగాలంటే జగన్ ఉంటేనే జరుగుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయంలో ఎవరి ఊహకూ అందని మార్పులు తీసుకొచ్చాం. అక్క చెల్లెమ్మలకు దిశ యాప్‌తో భద్రత కల్పిస్తున్నాం. ఇవన్నీ కొనసాగాలంటే మీ జగన్‌తోనే సాధ్యమనే సందేశాన్ని, అందరికీ చేరవేయాలి.

విశ్వసనీయతే మన బలం..

రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా, ఏ ఇంటికి వెళ్లి అడిగినా విశ్వసనీయత ఉన్న పార్టీ ఏదంటే ఒక్క వైఎస్సార్‌సీపీనే అనే మాట వినపడుతుంది. ఒక పార్టీకి, రాజకీయ నాయకుడికి ఇది చాలా చాలా అవసరం. బహుశా దేశ రాజకీయాల్లో ఇలాంటి గౌరవం ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కింది. ప్రతి కార్యకర్త తమ నాయకుడిని చూపించి కాలర్ ఎగరేసే పరిస్థితి ఉన్నప్పుడే ఆ పార్టీకి గౌరవం లభిస్తుంది. పార్టీ నాయకుడు కూడా అలాగే వ్యవహరించాలి. విశ్వసనీయతే మన బలం.

మనం కూడా అలాంటి వాగ్దానాలిద్దామన్నారు!

2014లో చంద్రబాబు 650 పేజీలతో మేనిఫెస్టో తెచ్చి అందరినీ మోసగించారు. అసాధ్యమని తెలిసినా రైతన్నలకు రూ.87,612 కోట్లు రుణమాఫీ మొదట సంతకంతోనే చేస్తానని నమ్మబలికారు. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలన్నాడు. దాదాపు రూ.15 వేల కోట్ల పొదుపు సంఘాల రుణాలనూ మాఫీ చేస్తానన్నాడు. ఇంటింటికీ ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి అని అన్నాడు. అప్పుడు మన పార్టీలో కూడా చాలామంది శ్రేయోభిలాషులు మనం కూడా అలాంటి వాగ్దానాలు ఇద్దామన్నారు. ఇప్పుడు హామీలిచ్చి ఎన్నికలు అయిపోయిన తరువాత చూద్దామన్నారు. ఒకవైపు చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతుంటే మనం నీతిగా, నిజాయితీగా యుద్ధం చేయడం కుదరదని నాకు సలహా ఇచ్చారు. అప్పుడు నేను ఒక్కటే అన్నాను. విలువలు, విశ్వసనీయత అనే పదాలకు అర్థం చెబుతూ మనం చేయగలిగిందే చెబుదామని సూచించా. ఒక పని చేయలేమని తెలిసినప్పుడు మన నోటి నుంచి ఆ మాట రాకూడదని చెప్పా. నాడు ఆ మోసాలకు తోడు ప్రధాని మోదీ గాలి వీస్తుండటంతో దత్తపుత్రుడి సహకారంతో చంద్రబాబు గద్దెనెక్కారు. మోసం చేసి అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను చంద్రబాబు చెత్తబుట్ట పాలు చేశారు. వెబ్‌సైట్ నుంచి కూడా మాయం చేశారు. మోసం ఎల్లప్పుడూ నిలబడదు. చివరకు ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారంటే టీడీపీ తరఫున గ్రామాల్లో ప్రచారం చేయడానికి కూడా ఆ పార్టీ క్యాడర్ సాహసించలేదు.

99 % హామీలు అమలు చేశాం

2019లో మనం కేవలం రెండు పేజీలతో మేనిఫెస్టో తీసుకొచ్చాం. రెండు పేజీలు ఎందుకంటే ఆ మేనిఫెస్టో ప్రజలకు గుర్తుండాలి. అధికారంలోకి వచ్చాక మనకూ గుర్తుండాలి. నాడు మేనిఫెస్టో అంశాల గురించి చర్చిస్తుంటే విజయనగరం జిల్లాలో అప్పల నరసయ్య ఇవన్నీ సాధ్యమేనా? అని నాతో అన్నారు. ఇవన్నీ కచ్చితంగా చేసి తీరుతామని చెప్పా. అన్నీ ఆలోచన చేసిన తర్వాతనే నిర్ణయాలు తీసుకున్నాం. ప్రతిమాట నెరవేరుస్తానని చెప్పా. చరిత్రలో ఎప్పుడు చూడని విధంగా 151 స్థానాలతో అధికారంలోకి వచ్చాం. 22 ఎంపీ స్థానాలు గెల్చుకున్నాం. ఏకంగా 99 శాతం హామీలను నెరవేర్చాం, మీరే చూసి టిక్కు పెట్టాలని ప్రతి ఇంటికీ వెళ్లి చిత్తశుద్ధితో అడుగుతున్నాం.

నాడు నవ్వుకుని ఉంటారు.. మనం సాధ్యం చేశాం

57 నెలల కాలంలో పరిపాలనలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చాం. ఇన్ని వందల కోట్లు, ప్రతి ఇంటికీ రూ.లక్షలు ఇవ్వడం.. అది కూడా పారదర్శకంగా అందించడం సాధ్యమేనా? అని గత ఎన్నికలకు ముందు ఎవరైనా ప్రశ్నిస్తే చాలా మంది నవ్వుకుని ఉంటారు. అయితే అది సాధ్యమేనని మనం వచ్చాక చూపించగలిగాం. గ్రామాల్లో స్కూళ్లు మారాయి. ఊహకు కూడా అందని విధంగా ఇంగ్లీషు మీడియం చదువులు, ట్యాబ్‌లు, క్లాస్‌రూమ్‌లలో డిజిటల్ బోధన తీసుకొచ్చాం. ప్రతి పేద బిడ్డకూ నాణ్యమైన విద్య అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం మనదే.

పొరపాటు జరిగితే మళ్లీ అరాచకమే

ఎవరైనా పొరపాటున వైఎస్సార్‌సీపీకి ఓటు వేయకపోతే మళ్లీ జన్మభూమి కమిటీలు సంతకం పెట్టినట్టే. ఇంటివద్దే పారదర్శకంగా అందిస్తున్న పథకాలన్నీ వద్దని మనంతట మనం సంతకం పెట్టినట్టే. పొరపాటు చేస్తే పేదవాడి గురించి ఆలోచించే పరిస్థితే ఉండదు. విశ్వసనీయత అన్న పదానికి అర్థం ఎక్కడా ఉండదు. మళ్లీ పేదవాడి బతుకు చిన్నాభిన్నమే అవుతుందనే సంకేతం ప్రతి గడపకూ చేరవేయాలి. అమ్మా..! జగన్ ఏదైనా చెబితే చేస్తాడు. చెప్పే ముందు నాలుగు సార్లు ఆలోచన చేస్తాడు. చేయగలిగింది మాత్రమే చెబుతాడు. కానీ చంద్రబాబు అలాంటి వ్యక్తి కాదు. ఎన్నికల కోసం, ఓట్ల కోసం ఆయన ఏమైనా చెబుతాడు. అవసరం కోసం ఎవరినైనా మోసం చేస్తాడన్నది మన కళ్లెదుటే కనిపించిన సత్యం. 2014లో ఇదే చూశాం. దానికన్నా ముందు కూడా అదే చూశాం. ఇవాళ కేజీ బంగారం, ప్రతి ఇంటికి బెంజ్ కారు కొనిస్తానంటున్నాడు. పొరపాటు చేస్తే మళ్లీ అరాచకం వస్తుందని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలి.

సచివాలయం యూనిట్‌గా..

ప్రతి గ్రామంలో బూత్ స్థాయిలో మన ఆర్గనైజేషన్ ఎలా ఉందన్నది ఎమ్మెల్యేలు పరిశీలించాలి. నియోజకవర్గస్థాయి, మండలస్థాయి నుంచి అన్ని కమిటీలను అసెస్ చేసుకోవాలి. మీ అందరికీ ఒక్కటే సలహా ఇస్తున్నా. ప్రతి సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకోండి. మీకు కళ్లు, చెవులుగా వ్యవహరించే అత్యంత నమ్మకమైన వ్యక్తులను గుర్తించి ఈ నెలన్నర రోజులు అక్కడే పెట్టండి. ఆ సచివాలయం పరిధిలోని కేడర్, అభిమానులు, వలంటీర్లను వారు మీకు దగ్గర చేయాలి. అది మీరు రెగ్యులర్‌గా పర్యవేక్షించాలి. ప్రతి నియోజకవర్గంలో 80 సచివాలయాలు ఉంటాయి. వాళ్లకు మీ ఫోన్ అందుబాటులో ఉండాలి. వాళ్లు ఏ సచివాలయంలోనైనా, ఎక్కడైనా గ్యాప్ కనిపిస్తున్నట్లు గుర్తిస్తే ఎప్పుడు ఫోన్ చేసినా మీరంతా రిసీవ్ చేసుకునే పరిస్థితుల్లో ఉండాలి. సచివాలయం పరిధిలో ప్రతి అభిమాని, ప్రతి వలంటీర్, కేడర్‌లో ప్రతి ఒక్కరూ మన ఎమ్మెల్యే అభ్యర్థికి దగ్గర కావాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. మీరు సచివాలయంలో పెట్టిన వ్యక్తి ద్వారా బూత్ కమిటీల మీద ధ్యాస పెట్టండి. ప్రతి వలంటీర్‌కు అనుసంధానంగా గృహసారథులతో కలిసి బూత్ కమిటీ సభ్యులను నియమించాం. నలుగురు మనుషులు (ఒక బూత్ ఇన్‌ఛార్జి, ముగ్గురు కన్వీనర్లు) ఆ బూత్ కింద ఉన్న క్లస్టర్‌ను పర్యవేక్షించాలి. ఈ ఆర్గనైజేషన్ చాలా ముఖ్యం. దీన్ని గుర్తుపెట్టుకొండి. 45 రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయన్న సంగతి జ్ఞాపకం పెట్టుకోండి.

ఆర్గనైజేషన్ అత్యంత కీలకం..

మన పార్టీలో టిక్కెట్లన్నీ దాదాపుగా ఖరారు అయ్యాయి. మార్చాల్సినవన్నీ 95 శాతం మార్పు చేశాం. ఇంకా ఏదైనా ఒకటి అరా మాత్రమే ఉంటాయి. కచ్చితంగా ఆర్గనైజేషన్ మీద ధ్యాస పెట్టండి. ఇందులో మీరు విఫలమైతే ఎవరూ కాపాడలేరు. ఎందుకంటే... ఇంతగా ప్రతి ఇంటికి మంచి చేసి, ఇన్ని లక్షలు మీకు మంచి జరిగిందని ఏకంగా లెటర్లు తమ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఇచ్చిన పరిస్థితి బహుశా దేశంలో ఎక్కడా ఉండకపోవచ్చు. ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే మన ఎమ్మెల్యేలకు ఆ అవకాశం కల్పిస్తోంది. కాబట్టి మీరు ఆర్గనైజేషన్ మీద ధ్యాస పెట్టండి. ప్రతి ఇంటికి ఇంత మంచి జరిగినప్పుడు ప్రతి గ్రామంలోనూ మనకు అత్యధిక మెజార్టీ ఎందుకు రాదు? గ్రామంలో వచ్చిన మెజార్టీ ప్రతి మండలంలోనూ ఎందుకు రాకుండా ఉంటుంది? ప్రతి నియోజకవర్గంలోనూ ఎందుకు రాకూడదు? అది కుప్పమైనా.. ఇచ్ఛాపురమైనా ఎందుకు జరగకూడదు? పేదవాడు బతకాలంటే, బాగుండాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ రావాలి. ఈ విషయం ప్రతి ఇంటికి వెళ్లి చెప్పగలిగాలి. ప్రజలకు నేను చేయగలిగినంత మంచి చేశా. ఏ పార్టీ, ఏ రాజకీయ నాయకుడూ ఎప్పుడూ ఇవ్వని ఆయుధాలను మీ అందరి చేతుల్లో పెట్టా. వీటితో ముందుకు వెళ్లి ఎన్నికల్లో గెలిచి రావాల్సిన బాధ్యత ఈ 45 రోజుల్లో మీరు చేసే ఆర్గనైజేషన్ బలంపై ఆధారపడి ఉంది. ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో, అంతే విశ్వాసంతో ముందుకు అడుగులు వేయాలి. మీ అందరికీ ఆల్ ది బెస్ట్ విషెస్..

కుప్పానికి రూ.1,400 కోట్లు.. ప్రత్యర్థి గుండెల్లో రైళ్లు

రాష్ట్రవ్యాప్తంగా ఏ నియోజకవర్గాన్ని తీసుకున్నా 87 శాతం పైచిలుకు ఇళ్లకు మంచి చేయగలిగాం. కుప్పం గ్రామీణ నియోజవర్గం కాబట్టి అక్కడ 93.29 శాతం ఇళ్లకు మంచి చేయగలిగాం. నేను చెప్పే విషయం చాలా జాగ్రత్తగా వినండి. ఎవరైనా నేను కుప్పంలో చెప్పిన మాటలు వినకపోతే కచ్చితంగా యూట్యూబ్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వినండి. ఎందుకంటే కుప్పంలో నేను ప్రస్తావించిన అంశాలే ప్రతి నియోజకవర్గంలోనూ అవే మాదిరిగా పరిస్థితులున్నాయి. కుప్పంలో 87 వేల పైచిలుకు ఇళ్లు ఉంటే ఏకంగా 83 వేల ఇళ్లకు మంచి జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మీ జగన్ బటన్ నొక్కి రూ.2.55 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తే అందులో రూ.1,400 కోట్లు కుప్పం నియోజకవర్గంలో 83 వేల ఇళ్లకు ఇవ్వగలిగాం. కుప్పంలో గతంలో 30 వేల ఇళ్లకు మాత్రమే పెన్షన్ వస్తుంటే మనం 45 వేల కుటుంబాలకు ఇస్తున్నాం. ఒక్క పెన్షన్లకే కుప్పంలో రూ.507 కోట్లు ఇచ్చాం. చేయూత, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి కూడా అలాగే అందించాం. ఇళ్ల స్థలాలు 30 వేలకు పైగా కుటుంబాలకు అందుతున్నాయి. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు కాకుండా మనం అన్ని వందల కోట్లు ఇచ్చినప్పుడు ప్రత్యర్థి గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ఖాయం. ఈ డేటా మీ అందరికీ అందుబాటులోకి ఉంది.

వైఎస్సార్‌సీపీ గెలుపును ఏ శక్తులూ ఆపలేవు



నిత్యం ప్రజల్లోనే ఉండి ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నాం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దగ్గరి నుంచి ప్రజల్లో మమేకమై పనిచేస్తున్నాం. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపును ఏ శక్తులు ఆపలేవు. ఎంతమంది జతకట్టుకుని వచ్చినా సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల ముందు నిలవలేరు. వీటి గురించి ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం. టీడీపీ-జనసేన సీట్ల సర్దుబాటు అతుకుల బొంతగా కనిపిస్తోంది. ఎన్నికలను ఎదుర్కోవడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారు.

– ఆర్కే రోజా, మంత్రి

ఖాళీ బిందెలే సౌండ్ ఎక్కువ చేస్తాయి...



ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలి అనే దానిపై సీఎం జగన్ కొన్ని సూచనలు, సలహాలిచ్చారు. సమావేశం విజయవంతంగా జరిగింది. చాలామంచి సందేశం ఇచ్చారు. కేడర్‌లో నూతనోత్తేజం నెలకొంది. వైఎస్సార్‌సీపీ 175కు 175 స్థానాల్లో విజయం సాధిస్తుంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. పవన్, లోకేశ్, చంద్రబాబు ఆటలు సాగవు. ఎవరు మమ్మల్ని అడ్డుకోలేరు. విశ్వసనీయత ఉన్న పార్టీ వైఎస్సార్‌సీపీ అని ప్రజలు నమ్ముతున్నారు. టీడీపీ-జనసేన-కాంగ్రెస్-బీజేపీ తీరు ఖాళీ బిందెల టైపు అన్నట్లు ఉంది.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

99 శాతం హామీలు నెరవేర్చారు జగన్..



వైఎస్ జగన్ సీఎం అయ్యాక 99 శాతం హామీలు నెరవేర్చారు. అందుకే ఈరోజు మా కార్యకర్తలు ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నారు. చంద్రబాబు 600 పైగా హామీలు ఇచ్చి అందులో 10 శాతం కూడా నెరవేర్చలేదు. అసలు మ్యానిఫెస్టోనే వెబ్‌సైట్ నుంచి తీసేసిన చరిత్ర ఆయనది. డ్వాక్రా రుణమాఫీ, రైతు రుణమాఫీ, ఇంటికొక ఉద్యోగం.. నిరుద్యోగభృతి ఏదీ చేయలేదు. ఏం ముఖం పెట్టుకుని చంద్రబాబు ప్రజల వద్దకు వెళ్తారు. ఈరోజు ఏం చేశామో చెప్పి 175కు 175 ఎమ్మెల్యే స్థానాలు గెలవబోతున్నాం. సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగించారు.

– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ

సీఎం జగన్‌ను వాళ్లు తట్టుకోలేరు..



అభ్యర్థులు మాకు దొరక్కపోవటం ఏమిటి? ప్రకటించకపోవటం ఏంటి? చూస్తున్నారు గదా మా కోలాహలం.. వారు రా కదలిరా.. అంటే ప్రజలు ఎవ్వరూ రావటంలేదు. బాబు-పవన్‌లు సీట్లు ప్రకటించారు కదా? వారి పార్టీల్లో ఏం జరుగుతోందో చూస్తున్నారు కదా? కాపు సోదరులు, జనసేన కేడర్ పవన్‌ను సీఎం సీఎం అంటుంటే, పవన్ మాత్రం చంద్రబాబును సీఎం సీఎం అంటున్నారు. ప్యాకేజీ లేకుంటే ఎందుకు అంటారు. 45 రోజులు వేచి చూస్తే సరి. సీఎం జగన్ ముందు వీళ్లు తట్టుకోలేరు.

– అంబటి రాంబాబు, మంత్రి

పవన్, బాబులకు ప్రజల్లో బలంలేదు



జనసేన-టీడీపీ పొత్తు హిట్ కాదు. వారికి ప్రజల్లో బలంలేదు. సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదిరించలేం అని తెలిసింది కాబట్టే వారు పొత్తులతో వస్తున్నారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రజలు ఒక్కటే చెబుతున్నారు.. మా కుటుంబాల్లో ఎప్పుడు ఇంత మార్పు రాలేదని.. మా కుటుంబాల్లో పేదరికం పోయిందంటున్నారు. కాబట్టి సీఎం జగనన్నకే మళ్లీ ఓటువేసి రెండోసారి ఆయన్ను సీఎంను చేసుకొంటాం అంటున్నారు. బాబు మోసాన్ని, జగన్ మంచిని ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. గెలుపు ఖాయం.

– తానేటి వనిత, మంత్రి

'వైనాట్ 175'కు ప్రజలు సిద్ధంగా ఉన్నారు



ఏ ప్రభుత్వం కూడా ఇంత సంక్షేమం అందించలేదు. సీఎం జగన్ చెప్పిన పథకాలే కాకుండా చెప్పనివి మరో 24 అమలుచేశారు. సచివాలయంలో డిస్‌ప్లే బోర్డు చూస్తే వైఎస్సార్‌సీపీ ప్రజలకు ఏం చేసిందో తెలుస్తుంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబం జీవన స్థితిగతులు మారాయి. నరసాపురం పార్లమెంట్ స్థానం గతంలో అగ్రవర్ణాల వారికి, ఆర్థికంగా బలమైన వారికే కేటాయించేవారు. ఇప్పుడు నాలాంటి బీసీ మహిళలను సీఎం జగన్ పోటీచేయిస్తున్నారు. ఇది కదా మహిళా సాధికారత. వైనాట్ 175 అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– గూడూరు ఉమాబాల, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జ్

నేడు మూడో విడత
రైతు భరోసా జమ



వరుసగా ఐదో ఏడాది రైతు ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: వరుసగా ఐదో ఏడాది.. వైఎస్సార్ రైతు భరోసా కింద మూడో విడత పెట్టుబడి సాయం సొమ్మును రైతుల ఖాతాల్లో బుధవారం జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీంతోపాటు రబీ 2021–22, ఖరీఫ్–2022 సీజన్లకు గాను అర్హులైన రైతు కుటుంబాలకు సున్నా వడ్డీ రాయితీ సొమ్మును సైతం చెల్లించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ రెండు పథకాలకు అర్హత పొందిన 64.37 లక్షల రైతు కుటుంబాల ఖాతాలకు రూ.1,294.34 కోట్ల సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేయనున్నారు.

ఐదేళ్లలో రైతు భరోసా కింద రూ.34,228 కోట్ల లబ్ధి

ఎన్ని కష్టాలు ఎదురైనా.. ఇచ్చిన మాట కంటే మిన్నగా చెప్పిన సమయానికి వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. నాలుగేళ్ల పాటు ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించిన ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది ఇప్పటికే రెండు విడతల్లో రూ.11,500 చొప్పున జమ చేసింది. మూడో విడతగా ఒక్కొక్కరికి మరో రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మంది రైతన్నల ఖాతాలకు రూ.1,078.36 కోట్లను బుధవారం జమ చేయనుంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతన్నలతో పాటు సెంటు భూమి కూడా లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్ (అటవీ), దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతన్నలకు కూడా 'వైఎస్సార్ రైతు భరోసా' కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వంగా నిలిచింది. ఏటా రూ.12,500 చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు అందిస్తామన్న ఎన్నికల హామీకి మిన్నగా ఏటా రూ.13,500 చొప్పున రూ.67,500 జమ చేసింది. బుధవారం అందిస్తున్న సాయంతో కలిపి రూ.34,288 కోట్లు జమ చేసినట్టవుతుంది.

క్రమం తప్పకుండా సున్నా వడ్డీ రాయితీ

రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకుని సమయానికి తిరిగి చెల్లించిన రైతన్నలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద పూర్తి వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. రబీ 2021–22, ఖరీఫ్–2022లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 10,78,615 మంది రైతన్నలకు రూ.215.98 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును బుధవారం జమ చేయనున్నారు. 2014–15 నుంచి 2018–19 వరకు పెండింగ్ పెట్టిన బకాయిలతో సహా బుధవారం అందిస్తున్న రూ.215.98 కోట్లతో కలిపి.. 57 నెలల్లో వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద 84.66 లక్షల మంది రైతులకు అందించిన వడ్డీ రాయితీ మొత్తం రూ.2,050.53 కోట్లు అవుతోంది. తాజాగా జమ చేస్తున్న సాయంతో కలిపి 57 నెలల్లో రైతులకు వివిధ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1,84,567 కోట్ల సాయం అందించింది.

తొలిరోజు 'టెట్' ప్రశాంతం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)–2024 మంగళవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. ఉదయం నిర్వహించిన పేపర్ 1ఏకు 14,801 (86.37%) మంది, మధ్యాహ్నం సెషన్‌లో 15,104 (87.54%) మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది అభ్యర్థులకు ఫేషియల్ అటెండెన్స్‌లో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయని, అయితే, ఏ అభ్యర్థికి నష్టం కలగకుండా సాంకేతిక సమస్యలను పరిష్కరించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. హాల్ టికెట్‌లో అభ్యర్థుల వివరాలు పూర్తిగా తప్పుగా ఉంటే వారిని పరీక్షకు అనుమతించలేదని, అయినప్పటికీ అభ్యర్థికి సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లను డీఈవో పరిశీలించాలని, అభ్యర్థన సరైనదయితే సవరణ కోసం రాష్ట్ర స్థాయిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. అలాంటి అభ్యర్థులకు తర్వాతి సెషన్‌లో పరీక్ష రాసేలా అవకాశం కల్పిస్తామన్నారు. తొలిరోజు విజయవాడలోని ఏపీ టెట్ పరీక్షా కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్ కుమార్ పరిశీలించారు. హైకోర్టు ఆదేశాల మేరకు బీఈడీ అభ్యర్థులకు పేపర్ 1ఏ రాసేందుకు అనుమతి లేదని కమిషనర్ తెలిపారు. ఆయా అభ్యర్థులు ఈ పరీక్షకు చెల్లించిన ఫీజును అభ్యర్థి ఖాతాకు జమచేస్తామని చెప్పారు.

క్లుప్తంగా...

సిద్ధం సభకు ఏర్పాట్ల పరిశీలన



సిద్ధం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న తలశిల రఘురామ్, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

మేదరమెట్ల: బాపట్ల జిల్లా పీ.గుడిపాడు జాతీయ రహదారి పక్కన మార్చి 3న నిర్వహించనున్న సిద్ధం సభ ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. సీఎం వైఎస్ జగన్ హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. సభకు 10 లక్షల మందికి పైగా హాజరవుతారని, వారికి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తలశిల తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ సభకు వచ్చేవారి వాహనాలను సురక్షితంగా పార్కింగ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చట్ట ప్రకారమే చర్యలు

స్పీకర్ తమ్మినేని సీతారామ్



సాక్షి, అమరావతి: ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చట్ట ప్రకారమే చర్యలు తీసుకున్నానని స్పీకర్ తమ్మినేని సీతారామ్ స్పష్టం చేశారు. మంగళగిరిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన వారితోపాటు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ఎమ్మెల్యేలపై కూడా చట్ట ప్రకారం అనర్హత వేటు వేశానని గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ తాను తీసుకున్న నిర్ణయంలో సీఎం వైఎస్ జగన్ ప్రమేయం లేదని.. ఈ అంశంపై టీడీపీ విమర్శలు అర్థం లేనివని కొట్టిపారేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి శాసనసభకు ఎన్నికై టీడీపీలో చేరిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిపై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పిటిషన్ దాఖలు చేశారన్నారు. టీడీపీ నుంచి శాసనసభకు ఎన్నికై.. ఆ పార్టీ వ్యవహారశైలి నచ్చక వైఎస్సార్‌సీపీకి మద్దతు పలుకుతున్నారనే కారణంతో వాసుపల్లి గణేష్‌కుమార్, వల్లభనేని వంశీ, మద్దాళి గిరిధర్, కరణం బలరామ్‌పై అనర్హత వేటు వేయాలని ఆ పార్టీ విప్ బాలవీరాంజనేయస్వామి పిటిషన్ దాఖలు చేశారన్నారు.

వీఎంఆర్డీఏ చైర్మన్‌గా చంద్రమౌళి



సాక్షి, అమరావతి: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) చైర్మన్‌గా ఎస్.చంద్రమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

యువతలో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి కృషి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం విజయవాడలో ఏపీఎస్ఎస్‌డీసీ, గువీ సంయుక్త ఆధ్వర్యంలో 'స్కిల్–ఎ–థాన్'.. మై ఏపీఎస్ఎస్‌డీసీ మై వెబ్‌సైట్'ను ఆవిష్కరించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (ఐఐహెచ్ఎంఆర్)తో ఎంవోయూ చేసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎడ్యు టెక్ కంపెనీ గువీ భాగస్వామ్యంతో ఏపీఎస్ఎస్‌డీసీ టెక్నాలజీ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందిస్తుందన్నారు. ఈ ఉచిత ఆన్‌లైన్ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిలటరీ అకాడమీలో అడ్మిషన్లకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ అకాడమీలో ప్రవేశాలకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 2025–జనవరి ఎంట్రీ కింద ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీపీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 11 సంవత్సరాల ఆరు నెలలు నిండి, 13 ఏళ్లలోపు వయసు గల ఏడో తరగతి చదువుతున్న లేదా ఇటీవల పాసైన బాలబాలికలు అర్హులని వివరించింది. అర్హత గల విద్యార్థులు ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, జూన్ ఒకటో తేదీన విజయవాడలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. పూర్తి వివరాలు www.rimc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

26 మంది డైట్ లెక్చరర్లకు పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)ల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు సీనియర్ లెక్చరర్లుగా పాఠశాల విద్యాశాఖ పదోన్నతులు కల్పించింది. ఈమేరకు విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

లక్షల్లో గొప్పలు.. వేలుదాటని కుర్చీలు

- నేడు టీడీపీ – జనసేన ఉమ్మడి సభకు హాజరయ్యేవారు వేలల్లోనే
- ఏడు ఎకరాల్లో వేదిక, రెండు హెలిప్యాడ్‌లు, వీఐపీ రెస్ట్ రూమ్‌లు
- మిగతా 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు
- ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీలు.. వచ్చేది 33 వేల మందే

సాక్షి, అమరావతి: పిల్ల కాలువను సముద్రంలా చిత్రీకరించేందుకు ఎల్లో మీడియా ఆపసోపాలు పడుతోంది. టీడీపీ – జనసేన ఉమ్మడిగా ప్రత్తిపాడు వద్ద నేడు తలపెట్టిన తొలి సభను జనవాహినితో ఉప్పొంగిన 'సిద్ధం' సభలతో పోలుస్తూ చంకలు గుద్దుకుంటోంది. చంద్రబాబు – పవన్ కోసం రెండు హెలిప్యాడ్లు, సేద తీరడం కోసం సభా ప్రాంగణంలో సగం స్థలంలో ఏర్పాట్లు చేశారని, అక్కడి మైదానంలో వేల మంది మాత్రమే కూర్చునే వీలుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికల సమరనాదంతో వైఎస్సార్‌సీపీ భీమిలి, దెందులూరు, రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభలు జన సముద్రాలను తలపించాయి.

మార్మోగుతున్న రణ నినాదం..

సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ భీమిలిలో గత నెల 27వతేదీన సిద్ధం తొలి సభను నిర్వహించారు. సీఎం జగన్ సమర శంఖం పూరించిన ఈ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి నాలుగు లక్షల మందికిపైగా కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. సిద్ధం రెండో సభను ఈనెల 3న ఏలూరు సమీపంలో దెందులూరు వద్ద నిర్వహించారు. వేదికపోనూ కార్యకర్తలు, అభిమానులు కూర్చొని సభను వీక్షించడానికి 110 ఎకరాల మైదానంలో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 50 నియోజకవర్గాల నుంచి 6 – 7 లక్షల మందికి పైగా ఈ సభకు తరలివచ్చారు. ఇక రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' మూడో సభకు వేదిక పోనూ ప్రజల కోసం ఏకంగా 250 ఎకరాల సువిశాల మైదానంలో ఏర్పాట్లు చేశారు. ఈ సభకు రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలోని 52 నియోజకవర్గాల నుంచి 10 నుంచి 11 లక్షల మంది హాజరయ్యారు. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా రాప్తాడు సిద్ధం సభ నిలిచిందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేశారు. సీఎం జగన్ నాయకత్వంపై కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఉన్న విశ్వాసానికి 'సిద్ధం' సభలు నిదర్శనమని విశ్లేషిస్తున్నారు.

స్థైర్యం నింపేందుకు పాట్లు...

జనసేన 24 సీట్లకే పరిమితమైన నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై రెండు పార్టీల్లో విభేదాలు భగ్గుమంటున్నాయి. 'సిద్ధం' సభలు ఒకవైపు ప్రకంపనలు సృష్టిస్తుండగా మరోవైపు టీడీపీ – జనసేనలో భగ్గుమన్న విభేదాలతో క్యాడర్ చెల్లాచెదురైంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే ఆత్మవిశ్వాసం కోల్పోయిన టీడీపీ–జనసేన శ్రేణుల్లో నైతిక స్థైర్యం నింపేందుకు ఎల్లో మీడియా తంటాలు పడుతోంది.

మొత్తం 33 వేల కుర్చీలు

టీడీపీ–జనసేన నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభకు తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు



బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు

వద్ద జాతీయ రహదారి బైపాస్ పక్కనే ఉన్న 22 ఎకరాల మైదానాన్ని ఎంచుకున్నారు. 175 నియోజకవర్గాల నుంచి వచ్చే రెండు పార్టీల నేతలు సుమారు 500 మంది కూర్చోవడానికి వీలుగా వేదికతోపాటు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వేర్వేరుగా హెలికాప్టర్లలో రానుండటంతో అక్కడకు సమీపంలో రెండు హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వేదిక, హెలి ప్యాడ్‌లు, వీవీఐపీల రెస్ట్ రూమ్‌ల నిర్మాణానికి ఏడు ఎకరాలు పోగా మిగిలిన 15 ఎకరాల్లో కార్యకర్తల కోసం 22 గ్యాలరీలు సిద్ధం చేశారు. ఒక్కో గ్యాలరీలో 1,500 కుర్చీలు వేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అంటే 22 గ్యాలరీల్లో 33 వేల కుర్చీలు పట్టే అవకాశం ఉంది. మొత్తం కుర్చీలన్నీ నిండిపోయి 15 ఎకరాల ప్రాంగణం కిక్కిరిసిపోతే దాదాపు 60 వేల మంది హాజరైనట్లు లెక్క అని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. ఇలా వేల మంది మాత్రమే హాజరయ్యే సభలను జన సముద్రాలతో పోల్చడం ఏమిటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సభకు ఓ నమస్కారం!

సాక్షి, భీమవరం: టీడీపీ – జనసేన ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలిసభ 'తెలుగు జన జెండా'కు అసమ్మతి సెగ తగిలింది. పొత్తుల పేరుతో 24 సీట్లకే పవన్ కళ్యాణ్ ఒప్పుకోవడంపై జనసేన నేతలు మండిపడుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన నేతలు, శ్రేణులు ఈ సభకు ముఖం చాటేయడం ఖాయంగా కనిపిస్తోంది. టీడీపీలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సభా ప్రాంగణం, ఏర్పాట్ల విషయంలో రెండు పార్టీల నేతల మధ్య సమన్వయం కొరవడటంతో ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన జనసేన నేత నాదెండ్ల మనోహర్ వద్ద తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు నిరసన గళం వినిపించారు. తణుకులో ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన గైర్హాజరయ్యారు. ఉండి నియోజకవర్గానికి సంబంధించి నిర్వహించిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే శివరామరాజును పిలవకపోవడంతో ఆయన వర్గీయులు హాజరు కాలేదు. కొత్తపేటలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, ఆయన అనుచరులు డుమ్మా కొట్టారు. మండపేటలో ఉమ్మడి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ప్రకటించడంపై జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ గుర్రుగా ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్ సీటు కందుల దుర్గేష్‌కు సీటు కేటాయించపోవడంతో సభకు దూరంగా ఉండాలని ఆయన వర్గం భావిస్తున్నట్లు సమాచారం.

వైద్య ఆరోగ్య శాఖలో
మరిన్ని ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాల్లో పోస్టులను బుధవారం భర్తీ చేయనున్నారు. గైనకాలజీ, పీడియాట్రిక్స్, అనస్తీషియా, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పాథాలజీ విభాగాల్లో పోస్టుల భర్తీకి శుక్రవారం వాకిన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నారు. అర్హులైన అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాకిన్ రిక్రూట్‌మెంట్‌కు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య హాజరవ్వాల్సి ఉంటుంది. శాశ్వత, కాంట్రాక్ట్, కొటేషన్ విధానాల్లో పోస్టుల భర్తీ చేపట్టనున్నారు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పనిచేయడానికి స్పెషలిస్ట్ వైద్యులు ముందుకు రాకపోతుండటంతో కొటేషన్ విధానాన్ని సీఎం జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో మారుమూల ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పనిచేయడానికి ఎంత వేతనం కావాలో వైద్యులు కోట్ చేయవచ్చు. ఆ కొటేషన్‌లను పరిశీలించి వైద్యులు కోరినంత వేతనాలను ఇచ్చి మరీ ప్రభుత్వం వైద్యులను నియమిస్తోంది. పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం http://apmsrb.ap.gov.in/msrb/, https://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లను అభ్యర్థులు పరిశీలించాల్సి ఉంటుంది.

మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ..

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని అర్బన్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో 189 పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు బోర్డ్ మెంబర్ సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు. భర్తీ చేసే పోస్టుల్లో 102 మెడికల్ ఆఫీసర్లు, 87 స్టాఫ్ నర్సు పోస్టులు ఉన్నాయన్నారు. బుధవారం నుంచి మార్చి 10వ తేదీ వరకూ అర్హులైన అభ్యర్థులు https://apmsrb.ap.gov.in/msrb వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇక సమగ్ర నోటిఫికేషన్‌ను https://apmsrb.ap.gov.in/msrb, https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లను అభ్యర్థులు సంప్రదించాల్సి ఉంటుంది.

మళ్లీ జన్మభూమి కమిటీలు తెస్తావా?

- వాటితో సుపరిపాలన అందిస్తావా?
- చంద్రబాబుపై మంత్రి సీదిరి అప్పలరాజు ఆగ్రహం
- చెత్త పన్ను విధించాలంటూ లేఖ రాసింది చంద్రబాబే
- ఉత్తరాంధ్ర ద్రోహివి.. ఉద్దానంలో వేల మంది చావులకు కారణం నువ్వే
- అభివృద్ధిపై ఎవరు చర్చకు వచ్చినా మేం సిద్ధం

సాక్షి, అమరావతి: 'మీ దృష్టిలో సుపరిపాలన అంటే ఏంటి? మళ్లీ జన్మభూమి కమిటీలు తెస్తావా? అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన జన్మభూమి కమిటీల వల్ల సుపరిపాలన సాధ్యమా?' అని టీడీపీ అధినేత చంద్రబాబుపై మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మంగళగిరిలో ఆయన మీడి



యాతో మాట్లాడారు. 'జన్మభూమి కమిటీలతో ప్రజలను దోపిడీ చేసిన చంద్రబాబు సుపరిపాలన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. శ్రీకాకుళం సభలో చంద్రబాబు మీ జిల్లాకు ఫలానా అభివృద్ధి కార్యక్రమం చేసినందున నాకు మళ్లీ అవకాశం ఇవ్వాలని అడగలేకపోయారు. అంతటి దౌర్భాగ్యమైన పరిపాలన చంద్రబాబుది. అందుకే సీఎం జగన్‌పై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. ఉత్తరాంధ్ర ద్రోహి చంద్రబాబు. ఉద్దానంలో వేల మంది చావులకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. సీఎంగా ఉన్నప్పుడు చెత్త మీద పన్ను విధించాలని ప్రధానికి లేఖ రాసిన దౌర్భాగ్యపు వ్యక్తి చంద్రబాబు. ఇప్పుడు సీఎం జగన్ మీద అభాండాలు వేస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలు 34 వేలే. కానీ ఇప్పుడు 20 లక్షల ఉద్యోగాలిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. 40 రోజుల్లో బాబు రాజకీయ జీవితానికి ఎండ్ కార్డ్ పడబోతోంది. చంద్రబాబు తన కులానికి ఇచ్చినన్ని సీట్లు కూడా పవన్‌కు ఇవ్వలేదు.

వైఎస్ జగన్ పాలనలో పేదరికం తగ్గింది..

సుపరిపాలన అంటే సీఎం జగన్ తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయాలు. వాటికి అనుసంధానంగా వచ్చిన వలంటీర్ వ్యవస్థ. కుల మతాలు, పార్టీలకు అతీతంగా వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్నదే సుపరిపాలన. దీని వల్లే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గింది. గతంలో 11.5 శాతం పేదరికం ఉంటే ఈ ఐదేళ్లలో 5 శాతం కంటే దిగువకు వచ్చింది. 2018లో చంద్రబాబు విడుదల చేసిన నివేదికల్లో కూడా శ్రీకాకుళం జిల్లా వెనుకబడి ఉంది. అలాంటి వ్యక్తి ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తానంటూ డ్రామాలు ఆడుతున్నారు. 14 ఏళ్ల పాలనలో ఉత్తరాంధ్రకు ఏం చేశావ్? మా హయాంలో ఏం చేశామో ఎవరు వచ్చినా చర్చించడానికి సిద్ధం. మీరు పెట్టే సభ వద్దకు వచ్చి చర్చించడానికైనా నేను సిద్ధం. వైఎస్ జగన్ పాలనలో ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్, రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్టుతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాం' అని మంత్రి సీదిరి చెప్పారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం తథ్యం

విజయవాడ, ఏలూరు, విశాఖలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



సాక్షి, అమరావతి/ఏలూరు (టూటౌన్): ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో సుస్థిర అభివృద్ధి, అవినీతి రహిత సుపరిపాలన అందిస్తోందని, రానున్న ఎన్నికల్లోనూ విజయం సాధించి మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం తథ్యమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన పది సంవత్సరాల్లో ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా పరిపాలన సాగుతోందని చెప్పారు. ఆయన మంగళవారం విజయవాడలో మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గాల ముఖ్య నాయకుల అంతర్గత సమావేశంలో, ఏలూరులో ఏలూరు, అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసాపురం లోక్‌సభ నియోజకవర్గాల బూత్ స్థాయి కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి బీజేపీ నాయకుడు, కార్యకర్త గత పదేళ్లలో దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని చెప్పారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడితే వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీని అధికారంలోకి తేవచ్చని, అది పెద్ద కష్టమేమీ కాదని అన్నారు. అమరావతి అంశంలో పార్టీ విధానం స్పష్టంగా ఉందని చెప్పారు. ఈ సమావేశాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ సుజనా చౌదరి, పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, సోము వీర్రాజు పాల్గొన్నారు.

బీజేపీకి హిందూ, ముస్లిం, క్రైస్తవులు అందరూ సమానమే: రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీకి హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులంతా సమానమేనని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. మంగళవారం 'భారత్ రైజింగ్ ఎలైట్ మీట్' పేరిట విశాఖలో జరిగిన మేధావుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షాలు బీజేపీని మతతత్వ పార్టీ అంటూ బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని, కానీ, బీజేపీ అందరూ సమానమేనన్న భావన కలిగి ఉందని, అందువల్లే ముస్లిం దేశాలు సైతం ప్రధాని మోదీని అత్యున్నత పురస్కారాలతో గౌరవిస్తున్నాయని చెప్పారు.

విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ హబ్

త్వరలో విశాఖపట్నంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దేశంలో సుమారు 400 విశ్వవిద్యాలయాలు, ఏడు ఐఐటీలు, ఏడు ఐఐఎంలు ఉన్నాయని, రానున్న ఐదారేళ్లలో జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అర్హతగల ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ

- ఆక్వా జోన్ పరిధిలో కొత్తగా మరో 3,467 విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీ
- ఇప్పటికే 54,072 కనెక్షన్లకు వర్తింపు
- నాలుగేళ్లుగా రూ.3,306.5 కోట్ల విద్యుత్ సబ్సిడీని భరించిన ప్రభుత్వం
- తాజాగా ఏటా మరో రూ.55 కోట్ల అదనపు భారం
- ఆక్వా సాధికారత కమిటీ భేటీలో మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అర్హులైన ఆక్వా రైతులందరికీ సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రరావు, బొత్స సత్యనారాయణ, డాక్టర్ సీదిరి అప్పలరాజు, అప్సడా కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం స్పష్టంచేశారు. విజయవాడలోని మంత్రి పెద్దిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆక్వా సాధికారికత కమిటీ సమావేశం జరిగింది. ఇటీవల ఈ–ఫిష్ సర్వే ద్వారా ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు అర్హత పొందిన



సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి, అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

3,467 విద్యుత్ కనెక్షన్లకు మార్చి ఒకటో తేదీ నుంచి విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయాలని డిస్కమ్‌లను ఆదేశిస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేశారు. రాష్ట్రంలో 4,68,458 ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా, దానిలో 3,33,593.87 ఎకరాలు ఆక్వాజోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు ఉన్నట్టుగా ఈ–ఫిష్ సర్వే ద్వారా నిర్ధారించినట్లు మంత్రులు తెలిపారు. మొత్తం 66,993 విద్యుత్ కనెక్షన్లలో ఇప్పటికే ఆక్వా జోన్ పరిధిలో అర్హత పొందిన 50,605 కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ వర్తింపజేస్తుండగా, తాజాగా కమిటీ ఆమోదంతో ఆ సంఖ్య 54,072కు పెరిగిందన్నారు. ఆక్వా రైతుల తరపున రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా రూ.3,306.5 కోట్లు విద్యుత్ సబ్సిడీని డిస్కమ్‌లకు చెల్లించిందన్నారు. తాజాగా అర్హత పొందిన కనెక్షన్లకు ఏటా రూ.55 కోట్లు అదనపు భారం పడనుందన్నారు. ఆక్వా రైతాంగానికి అండగా నిలిచేందుకు సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. నాణ్యమైన సీడ్ సరఫరా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని వడ్డీ రఘురాం చెప్పారు. ఇక నుంచి అప్సడా అనుమతి పొందిన తర్వాతే విదేశాల నుంచి బ్రూడర్స్‌ను దిగుమతి చేసుకోవాలని, అలా చేయని కంపెనీలపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు పొందేవారిలో అర్హులను గుర్తించి సబ్సిడీ వర్తింపజేసేందుకు మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తామన్నారు.

ఏపీలోనే వంద కౌంట్ రూ.245

ఆక్వా ఉత్పత్తుల రేట్లను ఆర్బీకేల ద్వారా ప్రకటిస్తూ, దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అధికారులు వివరించారు. వంద కౌంట్ రొయ్యలకు కేజీకి రూ.245 ధర ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తోందన్నారు. గుజరాత్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే ఎక్కువ రేటు రైతుకు దక్కుతోందన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్‌లు గోపాలకృష్ణ ద్వివేది, నీరబ్‌కుమార్ ప్రసాద్, కె.విజయానంద్ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు, మత్స్యశాఖ కమిషనర్ కూనపురెడ్డి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



జనాలు సాధారణంగా (సంతోషం కోసం) ఇతరులు ఏం చేస్తున్నారో చూసి, గుడ్డిగా అనుసరిస్తారు. నిజమైన సంతోషం ఏమిటో వారికి అంత ముఖ్యమైనది కానట్టుగా దాన్ని ఇతరుల ఎంపికకు వదిలేస్తారు.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 28 ఫిబ్రవరి 2024

ఆచితూచి అడుగేద్దాం!

శాస్త్రవిజ్ఞాన విజయాలతో మానవాళి ఎప్పటికప్పుడు ముందడుగేయడం చరిత్రలో సంతోష సందర్భమే. గత వారం అలాంటి మరో సందర్భం ఎదురైంది. పుడమికి అతి సమీపంలో ఉండే గ్రహమైన చంద్రునిపై మరోసారి మానవ మేధ సాఫ్ట్ ల్యాండింగ్ చేయగలిగింది. ఇప్పటి దాకా వివిధ దేశాల ప్రభుత్వాలు అధికారిక అంతరిక్ష పరిశోధనా సంస్థలతో అద్భుత విజయాలు సాధించడం చూశాం. ఈసారి ఓ ప్రైవేట్ సంస్థ చందమామపై జయకేతనం ఎగరేసింది. అమెరికాకు చెందిన 'ఇన్‌ట్యూటివ్ మెషీన్స్' (ఐఎం) సంస్థ ఫిబ్రవరి 22న ఓ రోబోటిక్ వ్యోమనౌకను చందమామపై సాఫ్ట్ ల్యాండ్ చేసింది. ఆ ఘనత సాధించిన తొలి ప్రైవేట్ సంస్థగా చరిత్ర సృష్టించింది. ఇప్పటి వరకు ప్రపంచంలో కేవలం అయిదే దేశాలు జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేశాయి. అలా చూస్తే, ఒక ప్రైవేట్ సంస్థ ఆ అపురూప విన్యాసం చేయడం చెప్పుకోదగ్గ మైలురాయి. అయితే, చరిత్రలో రెండో పర్యాయం ఇప్పుడు మళ్ళీ జాబిల్లిపై వ్యోమయానం ఊపందుకున్న వేళ రానున్న రోజుల్లో అంతర్జాతీయంగా నిర్దిష్టమైన అంతరిక్ష విధానం, ప్రత్యేక అంతరిక్ష చట్టం అవసరం ఉందని అర్థమవుతోంది.

అమెరికా అంతరిక్ష నౌక ఒకటి చంద్రమండల ఉపరితలంపై దిగడం గత 50 ఏళ్ళ పైచిలుకులో ఇదే ప్రథమం! అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' 1972లో అపోలో ప్రోగ్రామ్‌కు తెర దించిన తర్వాత మళ్ళీ ఆ దేశం చంద్ర మండల పునఃప్రవేశం మళ్ళీ ఇప్పుడే! చంద్రునిపై వ్యోమనౌక దిగడమనే సవాలులో మానవజాతి ఎన్నో ఏళ్ళుగా విజయాలు, వైఫల్యాలు – రెండూ చవిచూసింది. చంద్రునిపై దిగడంలో విఫలమైన ప్రతిసారీ వ్యోమనౌకల శకలాలు చంద్రోపరితలంపై చెల్లాచెదరై పడివుండడమూ చూశాం. అంతెందుకు... గత నెలలో మరో అమెరికన్ సంస్థ 'ఆస్ట్రోబోటిక్ టెక్నాలజీ' సైతం ఓ ల్యాండర్‌ను చంద్రునిపైకి పంపాలని చూసింది. ఇంధనం లీకేజీతో ఆ యత్నాన్ని అర్థంతరంగా ముగించింది. సదరు ల్యాండర్ భూవాతావరణంలోకి పునఃప్రవేశించి, పసిఫిక్ మహాసముద్రంపై దగ్ధమైంది. విఫలమైన ఆ 'ఆస్ట్రోబోటిక్', విజయవంతమైన 'ఐఎం' సంస్థ... రెండూ 'నాసా' అండతో వాణిజ్యపంథాలో చంద్రునిపైకి వ్యోమనౌకల్ని పంపే కృషిలో భాగమే. గగనాంతర సీమల గవేషణలో ప్రైవేట్ రంగ ప్రమేయం పెరుగుతున్న తీరుకు ఇది ఉదాహరణ.

చరిత్ర గమనిస్తే – 1966లోనే సోవియట్ యూనియన్ 'లూనా9' తొలిసారిగా చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసింది. నాలుగు నెలల తర్వాత 'సర్వేయర్1'తో అమెరికా విజయం సాధించింది. అది క్రమంగా చంద్రునిపైకి మానవయాత్రకు దారి తీసింది. 1969లో నాసా 'అపోలో11'తో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్‌లు చంద్రునిపై అడుగిడిన తొలి వ్యక్తులుగా చరిత్ర సృష్టించినప్పటి నుంచి ఇప్పటికి అరడజనుకు పైగా యాత్రల్లో డజను మంది చంద్రునిపై కాలుమోపారు. 2026 చివరి కల్లా మరోసారి చంద్రునిపైకి మానవ యానానికి అమెరికా సిద్ధమవుతోంది. మూడో దేశంగా చైనా, గత ఏడాది 'చంద్రయాన్3' ద్వారా రెండో ప్రయత్నంలో విజయం సాధించి నాలుగో దేశంగా భారత్ చంద్రునిపై ల్యాండింగ్ చేశాయి. ఈ జనవరిలో జపాన్ తప్పుదిశలో ల్యాండింగ్ జరిపినప్పటికీ, అసలంటూ చేసిన అయిదో దేశంగా ఆ జాబితాలో చేరింది. ఇప్పుడు ఐఎం విజయంతో చంద్రమండల యాత్రల్లో ప్రైవేట్ రంగ శక్తియుక్తులు హెచ్చనున్నాయి. మరిన్ని యాత్రలకు సన్నాహాలు సాగుతున్నందున లోతైన అన్వేషణ, శాస్త్రీయ పరిశోధనలకు కలువలరేడు కేంద్రబిందువు కానున్నాడు.

నిజానికి, చంద్రునిపై దిగేందుకు ప్రైవేట్ సంస్థలు గతంలోనూ అనేక యత్నాలు చేశాయి. 2019లో ఇజ్రాయెల్ బెరేషీట్ చంద్రునిపై కుప్పకూలింది. 2023లో ఓ జపనీస్ సంస్థ తాలూకు ల్యాండర్ పడిపోయింది. తాజా ప్రైవేట్ ప్రయోగ విజయంలోనూ లోటుపాట్లు లేకపోలేదు. గ్రీకు పురాణాల్లోని తెలివైన వీరుడు 'ఒడీస్సియస్' పేరు పెట్టుకున్న ఐఎం వారి వ్యోమనౌక ఆఖరుఘట్టంలో జాబిల్లి దక్షిణ ధ్రువానికి దగ్గరలో నేరుగా కాక అనుకున్నదాని కన్నా వేగంగా, పక్కవాటుగా దిగింది. దాంతో, ముందనుకున్నట్టు వారం కాకుండా, 2–3 రోజుల ముందే తట్టాబుట్టా సర్దుకుంటోంది. అయితే, అసలంటూ ఐఎం విజయవంతం కావడంతో నాసా 'కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్' (సీఎల్పీఎస్) కార్యక్రమం కింద మరిన్ని ప్రైవేట్ ప్రయత్నాలు సాగుతాయి. 2020 నాటికి పూర్తయ్యేలా మరో 14 ప్రైవేట్ సంస్థలతో నాసా పెట్టుకున్న 260 కోట్ల డాలర్ల కాంట్రాక్టులే అందుకు తార్కాణం. ఇటీవలే భారత్ సైతం జాతీయ అంతరిక్ష రంగంలో నూరు శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచింది. అంటే రానున్న రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)పై భారం తగ్గి, ప్రైవేట్ రంగంలో భారతీయ అంకుర సంస్థల మధ్య పోటాపోటీ పెరగనుంది.

ప్రపంచమంతటా ఇలాంటి ప్రైవేట్ ప్రయత్నాలతో కష్టాలూ తప్పవు. 1967 నాటి 'ఔటర్ స్పేస్ ట్రీటీ' మినహా ఇప్పటికీ అంతర్జాతీయ అంతరిక్ష నిబంధనలేవీ లేవు. ఆ ఒడంబడిక సైతం అనుసరించాల్సిన విధుల జాబితాయే తప్ప, పాటించి తీరాల్సిన ఆదేశాలు కావు. తాజా ఒడిస్సియస్ దెబ్బతో వివిధ సంస్థలు చంద్రునిపైకి ఏవైనా పంపి, దాన్ని ఎలాగైనా నింపే వీలుంది. అందుకే, ఇప్పుడు అంతర్జాతీయ అంతరిక్ష, చంద్రమండల చట్టాలు తేవాల్సిన అవసరం ఉంది. లేదంటే, ఇప్పటికే ఉపగ్రహాలతో క్రిక్కిరిసిన దిగువ భూకక్ష్య లానే చంద్రమండలమూ నిండవచ్చని శాస్త్రవేత్తల జోస్యం. చంద్రునిపై నిర్ణీత ప్రాంతాలు శాస్త్రీయ పరిశోధనా శాలలకు కీలకం గనక అవాంఛనీయ పోటీ తప్పదు. విలువైన హీలియమ్3 కోసం చంద్రునిపై గనుల తవ్వకాలు జరిగినా ఆశ్చర్యం లేదంటున్నారు. కాబట్టి, ఆచితూచి అడుగు వేయాల్సిన సందర్భమిది. నైతికతకు కట్టుబడి పరిశోధనలు సాగిస్తూనే, వెన్నెలరేడు వాతావరణాన్ని విధ్వంసం చేయనిరీతిలో చట్టాలు చేసుకోవాల్సిన సమయమిది.

చారిత్రక మూలాల్లో జ్ఞాన కాంతులు

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ఏ దేశానికైనా, ఏ జాతికైనా చారిత్రక తాత్విక జ్ఞానం అవసరం. నిజానికి తొలి నుంచీ ఉన్నది భౌతికవాదమే. భారతదేశంలోని భౌతికవాద చింతన అన్ని కీలక పరిణామాల్లో ప్రధాన శక్తిగా నిలిచింది. మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పును, నీరును, గాలిని, భూమిని; వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. అయితే అనేక సందర్భాలలో ప్రజలు వెలుగు నుండి చీకట్లోకి, జ్ఞానం నుండి అజ్ఞానంలోకి, వాస్తవం నుండి భ్రమలలోకి తిరోగమిస్తూ ఉంటారు. అప్పుడే అభ్యుదయవాదులు వారిలో జ్ఞానతృష్ణను కలిగించాలి.

భారతదేశ తాత్విక మూలాలపై ఈనాడు లోతైన చర్చ జరుగుతోంది. నిజానికి భారతీయ తత్వశాస్త్రాన్ని సృష్టించినవారు మూలవాసులు. వీరు మెసపటోమియా, సింధూ నాగరికతల కాలం నాటివారు. వీరి మౌఖిక జ్ఞాన సంపదకు ప్రత్యామ్నాయంగానే వైదిక సాహిత్యం వచ్చింది. వైదిక సాహిత్యం కూడా మొదట్లో మౌఖిక రూపంలోనే ఉంది. తర్వాత లిఖిత రూపం ధరించింది. భారతీయ తత్వశాస్త్రం ప్రధానంగా భౌతికవాద తత్వశాస్త్రం. భారతదేశంలో తత్వశాస్త్రమంటే ఆధ్యాత్మిక వాదంగా ప్రచారం చేశారు. తత్వశాస్త్రమనగానే అది ఆత్మ గురించో, పరలోకం గురించో చెప్పేదనే భావన ఏర్పడింది. నిజానికి భౌతిక అంశాల నుండి రూపొందినదే తత్వశాస్త్రం. భారతదేశంలో అతి ప్రాచీన జాతులు తాత్వికాంశాల మీద సుదీర్ఘమైన చర్చ చేశాయి. శరీరానికీ, చైతన్యానికీ ఉన్న సంబంధాన్నీ; మానవునికీ, ప్రకృతికీ ఉన్న సంబంధాన్నీ, విశ్వ పరిణామాన్నీ, మానవ పరిణామాన్నీ వీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. ప్రకృతి; సమాజం పట్ల ఉదయించిన అనేక ప్రశ్నలకు భౌతిక దృక్పథంతో సమాధానం వెదికారు.

మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పును, నీరును, గాలిని, భూమిని; వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. నిప్పు మానవ సామాజిక పరిణామంలో కీలక పాత్ర వహించింది. నిప్పును ఆరాధించిన జాతుల కంటే, నిప్పును భౌతిక శక్తిగా గుర్తించిన జాతులు శక్తిమంతంగా ముందుకు నడిచాయి. నిప్పు మానవ జీవితాన్ని ఒక భౌతిక శక్తిగా ప్రభావితం చేసింది. నిప్పును ఆరాధించే జాతులకూ, నిప్పును అధీనం చేసుకొన్న జాతులకూ సమరం జరిగింది. తన చుట్టూ వున్న భౌతిక ప్రపంచాన్ని సమన్వయించుకోవడంలో విఫలమైనవారు భావవాదులుగా రూపొందారు. వీరు భౌతిక సామాజిక వాస్తవికతకు భిన్నమైన భావవాదంతో భౌతికవాదులకు ఎదురు నిలుస్తూ వచ్చారు.



అంతేగాక వానరుడి నుండి నరుడిగా పరిణామం చెందిన ప్రతి కీలక దశలోనూ మానవుని భౌతిక దృక్పథమే అతనికి నిర్ణయాత్మక మెట్టుగా ఉపకరించింది. లక్షలాది సంవత్సరాలకు పూర్వం ఉష్ణమండలంలో ఎక్కడో ఒక చోట నరవానరుడిగా ఉన్న మానవుడు మానవుడిగా రూపొందిన పరిణామంలో చేతుల్ని ఉపయోగించుకున్న తీరును ఎంగెల్స్ వర్ణించాడు. రోమ శరీరులైన మన పూర్వీకులు మొదట ఒక నియమంగానూ, తరువాత అవసరంగానూ నిలబడటానికి కారణం ఆనాటికి చేతులకు వివిధ రకాలైన ఇతర పనులు ఏర్పడి ఉంటాయని అనుకోవాలి. వానరాలు ఆహారాన్ని స్వీకరించడానికి, ఆహారాన్ని పట్టుకోవడానికి చేతులను ఉపయోగిస్తాయి. కొన్ని రకాల క్రింది తరగతి స్తన్య జంతువులలో కూడా ముందు పంజాలను ఉపయోగించడం మనం చూస్తాం. చాలా రకాల కోతులు తాము చెట్ల మీద నివసించడానికై గూళ్ళను నిర్మించడానికి చేతులను ఉపయోగిస్తాయి. చింపాంజీలు తమ చేతులతో చెట్ల కొమ్మల మధ్య కప్పులు చేసుకొని ఎండ వానల నుండి కాపాడుకుంటాయి. శత్రువుల నుండి ఆత్మ రక్షణకై ఇవి చేతులతో కర్రలను, కొమ్మలను పట్టుకొని కొట్టడానికి పూనుకొంటాయి. బోనుల్లో ఉంచిన కోతులు మానవులను చూచి నేర్చుకున్న అనేక చిన్న చిన్న పనులను తమ చేతులతో చేయగలవు. కానీ మానవునికెంతో సన్నిహితమైన దశకు చేరుకున్న వానరుని చేతినీ, అనేక లక్షల సంవత్సరాల కర్మల వల్ల అభివృద్ధి నొందిన మానవుడి చేతిని చూస్తే ఎంతో భేదం కనబడుతుంది. కండరాల సంఖ్య ఒక్కటే, నిర్మాణం కూడా ఒక్కటే. అయినా ఎంతటి నికృష్టస్థితిలోని ఆటవికుడైన మానవుని హస్తం కూడా ఎంతో అభివృద్ధి చెందిన వానర హస్తం చేయలేని వందలాది పనులను అలవోకగా చేస్తుంది. వానర హస్తం ఏ చిన్న రాతి పనిముట్టును ఎంత బండగానైన చేసి ఎరుగదు.

భారతదేశంలోని భౌతికవాద చింతన అన్ని కీలక పరిణామాల్లో ప్రధాన శక్తిగా నిలిచింది. మానవ జాతి ప్రతి అడుగులో తన అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిలుపుకొంటూ ముందుకు నడిచింది. ఈ భౌతిక దృక్పథంతో కూడిన మానవ ప్రయాణానికి భావవాదం ఒక పెద్ద అవరోధంగా నిలిచింది. మానవ ప్రగతిలో అసమానతలు సృష్టించింది. చరిత్ర పరిణామ క్రమంలో మానవ సమాజాన్ని సమన్వయించడాన్ని మార్క్స్ గతి తార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథం అన్నాడు. ఈ క్రమంలో భారత సమాజాన్ని పరిశీలిస్తే చార్వాకులు భారత ఉత్తరఖండంలో భౌతిక సిద్ధాంత కర్తలుగా మన ముందు నిలుస్తారు. వారికి ఎదురు నిలిచిన వైదికులు భావ వాదానికి కొమ్ము కాసిన ప్రతినిధులు అయ్యారు.

వేద వాఙ్మయానికి ప్రత్యామ్నాయంగా భారతీయ భౌతికవాదంగా చార్వాకవాదం ముందుకొచ్చింది. భారతీయ భౌతికవాదాన్ని సాంఖ్యదర్శనం ముందుకు తీసుకువెళ్ళింది. ఈ సాంఖ్య శాస్త్రానికి మూల పురుషులు కపిలుడు, అసురీ, పంచశిఖుడు, ఈశ్వర కృష్ణుడు. ఈశ్వర కృష్ణుని 26 మంది గురుతరాల నుండి ఈ సాంఖ్యం బోధింపబడినట్లు చెప్పబడింది. ఒక్కొక్క గురువు నుండి మరొక గురువు తరానికి 30 సంవత్సరాల అంతరం ఉందని అనుకుంటే, 780 సంవత్సరాల అంతరం కపిలుడికీ, ఈశ్వర కృష్ణుడికీ ఉంది. దీనిని బట్టి కపిలుడు క్రీ.పూ.7, 8 శతాబ్దాల వాడై ఉండవచ్చునని చరిత్రకారుల అంచనా. బుద్ధుడి మీద కూడా సాంఖ్య ప్రభావం ఉందనేది స్పష్టం. బుద్ధుడు క్రీ.పూ. 6వ శతాబ్దం వాడనుకుంటే సాంఖ్య సిద్ధాంతం అప్పటికే ప్రాచుర్యం పొంది ఉంది. దీనినిబట్టి కూడా కపిలుని సాంఖ్య శాస్త్రం క్రీ.పూ. 8 శతాబ్దిదని అనుకోవచ్చు.

ఇకపోతే సమాజ నిర్మాణానికి సంబంధించిన మూలాలను అధ్యయనం చేయకుండా, సమాజ వ్యవస్థను ఉన్నదున్నట్లుగా అంగీకరించడం యధాతథవాదం. అది మార్పును అంగీకరించని వాదం. మార్పునకు భావజాలం ఒక చోదకశక్తి. దళితుల చరిత్ర నిర్మాణంలో హేతువాదమే కీలకం అవుతుంది. బి.ఆర్. అంబేడ్కర్ హేతువాద దృక్పథంతోనే సామాజిక చరిత్ర నిర్మాణంలోని చిక్కుముడులను విప్పారు. కానీ లిఖిత పరమైన ఆధారాలు లేవని వీరి చరిత్రను మనువాదులు నిరాకరిస్తారు. భారతదేశంలో మనువాదం ఉత్పత్తికి భిన్నమైనది. జీవిక కోసం సృష్టించిన ఆధ్యాత్మిక కల్పన వాదం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి చివరికి దేశ చరిత్రను గజిబిజి చేసింది. అనేక వైరుధ్యాలు, ప్రక్షిప్తాలతో కూడిన సాహిత్యంలో తాత్విక అంశాలు, చారిత్రక అంశాలు మృగ్యమైనాయి.

ప్రజలు ఎల్లప్పుడు రాజకీయాల్లో వంచనకు, ఆత్మ వంచనకు తెలివి తక్కువగా బలి అవుతూనే ఉన్నారు. అన్ని నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల ప్రకటనల వెనుక ఏదో ఒక వర్గపు ప్రయోజనాలు దాగివున్నాయనే విషయాన్ని గ్రహించేంత వరకు వారలా బలి అవుతూనే ఉంటారు. ప్రతి పురాతన సంస్థ అది ఎంత అనాగరికమైనదిగా, కుళ్ళిపోయినదిగా కనబడినప్పటికీ పాలక వర్గాలకు చెందిన కొన్ని శక్తులచే అది నిలబెట్టబడుతోంది. ఈ విషయాన్ని గ్రహించనంతవరకూ సంస్కరణ వాదులు, అభివృద్ధి కాముకులు పాత వ్యవస్థను సమర్థించే వారి చేత మోసగించబడుతూనే వుంటారు. ఆ వర్గాల ప్రతిఘటనను పటాపంచలు చేయడానికి ఒకే ఒక మార్గం వుంది. అదేమిటంటే మన చుట్టూ ఉన్న సమాజంలోనే పాతను తుడిచివేసి కొత్తను సృష్టించే సామర్థ్యం కలిగివున్న శక్తులను విజ్ఞానవంతులను చేసి సంఘటిత పర్చడం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గొప్ప వైద్యుడు



ఇండియాలో ఎండోక్రైనాలజీ విభాగ వ్యవస్థాపకుల్లో ఒకరైన ప్రొఫెసర్ నారాయణ పణిక్కర్ కోచుపిళ్లై మరణం (ఫిబ్రవరి 26) అత్యంత బాధాకరం. ఆయనకు ఎండోక్రైనాలజీ వైద్యులు (మధుమేహం లాంటివి చూసే వాళ్లు), మొత్తంగా దేశ వైద్యరంగమూ రుణపడి ఉంటుంది.

– అంబరీశ్ మిథల్, ఎండోక్రైనాలజిస్ట్

నగరాలు చేయాల్సినవి...



దేశంలో దాదాపు 70 శాతం గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాలకు భారత నగరాలే కారణం. చాలా నగరాలు 2050 కల్లా తమ జనాభాను రెట్టింపు చేసుకుంటాయి. అందుకే ఇవి నడకకు, సైకిళ్లకు వసతులు కల్పించాలి. పాదాచారుల క్రాసింగ్ సిగ్నల్స్ ఏర్పాటుచేయాలి. విద్యుత్ వాహనాల ఛార్జింగ్‌కు మౌలిక వసతులు కల్పించాలి. టాప్ క్లాస్ ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పరచాలి.

– అమితభ్ కాంత్, నీతి ఆయోగ్ మాజీ సీఈఓ

నవ హీరోలు



ఇస్రో తలపెట్టిన తొలి స్పేస్‌ఫ్లైట్ మిషన్ 'గగన్‌యాన్'లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లేందుకు నలుగురు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫైటర్ పైలట్లు ఎంపికయ్యారు. గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా. వాళ్లకు అభినందనలు.

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

ఎత్తుగడ



ప్రతిపక్ష పార్టీ నాయకుడి భార్యనో, మేనల్లుడినో మీ పార్టీలోకి చేర్చుకోవాలి; ఇక వీళ్లు అవతలి పక్షంలో ఉన్నప్పటికీ ఆ నాయకుడు వీళ్లకు మద్దతిస్తాడు.

– ప్రసేన్‌జిత్ దత్తా, వ్యాఖ్యాత

లోపలి పోరు



నేను: రాత్రి బాగా ఆలస్యమైంది కాబట్టి, ఇంకొంత సేపు పడుకోవచ్చు. ఐదింటికి నా బుర్ర: అమ్మాయీ లే! కుక్కను అలా ఓసారి తిప్పుకొని వచ్చి, నవలను రివైజ్ చేయాల్సిన టైమ్ ఇది.

– తాహా కొరీల్, రచయిత్రి

ఇన్ బాక్స్

సైన్స్ ప్రచారంలో...

జన విజ్ఞాన వేదిక ఒక సైన్సు ప్రచార సంస్థ. ఇది సమాజంలో శాస్త్ర దృక్పథంతో సంబంధం లేకుండా జరుగుతున్న అన్యాయాలనూ, మూఢ నమ్మకాలనూ ఎదిరించి సామాన్య ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తూ ఉంది. 1988 ఫిబ్రవరి 28న డాక్టర్స్, ఇంజనీర్స్, ఉపాధ్యాయులు, లాయర్స్ వంటి అనేక మంది మేధావులతో ఏర్పడ్డది. అప్పటినుంచి అప్రతిహతంగా ప్రజాసైన్స్ ఉద్యమాన్ని నడుపుతోంది. మూఢ నమ్మకాలు, ఛాందస భావాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దీర్ఘకాల పోరాటాలు చేస్తోంది. జీవ వైవిధ్యాన్ని కాపాడటం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడటం, కాలుష్యాన్ని అరికట్టేందుకు కృషి చేయడం, శాస్త్ర శోధనలను ప్రోత్సహించడం వంటి ఆశయాలను కొనసాగిస్తూ ఉంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 51ఏ(హెచ్) ప్రకారం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తున్నది.

ప్రారంభంలో సారా నిషేధం, అక్షరాస్యత ఉద్యమాలతో జన విజ్ఞాన వేదిక ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తనదైన ముద్ర వేసింది. 'చెకుముకి' సంబరాలతో బాల్య దశలోనే శాస్త్రీయ అభివృద్ధికి కృషి చేస్తోంది. కూల్ డ్రింక్స్ తాగొద్దని ప్రచారం చేస్తూ సహజ పానీయాల్ని తాగాలని ప్రోత్సహిస్తున్నది. గ్రహణంపై ప్రజల్లో ఉన్న మూఢవిశ్వాసాలను తొలగించింది. ఈ సంస్థకు 2005లో శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారం చేసినందుకుగాను జాతీయ బహుమతి లభించింది. ఇది జన విజ్ఞాన వేదిక సైన్సు ప్రచారంలో చేస్తున్న కృషికి మంచి గుర్తింపు. పరిశీలన, ప్రశ్న, పరికల్పన, ప్రయోగం, విశ్లేషణ, నిర్ధారణ దశల ద్వారా కనుగొన్న సత్యమే సైన్సులో భాగం కావాలని నిరంతరం ఈ సంస్థ ప్రచారం చేస్తున్నది. వైజ్ఞానిక పద్ధతిని నిత్యజీవన సమస్యల అవగాహనకూ, పరిష్కారానికీ ఉపయోగించుకుంటే అది వైజ్ఞానిక దృక్పథం అవుతుంది. సైన్సు అందించే జీవనతత్వాన్నీ, టెక్నాలజీలనూ వాడుకుని మానవాభ్యుదయం వైపు సాగడమే స్వేచ్ఛకు మార్గం. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, దేశ స్వావలంబన కోసం సైన్స్. ప్రజా సైన్స్ ఉద్యమం వర్ధిల్లాలి.

– సంపతి రమేష్ మహారాజ్

జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

(జన విజ్ఞాన వేదిక ఆవిర్భవించి నేటికి 35 ఏళ్లు)

సారాంశం

సరికొండ చలపతి

పిడుగులున్నారు... హై'టేక్ కేర్'..!

సోషల్ మీడియాలో తిరుగుతోన్న ఓ జోక్ చూడండి.

ఏడేళ్ల పిల్లాడు ఫొటో దిగడానికి వాళ్ల నాన్నతో కలిసి స్టూడియోకి వెళ్లాడు. పిల్లాడు కుదురుగా కూచుంటాడో లేదోనని కంగారు పడుతున్న వాళ్ల నాన్నని చూసి ఫొటోగ్రాఫర్ ''మై హుం నా.. '' అన్నట్టు కళ్లతో సైగ చేస్తూ.. చిరునవ్వుతో పిల్లాడితో ఇలా అన్నాడు.

''ఇటు చూడమ్మా.. కెమెరానే చూడాలి.. ఫ్లాష్ వస్తుంది.. కళ్లు మూయకూడదు. ఇలా అలా కదలకూడదు. చూడు కెమెరా లోంచి పిట్టలొస్తాయి....''

తన చేతిలో ఉన్న ఫోన్ పక్కన పెడుతూ ఏడేళ్ల పిల్లాడి జవాబు ఇది..

''ఏం కతలు పడుతున్నావా.. సరిగా ఫోకస్ చెయ్యి.. పోట్రెయిట్ మోడ్ యూస్ చెయ్యి. ఐఎస్ఓ 200 కంటే తక్కువ పెట్టు. హై రెజల్యూషన్ పిక్ కావాలి. ఫేస్‌బుక్ ప్రొఫైల్ కోసం. ముచ్చట్లాపి సరిగ్గా తియ్యి.. పిచ్చుకలెలా వస్తాయి కెమెరాలోంచి ఏం మీ అయ్యగూడు పెట్టిండా కెమెరాలోపల...''

– ఫొటోగ్రాఫర్ ఫేస్ ఫీలింగ్స్... పిల్లాడి నాన్న కళ్లలో భయం సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదుగా...

....

పిల్లలు పిడుగులవుతున్నారు.. నిన్నటి చందమామ కథలు ఇకవారి దగ్గర నడవవు.

సమస్త ప్రపంచం, టెక్నాలజీ వారి చేతిలోకి వచ్చింది.

....

ఇలాంటి దృశ్యాలు ఇప్పుడు మామూలే..

ఓ చిన్నారి.. ఏవో చిన్నచిన్న వస్తువులతో రోబో వంటి ఆకృతిని తయారు చేసింది. సముద్రాలెన్ని, ఖండాలెన్ని, వాటి పేర్లేమిటన్న పాఠాలనూ అప్పజెప్తోంది.

మరో చిన్నారి ఉన్నట్టుండి చక్కగా బొమ్మలు వేయడం మొదలుపెట్టేసింది. ఇంకో చిన్నారి పేపర్‌ను మడిచి విభిన్న ఆకృతులను (ఒరిగామి) తయారు చేస్తోంది.

ఇవేవీ బడిలో చెప్పినవి కాదు. తల్లిదండ్రులు నేర్పినవీ కాదు.. మరెక్కడివి? యూట్యూబ్‌లో ఎడ్యుకేషన్ వీడియోలు చూశారు. తామూ సొంతంగా ఏదో చేయాలనుకున్నారు. అంతే.. ఇలాంటి చిన్నారులెందరో 'టెక్నాలజీ' గురువుకు ఏకలవ్య శిష్యులు.



రోజూ మూడు గంటలు సోషల్ మీడియాలో...

గత ఏడాది మన దేశంలో పిల్లల సోషల్ మీడియా అలవాట్లపై సర్వే జరిగింది. అందులో 9 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో 60 శాతం మంది రోజూ 3 గంటలకుపైనే సోషల్ మీడియాలో గడుపుతున్నట్టు తేలింది.

- 13–17 ఏళ్ల మధ్య టీనేజర్లలో 95 శాతం 8–12 మధ్య పిల్లల్లో 40 శాతం మంది సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు.
- పిల్లల్లో 15 శాతం మంది రోజూ 6 గంటలకుపైగా ఫోన్‌తో గడిపితే.. 46 శాతం మంది మూడు నుంచి ఆరు గంటల వరకు వాడుతున్నారు. మరో 39 శాతం మంది గంట నుంచి 3 గంటల వరకు వినియోగిస్తున్నారు.
- 18 ఏళ్లలోపువారు ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగించాలంటే తల్లిదండ్రుల అనుమతిని తప్పనిసరి చేయాలని 73 శాతం తల్లిదండ్రులు సర్వేలో పేర్కొనడం గమనార్హం.

....

టెక్... కిక్...

ప్రముఖ ప్యూ రీసెర్చ్ సంస్థ చేసిన ఓ అధ్యయనం ప్రకారం.. టీనేజ్ పిల్లలు తాము సాధించిన విజయాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. 49 శాతం మంది తాము సాధించినది చెప్పుకొంటుంటే.. 44 శాతం మంది కుటుంబానికి సంబంధించిన పోస్టులు..విహార యాత్రలు, సంబరాలు, ఫంక్షన్లు వంటివి చేస్తున్నారు.

- 34 శాతం మంది తమ ఎమోషన్లను సోషల్‌మీడియాలో పంచుకుంటుంటే.. అందులో పర్సనల్ విషయాలనూ ప్రస్తావిస్తున్నవారు 13 శాతం ఉన్నారు.
- మతపరమైన అంశాలపై 11 శాతం, రాజకీయ అంశాలపై 9 శాతం టీనేజర్లు పోస్టులు పెడుతున్నారు. ఇక ఎడ్యుకేషన్, సోషల్, ఎంటర్‌టెయిన్‌మెంట్ వంటి ఇతర అంశాలపై 28 శాతం మంది పోస్టులు పెడుతున్నారు.

....

డిజిటల్ ఏజ్ తగ్గుతోంది...

ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు అధ్యయనాల ప్రకారం.. పిల్లల చేతికి 'టెక్' అందుతున్న వయసు క్రమంగా తగ్గుతూ వస్తోంది. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, కంప్యూటర్లు, ఇతర ఇంటర్నెట్ ఆధారిత పరికరాల విస్తృతే దీనికి కారణం. ఆడుతూ, పాడుతూ నేర్చుకునే క్రమంలో.. ఇటు ఇళ్లలో, అటు స్కూళ్లలో కూడా డిజిటల్ పరికరాల వినియోగం బాగా పెరిగింది. నడక నేర్చుకునే కంటే ముందే.. 'ఫోన్'ను ఆపరేట్ చేయడం, గేమ్స్ ఆడటం నేర్చుకుంటున్న పరిస్థితి ఉంది.

....

కరోనా లాగా స్పీడ్‌గా...

కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఏడాదికిపైగా లాక్‌డౌన్లు పెట్టాయి. పెద్దవాళ్లకు కాస్త వెసులుబాటు ఇచ్చినా.. పిల్లల బడులైతే ఏడాదిన్నర పాటు నడవలేదు. ఇంట్లోంచి బయటికి వెళ్లలేని పరిస్థితి. కానీ టెక్నాలజీ పుణ్యమా అని ఏదీ ఆగలేదు. ఆన్‌లైన్ క్లాసులతో పిల్లల చదువులు భేషుగ్గా సాగాయి. సరికొత్త బోధన దిశగా అడుగులు పడ్డాయి. అదే సమయంలో పిల్లలు తోటివారితో వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకోవడం, చాటింగ్ చేయడం ద్వారా ఒంటరితనాన్ని అధిగమించగలిగారు... **అక్కడ నుంచి సోషల్ మీడియా వేగంగా అంటుకుంది.**

....

నిపుణుల అబ్జర్వేషన్ ఇదీ..

- టెక్నాలజీ చిన్నారులు కొత్త విషయాలను నేర్చుకునేందుకు అద్భుత అవకాశాలను ఇస్తోంది. ఎడ్యుకేషన్ యాప్స్, వీడియోలు, ఇంటరాక్టివ్ గేమ్స్ వంటివి కొత్త, కఠినమైన అంశాలను కూడా అరటిపండు ఒలిచి నోటికి అందించినట్టుగా అతి సులువుగా, సొంతంగా నేర్చుకోగలిగిన సామర్థ్యాన్ని ఇస్తున్నాయి.
- విస్తృతమైన సమాచారం అందుబాటులో ఉండటంతో పిల్లల్లో విజ్ఞానాన్ని పెంచుతోంది. ఏదైనా ఓ అంశానికి సంబంధించిన కొత్త కొత్త సంగతులను శోధించి తెలుసుకునే అవకాశాలు ఉంటున్నాయి.
- టెక్నాలజీ పిల్లల్లో చిన్ననాటి నుంచే సృజనాత్మకతకు పదును పెడుతోంది. కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయగలిగే సామర్థ్యాన్ని ఇస్తోంది.
- సొంతంగా కంటెంట్‌ను రూపొందించి ప్రపంచవ్యాప్తంగా ఎవరితోనైనా పంచుకోగలగడంతో పిల్లల్లో వినూత్న ఆలోచనలకు, ఆత్మవిశ్వాసం పెరగడానికి తోడ్పడుతోంది.
- పజిల్స్‌ను పరిష్కరించడం, ఎడ్యుకేషన్ సంబంధిత గేమ్స్ ఆడటం ద్వారా.. సమస్యలను పరిష్కరించే నైపుణ్యం అలవడుతోంది. ఏదైనా సమస్యకు కొత్త తరహాలో, సులువైన పరిష్కారం కనుగొనే దిశలో ఏకాగ్రత పెంపొందుతోంది.
- ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా ప్రపంచవ్యాప్తంగా విభిన్న నేపథ్యాలున్న పిల్లలను కలిసే అవకాశంతో సామాజిక సంబంధాలపై, భిన్నమైన ప్రాంతాల్లో పరిస్థితులపై అవగాహన ఏర్పడుతోంది. విభిన్న వ్యక్తులతో ఎలా వ్యవహరించాలి, ఎలా స్నేహం చేయాలనే సామర్థ్యం సమకూరుతోంది.

....

వారి సూచన ఇదీ...

ఇదే సమయంలో కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ వంటి పరికరాల అతి వినియోగం కాస్త చేటుకూ దారితీస్తోంది. పిల్లల శారీరక, మానసిక అంశాలపై ముఖ్యంగా భావోద్వేగాలపై ప్రభావం చూపుతోంది. చిన్నవయసులోనే టెక్నాలజీ వాడకంతో దుష్ప్రభావాలపైనా చాలా అధ్యయనాలు జరిగాయి. ఇబ్బందికరమైన, తప్పుడు సమాచారం, సైబర్ బుల్లీయింగ్ వంటివి పిల్లల మానసిక పరిస్థితిపై వ్యతిరేక ప్రభావం చూపుతున్న ఘటనలూ ఉన్నాయి. రూపాయికి బొమ్మా బొరుసు రెండూ ఉన్నట్టే.. టెక్నాలజీ వెంట మంచి, చెడు రెండూ వస్తున్నాయి. తల్లిదండ్రులు కాస్త జాగ్రత్తగా ఉండగలిగితే చాలు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.చవితి రా.1.04 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** చిత్త పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ప.2.04 నుండి 3.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.47 నుండి 12.34 వరకు, **అమృత ఘడియలు:** రా.12.33 నుండి 2.18 వరకు, సంకటహర చతుర్థి; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 6.01.

క్లుప్తంగా...

ఏపీ చదువులు భేష్

- విదేశీ విద్యానిపుణుల బృందం



విద్యార్థినితో మాట్లాడుతున్న విదేశీ విద్యానిపుణులు

చీమకుర్తి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానాలు, విద్యాబోధన, విద్యార్థుల నైపుణ్యాలు మెరుగైన నాణ్యతతో కూడుకుని ఉన్నాయని విదేశీ విద్యానిపుణులు ప్రశంసించారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మైనంపాడులోని ప్రభుత్వ డైట్ కాలేజీని విదేశాలకు చెందిన విద్యానిపుణులు మంగళవారం సందర్శించారు. ఇంగ్లండ్‌కు చెందిన పర్సనల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ ఎరిక్ బాబర్ట్, అమెరికాకు చెందిన పోస్ట్ ఆథరైజేషన్ పాలసీ అండ్ డిజైన్ సీనియర్ మేనేజర్ వెండీగ్రీస్‌తో పాటు ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ గిరిబాబు యాదవ్ డైట్ కాలేజీని సందర్శించిన వారిలో ఉన్నారు. ఇంటర్నేషనల్ బాక్‌లారియట్ (ఐబీ) సిలబస్ అమలులో భాగంగా ఐబీ వింగ్ నుంచి మొత్తం ఏడుగురు సభ్యులు రాష్ట్రంలో పర్యటనకు వచ్చారు. వారిలో ఇంగ్లండ్, అమెరికాకు చెందిన ఇద్దరు ప్రతినిధులు మైనంపాడులోని డైట్ కాలేజీ, ప్రభుత్వ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. డైట్ కాలేజీ, హైస్కూలు హెచ్‌ఎంతో పాటు కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులతో సంభాషించి విద్యార్థుల నైపుణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలే సమాచార వారధి

- రిజర్వ్ బ్యాంక్ జీఎం ఆర్.కె.మహాన




రామవరప్పాడు: బ్యాంకు పథకాలు, సేవల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకునేలా ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు ప్రజలు, బ్యాంకుల మధ్య సమాచార వారధిగా పని చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్.కె. మహాన అభిలషించారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించారు. మహాన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు బ్యాంక్‌లు అందిస్తున్న సేవలు, బ్యాంక్ ప్రొడక్ట్స్, సామాజిక భద్రత పథకాలు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లకు ఆయన సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ముప్పల శ్రీధర్, ఎన్టీఆర్ జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక, సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ప్రతినిధి గౌతమ్, సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్‌కుమార్, రాష్ట్ర సమన్వయకర్త వై.బాబురావు, జిల్లా సమన్వయకర్త కె. శ్రీనివాసరావు, అక్షరాస్యతా కౌన్సిలర్లు చింతిరాల చక్రవర్తి, సగ్గుర్తి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పుట్టిందే సహకార వ్యవస్థ

- సీనియర్ సహకారవేత్త మానం ఆంజనేయులు

సాక్షి, అమరావతి: పాలకపక్షం, ఉద్యోగులు, సభ్యులు కలసికట్టుగా ఉంటే సహకార సంస్థల అభివృద్ధికి ఢోకా ఉండదని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సహకారవేత్త మానం ఆంజనేయులు తెలిపారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్(నాఫ్కాబ్) డైరెక్టర్‌గా ఘన విజయం సాధించిన విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావును ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఫెడరేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ బ్యాంకును గుజరాత్, మహారాష్ట్రలోని బ్యాంకుల తర్వాత దేశంలోనే నంబర్ వన్ స్థానానికి చేర్చడంలో రాఘవేంద్రరావు నాయకత్వ పటిమ తోడ్పడిందని ప్రశంసించారు.

ఇగ్నో రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ శర్మ



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ దోనేపూడి రామాంజనేయశర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలోని పూణేలో పనిచేస్తూ విజయవాడ రీజనల్ సెంటర్‌కు ఆయన బదిలీపై వచ్చారు. ఆయన హైదరాబాద్, విజయవాడ, మధురై, ఢిల్లీలో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తామని, అలాగే దూరవిద్యను ఎక్కువ మందికి చేరువ చేయనున్నట్లు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన శర్మకు ప్రస్తుత రీజనల్ డైరెక్టర్ కె.సుమలత, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు.

పట్టు రైతులకు అండగా ప్రభుత్వం

- ఏటా పెరుగుతున్న విస్తీర్ణం, ఉత్పత్తి
- సకాలంలో రాయితీలు, ప్రోత్సాహకాలు చెల్లింపు
- చంద్రబాబు హయాంలో పట్టుగూళ్ల సగటు ధర కిలో రూ.350
- ప్రస్తుతం కిలో రూ.480 నుంచి రూ.550 మధ్య ధర
- భారీ లాభాలను కళ్లజూస్తున్న రైతులు
- అయినా ప్రభుత్వంపై 'ఈనాడు' విషప్రచారం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక వ్యవసాయం, అనుబంధ రంగాలను ప్రాధాన్యత రంగాలుగా గుర్తించింది. రైతులకు విత్తు నుంచి విక్రయం వరకు అండగా ఉండటానికి గ్రామాల్లోనే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500, పంట నష్టపరిహారం, రైతులకు ఉచిత విద్యుత్.. ఇలా ఒకటా రెండా దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని పథకాలు.. దేశవిదేశాల నుంచి ఏపీ వ్యవసాయ విధానాలపై ప్రశంసలు.. ఇన్ని కళ్ల ముందు కనిపిస్తున్నా పచ్చకళ్ల కబోధి, ఈనాడు పత్రికాధినేత రామోజీ రావుకు మాత్రం ఇవేమీ కనిపించడం లేదు. పట్టు రైతులు కష్టాలు పడుతున్నారని.. పథకాలకు ప్రభుత్వం పాతరేసిందని.. రైతులకు రాయితీలు నిలిపేసిందని అసత్యాలు, అబద్ధాలతో మంగళవారం జగనన్న మంకు'పట్టు' అంటూ ఒక విష కథనాన్ని వండివార్చారు. దీనికి సంబంధించిన అసలు వాస్తవాలు ఇవిగో..

ముడిపట్టు ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో గత ఐదేళ్లుగా పట్టుసాగు భారీగా విస్తరించింది. ప్రభుత్వం అండగా నిలవడంతో పట్టు రైతులు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో లాభాలు కళ్లజూస్తున్నారు. కొత్తగా ఈ రంగంలో అడుగు పెట్టే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఇలా అడుగడుగునా చేయూతనిస్తుంటే ఈనాడు మాత్రం ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుంది.

ఆరోపణ: గతమెంతో ఘనం.. నేడు దైన్యస్థితిలో పట్టు రైతులు

వాస్తవం: 2014–15 నుంచి 2018–19 మధ్య కొత్తగా 39,433 ఎకరాల్లో 15,362 మంది రైతులు పట్టు సాగు చేపట్టారు. 25,632 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్లు పండించారు. 2019–20 నుంచి 2023–24 మధ్య కొత్తగా 40,362 ఎకరాల్లో 17,852 మంది రైతులు పట్టు సాగు చేపట్టారు. అదనంగా 30,272 మెట్రిక్ టన్నుల పట్టు గూళ్లు పండించారు. ఇక గతేడాది రికార్డు స్థాయిలో రూ.4,075 కోట్ల విలువైన 55,363 టన్నుల క్రాస్ బ్రీడ్ పట్టుగూళ్లు, 12,542 టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్లు ఉత్పత్తయ్యాయి. రూ.3,687.15 కోట్ల విలువైన 9,311 టన్నుల నాణ్యమైన ముడిపట్టును సిల్క్‌రీలర్లు ఉత్పత్తి చేశారు.

ఆరోపణ: రాయితీలకు కోత.. నిధుల విడుదలకు సతాయింపు

వాస్తవం: ఈ ఐదేళ్లలో పట్టు రైతులకు ప్రభుత్వం రూ.19.41 కోట్ల బైవోల్టిన్ కకున్ ఇన్సెంటివ్‌ను అందజేసింది. ఈ ఏడాది మరో రూ.4.50 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేసింది. ఇక పట్టు రీలర్లకు 4 ఏళ్లలో రూ.8.20 కోట్ల ఇన్సెంటివ్స్ ఇచ్చింది. ఈ ఏడాది మరో రూ.2.75 కోట్లు విడుదల చేసింది. ఈ ఏడాది పట్టు రైతులకు రాయితీలిచ్చేందుకు రూ.25 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఇలా క్రమం తప్పకుండా పట్టు రైతులకు ఇన్సెంటివ్‌లు, రీలర్లకు ప్రోత్సాహకాలు ఇస్తుంటే.. ఈనాడు పత్రిక సత్యదూరమైన ఆరోపణలు చేయడం విస్మయానికి గురిచేస్తోంది.



ఆరోపణ: 33 శాతం పైగా పెరిగిన ఉత్పత్తి వ్యయం

వాస్తవం: కిలో పట్టు గూళ్లకు 2018–19లో మార్కెట్ ధర రూ.350లకు మించి ఉండేది కాదు. కానీ ప్రస్తుతం సరాసరి ధర రూ.480 నుంచి రూ.550 మధ్య పలుకుతోంది. అంటే 2018–19తో పోలిస్తే సరాసరి ఆదాయం కిలోకు అదనంగా రూ.200కు పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. గత ఐదేళ్లలో గరిష్టంగా బైవోల్టిన్ రకం పట్టు గూళ్లకు కిలోకి రూ.881కు పైగా లభించింది. పైగా రైతుల పట్టుగూళ్ల ఉత్పాదకత కూడా గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. ప్రతి వంద గుడ్లకు గతంలో 60 కిలోలొస్తే, ఆర్బీకేల ద్వారా నిర్వహిస్తోన్న పట్టు సాగు బడుల ఫలితంగా ప్రస్తుతం 70–75 కిలోలు వస్తోంది. దీన్ని బట్టి చూస్తే రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యారే తప్ప ఈనాడు ఆరోపించినట్టు ఏ దశలోనూ ఇబ్బందిపడిన దాఖలాలు లేవు.

ఆరోపణ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శీతకన్ను

వాస్తవం: చాకీ పురుగులు నూరు శాతం సరఫరా చేయడం, రీరింగ్ షెడ్లలో టర్బో వెంటిలేటర్స్, కూలింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయడం, షూట్ రీరింగ్ పద్ధతులపై పట్టుసాగు బడుల ద్వారా అవగాహన కల్పించడం వల్ల సమయంతో పాటు కూలీల ఖర్చు 40 శాతం వరకు తగ్గింది. పైగా 15–20 శాతం మేర మల్బరీ ఆదా అవుతోంది. ఫలితంగా పట్టు రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 వేల ఎకరాల్లో మల్బరీ విస్తరణ లక్ష్యం కాగా ఇప్పటికే 5,242 మంది రైతులు 7,720 ఎకరాల్లో కొత్తగా సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో రూ.3,462 కోట్ల విలువైన 66,593 టన్నుల నాణ్యమైన కకూన్స్, 13,246 టన్నుల బైవోల్టిన్ కకూన్స్‌ను ఉత్పత్తి చేశారు. రూ.3,560 కోట్ల విలువైన 9,150 టన్నుల రా సిల్క్ ఉత్పత్తి అయ్యింది. ప్రస్తుత ఏడాదిలో పట్టు పరిశ్రమ కోసం రూ.99.71 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరపగా ఇప్పటికే రూ.28.80 కోట్లు విడుదల చేసింది. 2021–22లో పట్టు పరిశ్రమ స్థూలాదాయం రూ.11,638 కోట్లు ఉండగా 2022–23లో రూ.12,098 కోట్లతో సరికొత్త రికార్డు నెలకొల్పింది.

ఆరోపణ: యాంత్రీకరణ సహా పథకాల ఎత్తివేత

వాస్తవం: క్రిమిసంహారక మందుల కొనుగోలుకు 9,525 మంది రైతులకు రూ.2.38 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. యంత్ర పరికరాల కోసం పట్టు పరిశ్రమ ద్వారా 1,524 మంది రైతులకు రూ.8.25 కోట్లు ఇచ్చింది. పట్టు రైతులు నిర్మించుకున్న షెడ్లతో పాటు మల్బరీ తోటల సాగు, రీలింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం రూ. 111.61 కోట్లు విడుదల చేసింది. పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ బకాయిలన్నింటినీ రైతుల ఖాతాకు జమ చేస్తోంది. ప్రభుత్వం ఇన్ని చేస్తున్నా యంత్ర పరికరాలకు మంగళం పాడేశారంటూ ఈనాడు అబద్ధాలను అచ్చేసింది.

● విశాఖ జిల్లా గాజువాకలోని ఒక కమర్షియల్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న ఆకాష్ అకాడమీ నుంచి ఉదయం 5.30 గంటలకు మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో ఆకాష్ అకాడమీ–బైజూస్ ఇన్‌స్టిట్యూట్‌లో రూ.కోటి విలువైన వస్తువులు కాలిపోయినట్లు సమాచారం.

అమ్మను నిండుగా నమ్ముకుంటిని..

- దుర్గమ్మను కీర్తిస్తూ సాగిన 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం'
- రెండో రోజు ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యం నింపిన మాడుగుల అవధానం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): 'అమ్మను.. దుర్గమ్మను నిండుగా నమ్ముకుంటిని..' అంటూ అమ్మవారిని కీర్తిస్తూ ప్రఖ్యాత అవధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ రెండో రోజు మంగళవారం 'శ్రీదుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' కార్యక్రమాన్ని కొనసాగించారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సాహితీవేత్తలు పృచ్ఛకులుగా అడిగిన ప్రశ్నలు, దత్తపదులకు అవధాని నాగఫణిశర్మ అపూర్వమైన పద్యాలతో పూరించి పండిత, పామరులను మంత్రముగ్ధులను చేశారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్నఅమ్మవారిని, స్వామి వారిని కీర్తిస్తూ అనేక పద్యాలను పాడారు. 'యువతే నిండినా భారతాంధ్రమున' అంటూ దేశంలో అత్యధికంగా ఉన్న యువతను, వారి ప్రాముఖ్యతను వివరించారు. 'మన భారతమే మహికితము' అంటూ దేశ ఔన్నత్యాన్ని కీర్తించారు. ఈ సందర్భంగా పృచ్ఛకులు సంధించిన 30 దత్త పదులు, మరో 30 సమస్య పూరణలు, కొన్ని వర్ణనలు, విశేషంగా ఆశువులు పూర్వార్థములు పూరించి అక్కడి వారిని మంత్రముగ్ధులను చేశారు. శతావధానానికి సంచాలకులుగా వ్యవహరించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మహావధాని మాట్లాడుతూ పద్యానికి తిలోదకాలిస్తున్న నేటి రోజుల్లో నాగఫణి శర్మ వినూత్న ప్రయోగాలతో అవధానాలను రంజరంజితం చేస్తున్నారని కొనియాడారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి మాట్లాడుతూ మరుగున పడుతున్న అవధాన విధానానికి డాక్టర్ మాడుగుల పునర్వైభవాన్ని తీసుకొస్తున్నారని ప్రశంసించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ప్రసంగించారు. శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరి తారక శ్రీనివాసులు డాక్టర్ మాడుగులను సత్కరించారు. దేవదాయ, ధర్మాదాయశాఖ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీతుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో లోకా జగన్నాథశాస్త్రి, మాడుగుల శివశ్రీ శర్మ, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మహా శతావధానంలో ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ

'నాట్కో' ట్రస్ట్‌తో ప్రభుత్వం ఎంవోయూ

గుంటూరు జీజీహెచ్‌లో 100 పడకలతో మరో క్యాన్సర్ భవనం

సాక్షి, అమరావతి/గుంటూరు మెడికల్: క్యాన్సర్ రోగులకు ప్రభుత్వ రంగంలో కార్పొరేట్ వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో సెంటర్‌ను లెవల్–1 క్యాన్సర్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీన్లో భాగంగా నాట్కో సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న 100 పడకలకు అదనంగా మరో 100 పడకలతో బ్లాక్ నిర్మాణానికి 'నాట్కో' ఫార్మా సంస్థ వైద్య, ఆరోగ్య శాఖతో ఎంవోయూ కుదుర్చుకుంది. మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సమక్షంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, నాట్కో ఫార్మా వ్యవస్థాపకుడు, నాట్కో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వి.సి.నన్నపనేని మంగళవారం ఎంవోయూ చేసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో రేడియేషన్, మెడికల్, సర్జికల్ వంటి అన్ని రకాల విభాగాల్ని ఏర్పాటు చేయడం ద్వారా క్యాన్సర్ రోగులకు సమగ్ర చికిత్స అందుతుందని వివరించారు. క్యాన్సర్ చికిత్స నిర్ధారణ కోసం అవసరమైన పెట్, సిటి మెషిన్ కొనుగోలుకు కూడా టెండర్లు పిలిచామని తెలిపారు. ఈ సెంటర్‌లో శిక్షణ పొందిన నర్సులు మాత్రమే పని చేసే విధంగా 30 ప్రత్యేక పోస్టులతో కలిపి మొత్తం 120 పోస్టుల్ని మంజూరు చేశామన్నారు. వి.సి. నన్నపనేని మాట్లాడుతూ సుమారు 35 వేల చదరపు అడుగుల్లో అదనంగా 100 పడకల క్యాన్సర్ బ్లాక్ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని తెలిపారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లోని రోగులకు ఉచిత మందుల పంపిణీలో భాగంగా ఈ త్రైమాసికానికి రూ.60 లక్షల విలువైన మందుల్ని కృష్ణబాబుకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



ఒప్పందం పత్రాలు మార్చుకుంటున్న నాట్కో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నన్నపనేని, డీఎంఈ నరసింహం


రాష్ట్ర విద్యుత్ సంస్థలకు జాతీయ అవార్డులు

స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డు
ఉత్తమ నోడల్ ఏజెన్సీగా నెడ్‌కాప్‌కు బిజినెస్ కనెక్ట్ అవార్డు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థలు మరోసారి తమ ప్రతిభను నిరూపించాయి. రెండు ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్ సెటిల్‌మెంట్ (ఐఎస్‌ఓఏ) అప్లికేషన్‌కుగానూ స్కోచ్ సెమీ ఫైనలిస్ట్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డును ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్(ఏపీ ట్రాన్స్‌కో) దక్కించుకుంది. ఈ అప్లికేషన్‌ను ఏపీ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ) అభివృద్ధి చేసింది. అలాగే పంప్డ్ స్టోరేజ్ పవర్ (పీఎస్‌పీ) ప్రాజెక్టులను ప్రోత్సహించినందుకుగానూ ఉత్తమ నోడల్ ఏజెన్సీగా బిజినెస్ కనెక్ట్ అవార్డును ఏపీ నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) కైవసం చేసుకుంది.

అవార్డులు వచ్చాయి ఇలా..

డిస్కంలు ఓపెన్ యాక్సెస్ (ఓఏ) వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్రంలో వివిధ పవర్ డెవలపర్లు అనేక పవర్ ప్లాంట్‌లను స్థాపించారు. ఓఏ వినియోగదారులలో వేగవంతమైన పెరుగుదల కారణంగా, నోడల్ ఏజెన్సీ అయిన ఏపీఎస్ఎల్‌డీసీ, ఎనర్జీ బిల్లింగ్ సెంటర్ (ఈబీసీ) సకాలంలో నెలవారీ విద్యుత్, డిమాండ్ సెటిల్‌మెంట్లు చేయటం కష్టంగా మారింది. దీంతో బహుళ ఓపెన్ యాక్సెస్ వినియోగదారులు వివిధ ఓపెన్ యాక్సెస్ జనరేటర్ల నుంచి విద్యుత్ సరఫరాను పొందడంలో జాప్యం జరిగేది. దీంతో ఏపీఎస్ఎల్‌డీసీ అంతర్గత ఐటీ బృందం ఓపెన్ యాక్సెస్ సెటిల్మెంట్‌ల ఆలస్యాన్ని తగ్గించేందుకు ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్ సెటిల్‌మెంట్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసింది. దీనివల్ల ఈ ప్రక్రియ సులభం అయ్యింది. ఇక పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్‌ను ప్రోత్సహించడానికి అనువుగా ఉన్న ప్రదేశాలను గుర్తించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. 44.79 గిగా వాట్ల పునరుత్పాదక సామర్థ్యం ఉన్న 39 అనువైన ప్రదేశాల్లో టెక్నో–కమర్షియల్ ఫీజిబిలిటీ రిపోర్ట్స్ (టీసీఎఫ్ఆర్)ను నెడ్‌కాప్ తయారు చేసింది. అలాగే 1,680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్రాజెక్ట్, 2,300 మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యాలతో కూడిన 4,280 మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ (ఐఆర్ఈపీఎస్) పాణ్యం మండలం పిన్నాపురం వద్ద నిర్మాణం పూర్తయ్యే దశలో ఉంది. ఈ చర్యలు జాతీయ స్థాయిలో అవార్డులు రావడానికి కారణమయ్యాయి.



ఏపీ ట్రాన్స్‌కోకు లభించిన స్కోచ్ అవార్డు



ఉత్తమ నోడల్ ఏజెన్సీగా నెడ్‌కాప్‌కు దక్కిన బిజినెస్ కనెక్ట్ అవార్డు

సీఎం సహకారంతోనే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోనే రాష్ట్ర విద్యుత్ సంస్థలు జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధిస్తున్నాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. జాతీయ అవార్డులు వరించిన సందర్భంగా స్థానిక విద్యుత్ సౌధలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మార్గదర్శకంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల అలుపెరగని కృషితో ఏపీ విద్యుత్ సంస్థలు భవిష్యత్తులో కూడా మరెన్నో అవార్డులు సాధించగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ అవార్డులు సాధించిన ఏపీ ట్రాన్స్‌కో, నెడ్‌కాప్‌ను అభినందించారు. ఈ సమావేశంలో ఏపీజెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, నెడ్‌కాప్ వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి, ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ బి. మల్లారెడ్డి, డైరెక్టర్ (గ్రిడ్) ఏకేవీ భాస్కర్, డైరెక్టర్ (ఫైనాన్స్) టీ వీరభద్రారెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిలువుటద్దం రామాచార్యులు

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

తెనాలి/గుంటూరు ఎడ్యుకేషన్/మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తెనాలి ప్రాంత ఉన్నతికి కారకులైన మహానుభావుల విగ్రహాలతో తెనాలి బండ్ రూపకల్పన చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందనీయుడని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. తెనాలి బండ్‌పై ప్రప్రథమంగా రామాచార్య స్మారక సమితిచే ప్రతిష్టించిన జాతీయవాది తమిరిశ రామాచార్యులు కాంస్య విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఆయన ప్రసంగిస్తూ జనసంఘ్‌లో ఉన్నప్పట్నుంచి రామాచార్యులు నిబద్ధతతో పనిచేసేవారనీ సమాజంపై ఆయన చూపిన ప్రభావం గొప్పదన్నారు. విగ్రహ రూపశిల్పి కాటూరి వెంకటేశ్వరరావును గవర్నర్ సత్కరించారు.



రామాచార్యులు విగ్రహం వద్ద ఇంద్రసేనారెడ్డి, శివకుమార్

పరిశోధనాత్మక ఆలోచనలతో చదవాలి: విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలతో చదవాలని ఇంద్రసేనారెడ్డి అన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సిల్వర్‌జూబ్లీ భవన నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తదితరులు మాట్లాడారు.

వినికిడి యంత్రాల పంపిణీ: విభిన్న ప్రతిభావంతులకు సాధ్యమైనంత ప్రోత్సాహం అందించాలని ఇంద్రసేనారెడ్డి సూచించారు. విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 150 మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ డైరెక్టర్ తోట సర్వారాయుడు, దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు మాట్లాడారు.

మత్స్యకారులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ఏయూ క్యాంపస్: మత్స్యకారులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ) వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం విశాఖలోని ఏయూలో కేంద్ర వాణిజ్య శాఖ పరిధిలోని నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్(న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో 'ఫిష్ మార్కెటింగ్ వ్యవస్థలో మెరుగైన విధానాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. మత్స్య ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు డాక్టర్ హేమంత్ రావు, ఎస్‌పీ సింఘ్, జై సింఘ్ మీన, డి.భామిరెడ్డి, ఎ.జయబాల్, వి.వెంకటేశ్వరరావు, ఏయూ రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.



గఘనయానులు...

భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో పాల్గొనబోతున్న వ్యోమగాములంతా నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థులే. ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్, శుభాన్షు శుక్లా వృత్తిరీత్యా యుద్ధపైలెట్లు. వీరంతా గగన్‌యాన్ కోసం ఇప్పటికే రష్యాలో వ్యోమగాములుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. భారత్‌లోనూ ఇస్రో వీరికి కొంతకాలంగా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. తమ నలుగురు యుద్ధవిమాన పైలెట్లు గగన్‌యాన్‌లో భాగస్వాములు కావడం తమకెంతో గర్వకారణమని భారత వాయుసేన పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ 'సూపర్ ఫోర్' గురించి...

ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్

భారత వాయుసేనలో యుద్ధవిమానాన్ని సుదీర్ఘకాలంపాటు నడిపిన అనుభవం ఉన్న పైలెట్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ ఈ నలుగురిలో ఒక్కడిగా ఎంపికయ్యారు. కేరళలోని తిరువజియాడ్‌లో 1976 ఆగస్ట్ 26న జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)లో శిక్షణ పూర్తిచేసుకుని అక్కడే 'స్వార్డ్ ఆఫ్ హానర్'ను సాధించారు. తమిళనాడులోని వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో, తాంబరం ఎఫ్ఐఎస్‌లో చదువుకున్నారు. తర్వాత ఈయన 1998 డిసెంబర్19న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో యుద్ధవిమాన పైలెట్‌గా విధుల్లో చేరారు. సుఖోయ్30ఎంకేఐ, మిగ్–21, మిగ్–29 ఇలా పలు రకాల యుద్ధవిమానాలు నడపడంలో ఈయన దిట్ట. మొత్తంగా 3,000 గంటలకుపైగా యుద్ధవిమానాలను నడిపారు. కీలకమైన సుఖోయ్–30 స్క్వాడ్రన్‌కు కమాండింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. 'ఎ' కేటగిరీ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, టెస్ట్ పైలెట్‌గా అనుభవం గడించారు. గగన్‌యాన్‌లో ఈయన గ్రూప్ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. నాయర్ భార్య లీనా మలయాళ సినీపరిశ్రమలో నటిగా పేరొందారు. వీళ్లది పెద్దలు కుదిర్చిన పెళ్లి. గత నెల 17వ తేదీన వీరి వివాహం జరిగింది. ' మా ఆయనకు తొలి ఇండియన్ ఆస్ట్రోనాట్ వింగ్స్ దక్కడం కేరళ రాష్ట్రానికే గర్వకారణం' అని ఆమె ఆనందం వ్యక్తంచేశారు. వీళ్ల కుటుంబం కేరళలోని పాలక్కడ్ జిల్లా నెన్మరలో నివసిస్తోంది. నాయర్‌ను ఆస్ట్రోనాట్‌గా ప్రధాని ప్రకటించగానే నెన్మరలో పండగ వాతావరణం నెలకొంది.

అజిత్ కృష్ణన్

అజిత్ కృష్ణన్ 1982లో చెన్నైలో జన్మించారు. ఈయన సైతం ఎన్‌డీఏలో శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకుని స్వోర్డ్ ఆఫ్ ఆనర్ పొందారు. రాష్ట్రపతి బంగారు పతకాన్ని సాధించారు. ఈయన తమిళనాడులోని వెల్లింగ్టన్‌లోని డీఎస్ఎస్‌సీలోనూ చదువుకున్నారు. 2003 జూన్‌లో భారత వాయుసేనలో పైలెట్‌గా చేరారు. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, టెస్ట్ పైలెట్‌గా ఉంటూ 2,900 గంటలపాటు యుద్ధ విమానాలను నడిపారు. సుఖోయ్, మిగ్, జాగ్వర్, డోర్నియర్, ఏఎన్–32 రకం విమానాలను నడిపారు. ఈ మిషన్‌లో అవసరం మేరకు గ్రూప్ కెప్టెన్‌గా ఉంటారు.

అంగద్ ప్రతాప్

అంగద్ ప్రతాప్ 1982లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జన్మించారు. ఈయన సైతం ఎన్‌డీఏ పూర్వ విద్యార్థే. 2004 డిసెంబర్‌లో భారత వాయుసేన దళాల్లో చేరారు. టెస్ట్ పైలెట్‌గా, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలందించారు. దాదాపు 2,000 గంటలపాటు విమానాలు నడిపిన అనుభవం ఉంది. సుఖోయ్ 30 ఎంకేఐ, మిగ్–21, మిగ్–29, హాక్, డోర్నియర్, ఏఎన్–32సహా ఎన్నో రకాల విమానాలను సమర్థవంతంగా నడిపారు. గగన్‌యాన్ మిషన్‌లో ఈయన గ్రూప్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు.

శుభాన్షు శుక్లా

వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 1985లో జన్మించారు. ఎన్‌డీఏలో శిక్షణ పూర్తిచేసుకుని 2006 జూన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలెట్‌గా చేరారు. ఫైటర్ కంబాట్ లీడర్‌గా, టెస్ట్ పైలెట్‌గా 2,000 గంటలపాటు యుద్ధవిమానాలు నడిపారు. భారత వాయుసేనలోని దాదాపు అన్నిరకాల యుద్ధవిమానాలు నడపడంలో ఈయన నైపుణ్యం సాధించారు. ఈ నలుగురికి రష్యాలోని యూరీ గగారిన్ కాస్మోనాట్ శిక్షణ సంస్థలో సమగ్రమైన శిక్షణ ఇచ్చారు. గగన్‌యాన్‌లో ఈయన వింగ్ కమాండర్‌గా వ్యవహరిస్తారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత 'సూపర్ ఫోర్'!

మన గగన్‌యాన్ వ్యోమగాములు వీళ్లే ● జాతికి పరిచయం చేసిన మోదీ

- దేశ ఆకాంక్షలకు ప్రతిరూపమంటూ ప్రశంస
- ప్రతిష్టాత్మక ఆస్ట్రోనాట్ వింగ్స్ ప్రదానం
- వచ్చే ఏడాది ఆరంభంలో అంతరిక్షంలోకి!

తిరువనంతపురం: భారత అంతరిక్ష చరిత్రలో మరో సువర్ణాధ్యాయానికి తెర లేచింది. మన అంతరిక్ష సంస్థ ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. మిషన్‌లో పాల్గొని రోదసిలోకి వెళ్లనున్న నలుగురు భారత వ్యోమగాములను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం జాతికి పరిచయం చేశారు. ఇందుకోసం ఎంపికైన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ సుభాన్షు శుక్లా పేర్లను ఆయన స్వయంగా ప్రకటించారు. వీరు నలుగురూ భారత వాయుసేనకు చెందిన ఫైటర్ పైలట్లే. కేరళలోని తుంబలో ఉన్న విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వారికి ప్రతిష్టాత్మకమైన 'ఆస్ట్రోనాట్ వింగ్స్'ను మోదీ ప్రదానం చేశారు. అనంతరం భావోద్వేగపూరితంగా ప్రసంగించారు. దేశ అమృత తరానికి వారు అత్యుత్తమ ప్రతినిధులంటూ ప్రశంసించారు. ''ఈ నలుగురు వ్యోమగాముల పేర్లు భారత విజయగాథలో శాశ్వతంగా నిలిచిపోతాయి. నాలుగు దశాబ్దాలుగా దేశం కంటున్న కలను వారు నిజం చేయనున్నారు'' అంటూ కొనియాడారు. ''వీళ్లు కేవలం నలుగురు వ్యక్తులో, నాలుగు పేర్లో కాదు. 140 కోట్ల మంది భారతీయుల కలలకు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలవనున్న నాలుగు ప్రబల శక్తులు!'' అన్నారు. గగన్‌యాన్ మిషన్ పూర్తిగా దేశీయంగా రూపుదిద్దుకుని మేకిన్ ఇండియాకు తార్కాణంగా నిలిచిందంటూ హర్షం వెలిబుచ్చారు. ఏ విధంగా చూసినా ఇది చరిత్రాత్మక మిషన్ అని చెప్పారు. ''గతంలో భారతీయ వ్యోమగామి వేరే దేశం నుంచి విదేశీ రాకెట్‌లో రోదసీలోకి వెళ్లొచ్చారు. మళ్లీ నాలుగు దశాబ్దాల తర్వాత భారత్ అంతరిక్షంలో అడుగు పెట్టబోతోంది. ఈసారి టైమింగ్, కౌంట్‌డౌన్, రాకెట్‌తో సహా అన్నీ మనం స్వయంగా రూపొందించుకున్నవే. గగన్‌యాన్ మిషన్‌లో వినియోగిస్తున్న ఉపకరణాల్లో అత్యధికం భారత్‌లో తయారైనవే. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న స్వావలంబనకు తార్కాణమిది'' అన్నారు. ఈ అమృత కాలంలో భారత వ్యోమగామి దేశీయ రాకెట్‌లో చంద్రునిపై దిగడం ఖాయమని జోస్యం చెప్పారు.

అంతరిక్ష శక్తిగా భారత్

భారత అంతరిక్ష రంగం సాధిస్తున్న ప్రగతి యువతలో శాస్త్రీయ జిజ్ఞాసను ఎంతగానో పెంపొందిస్తోందని, 21వ శతాబ్దిలో మనం ప్రపంచశక్తిగా ఎదిగేందుకు బాటలు పరుస్తోందని మోదీ హర్షం వెలిబుచ్చారు. ఇస్రో సాధించిన పలు ఘన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ''తొలి ప్రయత్నంలోనే అరుణ గ్రహం చేరి అతి కొద్ది దేశాలకే పరిమితమైన అరుదైన ఘనత సాధించాం. ఒకే మిషన్‌లో 100కు పైగా ఉపగ్రహాలనూ రోదసిలోకి పంపాం. చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా రికార్డు సృష్టించాం. ఆదిత్య ఎల్1ను భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టాం. ఇలాంటి విజయాలతో భావి అవకాశాలకు ఇస్రో సైంటిస్టుల బృందం నూతన ద్వారాలు తెరుస్తోంది. ఫలితంగా అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచ వాణిజ్య హబ్‌గా మారనుంది. మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రానున్న పదేళ్లలో ఐదింతలు పెరిగి 44 బిలియన్ డాలర్లకు చేరనుంది'' అని చెప్పారు. ఇస్రో అంతరిక్ష మిషన్లలో మహిళా సైంటిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. చంద్రయాన్ మొదలు గగన్‌యాన్ దాకా ఏ ప్రాజెక్టునూ మహిళా శక్తి లేకుండా ఊహించుకోలేని పరిస్థితి ఉందన్నారు. 500 మందికి పైగా మహిళలు ఇస్రోలో నాయకత్వ స్థానాల్లో ఉన్నారంటూ హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్, సీఎం పినరాయి విజయన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్, ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్, సైంటిస్టులు తదితరులు పాల్గొన్నారు.

వారిది మొక్కవోని దీక్ష

గగన్‌యాన్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో నలుగురు వ్యోమగాములూ అత్యంత కఠోరమైన శ్రమకోర్చారంటూ మోదీ ప్రశంసించారు. ''అత్యంత కఠినమైన శారీరక, మానసిక పరిశ్రమతో పాటు యోగాభ్యాసం కూడా చేశారు. ఆ క్రమంలో ఎదురైన ఎన్నో సవాళ్లను మొక్కవోని పట్టుదలతో అధిగమించారు. రోదసి మిషన్ కోసం తమను తాము పరిపూర్ణంగా సన్నద్ధం చేసుకున్నారు'' అన్నారు. వారు దేశంలోని పలు ప్రాంతాలతో పాటు 13 నెలలు రష్యాలోనూ శిక్షణ పొందారు. మానవసహిత గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా 2025లో ముగ్గురు వ్యోమగాములను రోదసిలోని 400 కిలోమీటర్ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలోకి పంపి 3 రోజుల తర్వాత సురక్షితంగా వెనక్కు తీసుకురావాలన్నది ఇస్రో లక్ష్యం. ఇది విజయవంతమైతే అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. గగన్‌యాన్ మిషన్‌కు రూ.10 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా.


విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్‌లో ప్రధాని మోదీ


స్పేస్ సెంటర్‌లో వ్యోమమిత్రతో మాట్లాడుతున్న ప్రధాని

హాయ్ వ్యోమమిత్రా

గగన్‌యాన్ మిషన్ ప్రగతిని విక్రం సారభాయి స్పేస్ సెంటర్లో మోదీ సమీక్షించారు. మిషన్‌కు సంబంధించిన పలు అంశాలను సోమనాథ్‌తో పాటు ఇస్రో సైంటిస్టులను అడిగి తెలుసుకున్నారు. మానవసహిత యాత్రకు ముందు గగన్‌యాన్‌లో భాగంగా రోదసిలోకి వెళ్లనున్న హ్యూమనాయిడ్ రోబో వ్యోమమిత్రతో సరదాగా సంభాషించారు.

మహిళ ఎందుకు లేదంటే...

గగనయాన్ మిషన్‌కు ఎంపికైన నలుగురిలో ఒక్క మహిళ కూడా లేకపోవడం ఆసక్తికరంగా మారింది. అంతరిక్ష యాత్రకు వ్యోమగాముల ఎంపిక ప్రక్రియే అందుకు కారణమని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి మిషన్లకు టెస్ట్ పైలట్ల పూల్ నుంచి మాత్రమే వ్యోమగాముల ఎంపిక జరుగుతుంది. అత్యున్నత వైమానిక నైపుణ్యంతో పాటు అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ నిబ్బరంగా వ్యవహరించగల సామర్థ్యం టెస్ట్ పైలట్ల సొంతం. గగన్‌యాన్ మిషన్‌కు ఎంపిక జరిపిన సమయంలో భారత టెస్ట్ పైలట్ల పూల్‌లో ఒక్క మహిళ కూడా లేరు. దాంతో గగన్‌యాన్ మిషన్‌లో మహిళా ప్రాతినిధ్యం లేకుండాపోయింది. భావి మిషన్లలో మహిళా వ్యోమగాములకు స్థానం దక్కుతుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు.

3 ప్రాజెక్టులు జాతికి అంకితం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సమీప భవిష్యత్తులో చేపట్టనున్న భారీ రాకెట్ ప్రయోగాల నిమిత్తం సుమారు రూ.1,800 కోట్లతో నిర్మించిన మూడు ఇస్రో సెంటర్లను మోదీ తుంబా నుంచి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో పీఎస్ఎల్‌వీ ఇంటిగ్రేషన్ భవనం, ఇస్రో ప్రపొల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటీ భవనం, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ట్రైసోనిక్ విండ్ టన్నెల్ భవనాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిద్వారా ఏటా 8 నుంచి 15 పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాలతో పాటు మొదటి ప్రయోగ వేదికపై ఒకేసారి రెండు రాకెట్లను అనుసంధానం చేసుకునే వెసులుబాటు కలుగుతుంది

కేజ్రీవాల్‌కు మళ్లీ నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి సమన్లు పంపింది. మార్చి 4వ తేదీన విచారణకు రావాలంటూ మంగళవారం జారీ చేసిన ఎనిమిదో విడత నోటీసుల్లో పేర్కొంది. ఆరోసారి నోటీసులు జారీ చేసిన సమయంలో కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో సహకరించడం లేదంటూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ ఫిర్యాదు చేసింది. దీంతో కోర్టు సమన్లు అందుకున్న కేజ్రీవాల్ ఈనెల 17న వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది.

జమాతె ఇస్లామీపై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: జమాతె ఇస్లామీ జమ్మూ కశ్మీర్ (జేఈఎల్)పై నిషేధాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. వేర్పాటువాద చర్యలకు, హింసను ప్రేరేపించేందుకు అవసరమైన నిధులు సేకరించడంతో పాటు ఈ సంస్థపై మొత్తం 47 కేసులున్నాయి. దీనిపై 2019 ఫిబ్రవరిలో తొలిసారి కేంద్రం నిషేధం విధించింది.

జయప్రదను అరెస్ట్ చేయండి

రామ్‌పూర్(యూపీ): గత లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగినపుడు ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన కేసులో మాజీ ఎంపీ, నటి జయప్రదను అరెస్ట్‌చేయాలని అక్కడి రామ్‌పూర్ కోర్టు పోలీసులను ఆదేశించింది. అరెస్ట్ చేసి మార్చి నెల ఆరోతేదీన తమ ఎదుట ప్రవేశపెట్టాలని సూచించింది. 2019లో ఎన్నికల ప్రవర్తనానిబంధనావళి ఉల్లంఘనపై కేమారి, స్వార్ పోలీస్‌స్టేషన్లలో జయప్రదపై రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విషయమై తమ ముందు హాజరుకావాలని ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు జయప్రదకు సూచించింది. అయినా ఆమె రాకపోవడంతో ఇప్పటి వరకు ఏడుసార్లు నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీఅయ్యాయి. ఇంత జరిగినా ఆమె కోర్టుకు రాకపోవడంతో జయను 'పరారీలో ఉన్న వ్యక్తి'గా జడ్జి ప్రకటించారు.

జోరుగా క్రాస్ ఓటింగ్

రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ జాక్‌పాట్ ● పోలింగ్ జరిగిన 15 సీట్లలో 10 కైవసం

- కాంగ్రెస్‌కు హిమాచల్‌లో అనూహ్య షాక్
- ఆరుగురి క్రాస్ ఓటింగ్, సింఘ్వి ఓటమి
- యూపీలో బీజేపీకి 8 సీట్లు, ఎస్పీకి రెండే
- ఏడుగురు ఎస్పీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్!

బెంగళూరు/లఖ్‌నవూ/సిమ్లా/న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల్లో జోరుగా క్రాస్ ఓటింగు సాగింది. దాంతో సంఖ్యాబలం ప్రకారం 8 స్థానాలు నెగ్గాల్సిన బీజేపీ మరో రెండు చోట్ల అనూహ్య విజయం సాధించింది! యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి, హిమాచల్‌ప్రదేశ్‌లో పాలక కాంగ్రెస్‌కు గట్టి షాకిచ్చింది. ఏప్రిల్లో ఖాళీ అవుతున్న 56 రాజ్యసభ స్థానాలకు గాను 41 చోట్ల ఎన్నిక ఇప్పటికే ఏకగ్రీవం కావడం తెలిసిందే. యూపీలో 10, కర్ణాటకలో 4, హిమాచల్‌లో ఒకటి చొప్పున మిగతా 15 స్థానాలకు మంగళవారం ఓటింగ్ జరిగింది. అసెంబ్లీల్లో సంఖ్యాబలం మేరకు యూపీలో బీజేపీ 7, ఎస్పీ 3; కర్ణాటకలో కాంగ్రెస్ 3, బీజేపీ 1; హిమాచల్‌లో ఏకైక స్థానంలో కాంగ్రెస్ గెలవాల్సి ఉంది. కానీ బీజేపీ హిమాచల్‌లో పోటీకి దిగడమే గాక యూపీలో 8వ అభ్యర్థిని రంగంలోకి దించింది. కర్ణాటకలో కూడా ముగ్గురు కాంగ్రెస్, ఒక బీజేపీ అభ్యర్థితో పాటు దాని మిత్రపక్షం జేడీ(ఎస్) నుంచి ఐదో అభ్యర్థి పోటీకి దిగారు. యూపీలో ఏడుగురు ఎస్పీ, ఒక బీఎస్పీ ఎమ్మెల్యేలు; హిమాచల్‌లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీకి అనుకూలంగా ఓటేశారు. దాంతో హిమాచల్‌లోని ఏకైక సీటుతో పాటు యూపీలో 8వ రాజ్యసభ స్థానమూ బీజేపీ కైవసమయ్యాయి. కర్ణాటకలో మాత్రం బీజేపీ ఎత్తులు పారలేదు. సంఖ్యాబలానికి అనుగుణంగా కాంగ్రెస్ 3, బీజేపీ ఒక స్థానంలో నెగ్గాయి. అయితే ఒక బీజేపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటేయడమే గాక మరొకరు ఓటింగ్‌కు దూరంగా ఉండి పార్టీకి షాకిచ్చారు! మూడు పార్టీలూ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై చర్యలకు తమ సిద్ధమవుతున్నాయి!

హిమాచల్‌లో టాస్

హిమాచల్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలకు గాను పాలక కాంగ్రెస్‌కు 40 మంది ఎమ్మెల్యేలుండగా బీజేపీకి 25 మందే ఉన్నారు. అయితే ముగ్గురు స్వతంత్రులతో పాటు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు ఓటేశారు. దాంతో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి అనూహ్య ఓటమి చవిచూశారు. అభ్యర్థులిద్దరికీ సమానంగా చెరో 34 ఓట్లు రావడంతో టాస్ ద్వారా హర్ష్‌ను విజేతను తేల్చారు. ఇక యూపీలో హైడ్రామా చోటుచేసుకుంది. ఓవైపు పోలింగ్ జరుగుతుండగానే సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ మనోజ్ పాండే పార్టీ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ నిర్వహించిన సమావేశానికి ఆయనతో పాటు మరో ఏడుగురు ఎస్పీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. వీరిలో కనీసం ఏడుగురు బీజేపీకి అనుకూలంగా ఓటేసినట్టు తేలింది. ఒక బీఎస్పీ ఎమ్మెల్యే కూడా బీజేపీకి ఓటేశారు. దాంతో ఆ పార్టీ అభ్యర్థులు ఆర్‌పీఎన్ సింగ్, తేజ్‌వీర్‌సింగ్, అమర్‌పాల్ మౌర్య, సంగీతా బల్వంత్, సుధాన్షు త్రివేది, సాధనాసింగ్, నవీన్ జైన్, సంజయ్ సేథ్ విజయం సాధించారు. సమాజ్‌వాదీ నుంచి జయాబచ్చన్, రాంజీలాల్ సుమన్ నెగ్గగా ఆలోక్ రంజన్ ఓటమి పాలయ్యారు. కర్ణాటకలో మాత్రం ఊహించిన ఫలితాలే దక్కాయి. కాంగ్రెస్ అభ్యర్థులు అజయ్ మాకెన్, సయ్యద్ నాసిర్ హుస్సేన్, జీసీ చంద్రశేఖర్, బీజేపీ అభ్యర్థి నారాయణ కె.బాండే గెలుపొందగా జేడీ(యూ) అభ్యర్థి కుపేంద్రరెడ్డి ఓటమి చవిచూశారు. అయితే యశవంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయగా యల్లాపుర బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ పోలింగ్‌కు దూరంగా ఉన్నారు! వారిద్దరూ కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. వారిపై చర్యలకు బీజేపీ సిద్ధమైంది. క్రాస్ ఓటింగ్ నేపథ్యంలో హిమాచల్‌లో సుఖ్విందర్ సింగ్ సుఖు సర్కారు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వాలను కూల్చేయడం మోదీ సర్కారుకు అలవాటుగా మారిందంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు.


మంగళవారం కోర్టు రూంలోనే ఓర్లోవ్‌ను కస్టడీలోకి తీసుకుంటున్న సైనం

రష్యా హక్కుల నేతకు 30 నెలల జైలు

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగిన తీరును తీవ్రంగా తప్పుబడుతూ వ్యాసాలు రాసిన రష్యా మానవ హక్కుల కార్యకర్తపై అక్కడి కోర్టు కన్నెర్రజేసింది. ప్రభుత్వ చర్యను తప్పుబడుతూ ఆర్టికల్స్ రాయడం నేరమంటూ 70 ఏళ్ల ఒలెగ్ ఓర్లోవ్‌కు 30 నెలల కారాగార శిక్ష విధిస్తూ మాస్కో కోర్టు తీర్పు చెప్పింది. రాజకీయ దురుద్దేశ్యంతో పెట్టిన కేసు ఇది అని ఆయన చేసిన వాదనలను కోర్టు పట్టించుకోలేదు. ఆయనకు రెండు సంవత్సరాల 11 నెలల జైలు శిక్ష వేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించగా రెండు సంవత్సరాల ఆరునెలల శిక్షను కోర్టు ఖరారుచేసింది. ఈ కేసులో గతంలోనే విచారణ ముగిసింది. అప్పుడు ఆయనకు కొంతమేర జరిమానా కట్టాలని మాత్రమే కోర్టు సూచించింది. అయితే పుతిన్ ప్రభుత్వంపై విమర్శలను సహించేది లేదని, కఠిన శిక్ష వేయాల్సిందేనని ప్రాసిక్యూషన్ ఈ కేసు పునర్విచారణను కోరి చివరకు ఇలా శిక్ష పడేలా చేసింది. గతంలో నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని అందుకున్న మానవహక్కుల సంస్థ 'మెమోరియల్'కు ఓర్లోవ్ సహ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఓర్లోవ్‌ను శిక్షించడాన్ని మెమోరియల్ సంస్థ తీవ్రంగా తప్పుబట్టింది. తమ ఉద్యమం ఆగదని పేర్కొంది.

బందీల్ని వదిలితే యుద్ధ విరామం: బైడెన్

జెరూసలేం: రంజాన్ మాసారంభం లోగానే యుద్ధానికి విరామం ఇచ్చేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పారు. అయితే, ముందుగా హమాస్ మిలిటెంట్లు కొందరు ఇజ్రాయెల్ బందీలను విడిచిపెట్టేందుకు అంగీకరించాల్సి ఉందన్నారు. తాత్కాలిక విరమణ సమయంలో మిగతా బందీల విడుదలతోపాటు ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను మరికొందరిని విడుదల చేయడానికి సంబంధించి చర్చలు జరుగుతాయన్నారు. వచ్చే వారం నుంచి ఒప్పందం అమల్లోకి రావచ్చని ఎన్‌బీసీకిచ్చిన ఇంటర్వ్యూలో బైడెన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా, ఈజిప్టు, ఖతార్‌ల మధ్యవర్తిత్వంతో రూపుదిద్దుకుంటున్న ఈ ఒప్పందం పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. అయితే, చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని హమాస్ ప్రతినిధి ఒకరు చెప్పారు. తమ డిమాండ్లపై పునరాలోచన ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. బైడెన్ తెలిపిన అంశాలపై ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పందించలేదు. మార్చి 10న రంజాన్ మాసం మొదలుకానుంది.

లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఖాన్విల్కర్

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నియమితులయ్యారు. లోక్‌పాల్ జ్యుడీషియల్ సభ్యులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ లింగప్ప నారాయణ స్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితు రాజ్ అవస్థి, నాన్ జ్యుడీషియల్ సభ్యులుగా సుశీల్ చంద్ర, పంకజ్ కుమార్, అజయ్ టిర్కేలు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ మంగళవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వీరి నియామకాలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. జస్టిస్ ఖాన్విల్కర్ సుప్రీంకోర్టు జడ్జిగా 2022 జూలైలో పదవీ విరమణ చేశారు. లోక్‌పాల్‌కు చైర్‌పర్సన్ సభ్యుల పదవీ కాలం ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వయసు దాకా ఉంటుంది. ప్రధాని అధ్యక్షతలోని ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు వీరిని రాష్ట్రపతి నియమిస్తారు.

అంతటా మిత్రులే.. కేరళలో తప్ప!

కాంగ్రెస్, కమ్యూనిస్టుల బంధంపై మోదీ ఎద్దేవా

తిరువనంతపురం: కేంద్రంలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా గట్టి కూటమిని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేశమంతటా ఎప్పటికీ మిత్రులు(బెస్ట్ ఫ్రెండ్స్ ఫరెవర్, బీఎఫ్ఎఫ్)గా కొనసాగే కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు ఒక్క కేరళలో మాత్రం శత్రువులుగా ఉంటాయని వ్యాఖ్యానించారు. మంగళవారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన కేరళ బీజేపీ విభాగం పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. దేశ పురోగతికి సంబంధించిన ఎలాంటి రోడ్ మ్యాప్ కూడా ప్రతిపక్ష పార్టీల వద్ద లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో గెలవలేమని తెలిసే తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు సంధిస్తున్నారన్నారు. 'సీఎం విజయన్‌కు అవినీతి, కుంభకోణాలతో సంబంధముందని, ఫాసిస్ట్ ప్రభుత్వం అంటూ కాంగ్రెస్ ఆరోపణలు చేస్తుంది. బదులుగా కమ్యూనిస్ట్ ప్రభుత్వం కాంగ్రెస్ శ్రేణులపై లాఠీచార్జి చేయిస్తుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు సైతం అవినీతికి పాల్పడ్డాయని ప్రత్యారోపణలు చేస్తుంది. ఇదంతా కేరళలోనే. బయట ఇండియా కూటమి భేటీల్లో రెండు పక్షాల నేతలు కలిసి కూర్చుని సమోసాలు, బిస్కెట్లు తింటూ టీ తాగుతుంటారు. వీరు తిరువనంతపురంలో చెప్పేదొకటైతే, ఢిల్లీలో చెప్పేది ఇంకొకటి'అని ప్రధాని మోదీ పేర్కొన్నా రు.

కాంగ్రెస్ జాడల్లోనే కమ్యూనిస్టులు..

కాంగ్రెస్ ట్రాక్ రికార్డు చూస్తే దశాబ్దాలపాటు ఒకే ఒక్క కుటుంబం దేశంపై పెత్తనం ఎలా చెలాయించిందీ తెలుస్తుందన్నారు. 'ఆ ఒక్క కుటుంబం ప్రయోజనాలు దేశ ప్రజలందరి ప్రయోజనాల కంటే కూడా మిన్న. ఇప్పుడు కమ్యూనిస్టులు సైతం ఇదే రకంగా వ్యవహరిస్తున్నారు. మీ యువరాజును కేరళ నుంచి తీసుకెళ్లండి'అంటూ ఇక్కడి కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు చెబుతున్నారంటూ వయనాడ్ ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందంటూ వామపక్ష ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలును ఆయన కొట్టిపారేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగానే కేరళ కూడా గత పదేళ్లలో కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలతో అభివృద్ధిబాటన పయనించిందన్నారు. ఓటు బ్యాంకు కోణంలో ఏ రాష్ట్రాన్ని కూడా బీజేపీ చూడలేదని చెప్పారు.

మదురై మీనాక్షి ఆలయంలో మోదీ

సాక్షి, చెన్నై: తమిళనాడులోని ప్రసిద్ధి చెందిన మదురై మీనాక్షి అమ్మవారిని ప్రధాని మోదీ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం తమిళనాడుకు ప్రధాని వచ్చారు. ముందుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నిర్వహించిన 'నా మట్టి...నా ప్రజలు'పాదయాత్ర ముగింపు సమావేశానికి హాజరయ్యారు. తిరుప్పూర్ జిల్లా పల్లడంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ ఇండియా కూటమిపై విమర్శలు ఎక్కుబెట్టారు. బీజేపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తంచేశారు.

ఐసీయూలో రోగిపై అత్యాచారం

జైపూర్: ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి ఆలనాపాలనా చూడాల్సిన నర్సింగ్ అసిస్టెంట్ అఘాయిత్యానికి పాల్పడిన అమానవీయ ఘటన రాజస్తాన్‌లో చోటుచేసుకుంది. అఘాయిత్యం వేళ ప్రతిఘటించిన ఆమెకు నిందితుడు మత్తుమందు ఇంజెక్షన్ ఇవ్వడం దారుణం. అల్వార్ జిల్లాలోని శివాజీ పార్క్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 24 ఏళ్ల వివాహిత ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో తీవ్ర అస్వస్థతకు గురై జిల్లాలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను ఐసీయూ గదిలో చికిత్స అందిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో అక్కడే పనిచేసే చిరాగ్ యాదవ్ అనే నర్సింగ్ అసిస్టెంట్ ఆమెను రేప్‌చేయబోయాడు. వెంటనే ప్రతిఘటించిన ఆమెకు ఒక మత్తుమందు ఇంజెక్షన్ ఇచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేసి ఘోరానికి పాల్పడ్డాడు. తర్వాత కొంతసమయానికి భర్త ఫోన్ చేయగా ఆమె జరిగిన దారుణాన్ని చెప్పి బోరుమంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఐదుగురు లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన ఆప్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ఢిల్లీలో నలుగురు, ఒకరు హరియాణాలో ఒక అభ్యర్థి పేర్లను ఆమ్ ఆద్మీ పార్టీ మంగళవారం ప్రకటించింది. ఢిల్లీలో సోమనాథ్ భారతి న్యూఢిల్లీ స్థానం నుంచి బరిలో దిగుతారు. కోండ్లి ఎమ్మెల్యే కుల్దీప్‌కుమార్ ఈస్ట్ ఢిల్లీ, సహిరాం పహిల్వాన్ సౌత్ ఢిల్లీ, మాజీ ఎంపీ మహాబల్ మిశ్రా వెస్ట్ ఢిల్లీ నుంచి పోటీ చేస్తారు. హరియాణాలో కురుక్షేత్ర నుంచి మాజీ ఎంపీ సుశీల్ గుప్తా బరిలోకి దిగుతారు. సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా ఢిల్లీలో మూడు స్థానాలను కాంగ్రెస్ పార్టీకి ఆప్ కేటాయించడం తెలిసిందే.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



రాజ్‌నాథ్‌సింగ్‌కు స్వాగతం

గన్నవరం: విజయవాడలో జరగనున్న బీజేపీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మంగళవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.



ఏర్పాట్ల పరిశీలన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పామర్రు పర్యటన నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ నయీమ్ అస్మి పరిశీలించారు. -8లో▸



వినికిడి యంత్రాల పంపిణీ

మొగల్రాజపురం: దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు.

చల్లారని మంటలు

టీడీపీ-జనసేన మధ్య తారస్థాయికి సీటు హీట్

- మైలవరంలో ఎమ్మెల్యే వసంతకు గ్రీన్ సిగ్నల్
- భగ్గుమంటున్న దేవినేని ఉమా వర్గీయులు
- పార్టీ ఏదైనా పోటీ పెడన నుంచే అంటున్న వేదవ్యాస్
- మండలి బుద్ధ ప్రసాద్‌కు సీటు ఇవ్వాల్సిందేనంటూ అనుచరుల పట్టు
- చంద్రబాబు భక్తుడినంటూ బుద్దా మరో సమావేశం



మైలవరంలో దేవినేని ఉమామహేశ్వరరావు సాక్షిగా వసంత డౌన్ డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ-జనసేన టికెట్ల కేటాయింపు అంశం కాక రేపుతూనే ఉంది. జనసేన టికెట్లు కేటాయిస్తారని భావిస్తున్న అవనిగడ్డ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ అనుచరులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి, అధిష్టానానికి హెచ్చరికలు పంపుతున్నారు. ఇప్పటికే పెడనలో టీడీపీకి టికెట్ కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ జనసేన పార్టీ శ్రేణులు రోడ్డెక్కాయి. టీడీపీ కోవర్టుగా జనసేన కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పనిచేస్తున్నారని మండిపడుతూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశాయి. మరోవైపు తగ్గేదే లేదని తాను పెడన నుంచే పోటీ చేస్తానని, ఏ పార్టీ అనేది తర్వాత సంగతని బూరగడ్డ వేదవ్యాస్ తేల్చి చెబుతున్నారు. అవనిగడ్డలో టీడీపీ నేతలు కార్యకర్తలు మోపిదేవిలో సమావేశం ఏర్పాటు చేసుకొని టీడీపీ, జనసేన నుంచైనా మండలి బుద్ధ ప్రసాద్‌కు సీటు కేటాయించాలని పట్టు పట్టారు. మైలవరంలో సీటు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు టీడీపీ టికెట్ ఖరారు చేయడంతో.. దేవినేని ఉమా వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెనమలూరులో టీడీపీ రోజుకొకరి పేరుతో ఐవీఆర్‌ఎస్ సర్వే చేస్తూ అక్కడ కార్యకర్తలను గందరగోళంలోకి నెడుతోంది.

బుద్ధ ప్రసాద్‌కు సీటు ఇవ్వాల్సిందే..

టీడీపీ-జనసేన మధ్య అవనిగడ్డ సీటు హీట్ పెంచుతోంది. మోపిదేవిలో ఆరు మండలాల టీడీపీ నాయకులు సమావేశం అయ్యారు. టీడీపీ అయినా జనసేన తరఫున అయినా టికెట్ మాత్రం మండలి బుద్ధ ప్రసాద్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని చంద్రబాబుకు అల్టిమేటం జారీ చేశారు. జనసేన అభ్యర్థికి మాత్రం సహకరించేది లేదని కరాఖండిగా తేల్చిచెప్పారు.

రోజుకొకరి పేరుతో..

పెనమలూరు నియోజకవర్గంలో టీడీపీ సీటు కేటాయింపు విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా బోడే ప్రసాద్ ఉన్నప్పటికీ రోజుకొకరి పేరుతో ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహిస్తూ కార్యకర్తలను గందరగోళంలోకి నెడుతోంది. ఇప్పటికే కొలుసు పార్థసారథి, బోడే ప్రసాద్, ఆదిశేషగిరిరావు, ఎంకే బేగ్.. తాజాగా దేవినేని ఉమా పేరుతో సైతం ఐవీఆర్‌ఎస్ సర్వేలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ అభ్యర్థిని ముందుగానే నిర్ణయించుకొని, కంటితుడుపుగా ఐవీఆర్‌ఎస్ సర్వేల పేరుతో బాబు నేతలను మభ్యపెడుతున్నట్లు పార్టీలోనే పలువురు నేతలు పెదవి విరుస్తున్నారు.

మీడియాలో ఫోకస్ కోసం..

నియోజకవర్గంలో జన బలం లేనప్పటికీ, రోజుకో డ్రామాతో బుద్దా వెంకన్న మాత్రం రక్తికట్టిస్తున్నారు. మీడియాలో ఫోకస్ అయ్యేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో రక్తంతో గోడకు అక్షరాలు రాసి రక్తి కట్టించారు. తాజాగా విజయవాడలో బుద్దా వెంకన్న కొందరు నేతలతో సమావేశం ఏర్పాటు చేసి.. తన అభిమానులు అందరూ ఆవేదనతో ఈ సమావేశం పెట్టారని బిల్డప్ ఇచ్చారు. తాను టికెట్ ఆశించి, అవకాశం ఇవ్వాలని కోరుతున్నానని కలరింగ్ ఇచ్చారు. తనకు చంద్రబాబు దైవ సమానులని, టీడీపీలో ఆయారాం, గయారాంలు ఉన్నారని, తాను మాత్రం చంద్రబాబుకు ఆంజనేయుడి వంటి వాడినని తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. విజయవాడ వెస్ట్ టికెట్ జనసేనకు కేటాయించినట్లు బుద్దా వెంకన్నతో పాటు, మిగిలిన నేతలందరికీ అధిష్టానం స్పష్టం చేసినప్పటికీ.. ఈ డ్రామాలు ఎందుకోనని, టీడీపీలోని వర్గాలే చెవులు కొరుక్కుంటున్నాయి.

వసంతకు నిరసన సెగ..

మైలవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు స్థానంలో ప్రస్తుత ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారంటూ మీడియాలో వార్తలు రావడంతో దేవినేని ఉమా అనుచరులు నిరసన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించడానికి మైలవరం వచ్చిన దేవినేని ఉమామహేశ్వరరావు సాక్షిగా అతని అనుచరులు డౌన్ డౌన్ వసంత అంటూ నినాదాలు చేశారు. తమపై అక్రమ కేసులు పెట్టించి ఐదేళ్ల పాటు ఇబ్బంది పెట్టిన వ్యక్తికి మైలవరం టీడీపీ పగ్గాలు ఇవ్వడమేమిటంటూ ఉమా అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవినేని ఉమాకి సీటు ఇవ్వక పోతే సహించేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసంత కృష్ణ ప్రసాద్ దేవినేని ఉమాతో కలిసి పనిచేయడానికి సిద్ధం అని స్పష్టం చేశారు. అయినప్పటికీ గతంలో వీరి మధ్య జరిగిన వ్యక్తిగత దూషణలు, మాటల యుద్ధాన్ని నియోజకవర్గ ప్రజలు మాత్రం గుర్తు చేసుకొంటున్నారు. టికెట్ కోసం ఉమా ఆడిన డ్రామాలు ఫెయిల్ అయ్యాయని కొంత మంది పార్టీనేతలే పేర్కొంటున్నారు. రూ.100 కోట్లు ఇచ్చి మైలవరం టీడీపీ అభ్యర్థిగా వసంత కృష్ణ ప్రసాద్ రావాలని చూస్తున్నారని ఉమా చేసిన వ్యాఖ్యలు నిజం అయ్యాయని చెప్పుకుంటున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ



మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నంటౌన్: అభివృద్ధి చెందిన కృష్ణా జిల్లాలో ఇంకా బాల్యవివాహాలు జరిగేందుకు గల కారణాలను నిర్ధారించి వాటిని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ సూచించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక గాడెల్లి కల్యాణ మండపంలో మచిలీపట్నం డివిజన్ పరిధిలోని బాల్య వివాహ నిరోధక అధికారుల ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని జేసీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా సంరక్షణ కార్యదర్శులు, సంబంధిత అధికారులు బాల్యవివాహాలు ఎందుకు జరుగుతున్నదీ గ్రహించి నివారించాల్సిన అవసరం ఉందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సువార్త మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగటంలో తల్లిదండ్రుల పాత్ర ప్రధానంగా ఉంటుందని వారికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ బాల్యవివాహాలు జరుగుతున్నందుకు గల మూలాలను అన్వేషించి వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను బాధితులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ, మచిలీపట్నం డివిజన్‌లోని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, దిశ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఎంఈవోలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చుక్కల మందు మర్చిపోవద్దు



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ వందశాతం పల్స్‌పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. అందులో భాగంగా హై రిస్క్ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, అక్కడ ఉన్న చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయించుకునేలా వారిలో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఆమె విద్యాధరపురం, సితారసెంటర్, కనకదుర్గమ్మ వారధి, కృష్ణలంక రిటైనింగ్ వాల్, రామలింగేశ్వరనగర్ పుట్టరోడ్డు తదితర ప్రాంతాల్లో సందర్శించారు. మార్చి 3న జాతీయ ఇమ్యునైజేషన్ డేను పురస్కరించుకుని పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీనాయక్, డీపీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విజయవాడ క్రీడాకారుల సత్తా




విజయవాడస్పోర్ట్స్: రెండో దక్షిణ భారత కరాటే పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. గుంటూరు బీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జపాన్ కరాటే అసోసియేషన్‌కు ప్రాతినిధ్యం వహించిన అర్జున్ (అండర్-12 బ్రౌన్ బెల్ట్ బాలుర కటా) గోల్డ్, చాగంటి స్నేహిత (అండర్ 12 గ్రీన్ బెల్ట్ బాలికల కటా) గోల్డ్, వంగర నాగ వెంకటేష్ (అండర్ 12 ఆరంజ్ బెల్ట్ బాలుర కటా) గోల్డ్, రియాన్(ఆర్టీ ఆరంజ్ బెల్ట్ బాలుర కటా) గోల్డ్ మెడల్ సాధించారు. వీరిని ఆంధ్రప్రదేశ్ జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ కోచ్ రవిబాబు, జోనల్ చీఫ్ కోచ్ సాగరిక ప్రత్యేకంగా అభినందించారు.

ప్రశాంతంగా ఏపీ 'టెట్'

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో ఏపీ టెట్-2024 ఆన్‌లైన్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఐయాన్ డిజిటల్ జోన్ (కానూరు), శిరీష ఇన్ఫో టెక్నాలజీస్, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్‌వీటీ ఇన్ఫోటెక్, శ్రీ విజయదుర్గా ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్, శైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, ఐయాన్ డిజిటల్ జోన్ (కొండ్రిక), దరిపల్లి అనంతరాములు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఖమ్మం), సనా ఇంజినీరింగ్ కాలేజ్ (కోదాడ) తదితర కేంద్రాల్లో తొలి రోజు మంగళవారం పరీక్ష జరిగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన పరీక్షకు 2534 మంది హాజరు కావాల్సి ఉండగా 2,271 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగిన పరీక్షకు 2,545 మంది హాజరు కావాల్సి ఉండగా 2289 మంది హాజరయ్యారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డిపాజిటర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ స్పెషల్ పీపీగా శ్రీనివాస్



విజయవాడస్పోర్ట్స్: డిపాజిటర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అర్జా గాంధీ శ్రీనివాస్ మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు హోం ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గాంధీ శ్రీనివాస్ రెండో అదనపు జిల్లా కోర్టు, ఎంఎస్‌జే కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. అవనిగడ్డకు చెందిన గాంధీ శ్రీనివాస్ 1995లో ఆంధ్ర యూనివర్సిటీ నుంచి లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సహకరించిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో గుంటూరు డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైలు నంబరు 07783 విజయవాడ-గుంటూరు, 07788 గుంటూరు-విజయవాడ, 07779 గుంటూరు -మాచర్ల, 07465 గుంటూరు-విజయవాడ, 07786 గుంటూరు-రేపల్లె రైళ్లు ఈ నెల 27 నుంచి మార్చి 11వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

రైతన్నకు వెన్నుదన్ను

- నేడు రైతుభరోసా, సున్నా వడ్డీ పథకం నిధులు విడుదల
- ఎన్టీఆర్ జిల్లాలో 1.42 లక్షల మందికి రూ. 28.73 కోట్లు రైతు భరోసా
- 30,405 మంది రైతులకు రూ. 7.72 కోట్లు సున్నా వడ్డీ



చిలకలపూడి(మచిలీపట్నం)/కంకిపాడు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఎన్నో కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు అండగా నిలుస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా సన్న, చిన్నకారు, ఇతర రైతులందరికీ ఏడాదికి రూ. 13,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 7,500, కేంద్ర ప్రభుత్వం రూ. 6వేలు అందజేస్తోంది. ప్రభుత్వం అందించే ఈ పెట్టుబడి సాయం రైతులకు సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు, ఇతర వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడుతోంది. వరుసగా ఐదో ఏడాది 2023-24 సంవత్సరానికి సంబంధించి మూడో విడత రైతు భరోసా మొత్తాన్ని బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జమ చేయనున్నారు. కృష్ణా జిల్లాలో 1,58,480 మంది రైతులకు రూ. 31.90 కోట్లు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లో వేయనున్నారు.

కృష్ణా జిల్లాలో సున్నా వడ్డీ పథకం ఇలా..

డాక్టర్ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 2019 ఖరీఫ్ నుంచి బ్యాంకుల్లో లక్ష రూపాయల వరకు పంట రుణాలు తీసుకుని సకాలంలో తిరిగి చెల్లించిన రైతులకు వారు కట్టిన వడ్డీ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగుసార్లుగా ఈ సున్నావడ్డీ పథకం ద్వారా 1,26,003 మంది రైతులకు రూ. 23.21 కోట్లు వడ్డీ రాయితీ మొత్తాన్ని వారి ఖాతాల్లో నగదును జమ చేశారు. బుధవారం జరిగే కార్యక్రమంలో 2021-22 రబీకి సంబంధించి 15,002 మంది రైతులకు రూ. 2.80 కోట్లు, 2022-23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 25,180 మంది రైతులకు రూ. 4.22 కోట్లు వడ్డీ మొత్తాన్ని తిరిగి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు సంబంధించి జిల్లా స్థాయి కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు చెక్కును అందజేయనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సున్నావడ్డీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. సకాలంలో రుణాలు చెల్లించే వారికి మంచి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఈ-కేవైసీ చేయించుకోని రైతులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి.

– ఎస్. పద్మావతి,
కృష్ణా జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఎన్టీఆర్ జిల్లాలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి సంబంధించి మూడో విడత మొత్తాన్ని బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 1.42 లక్షల మంది రైతులకు రూ. 28.73 కోట్లు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయనున్నారు.

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం..

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోంది. 2021-22 రబీ, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ పథకం కింద జిల్లాలో 30,405 మంది రైతులకు రూ. 7. 72 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.

తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల పరిసమాప్తం



హోమంలో ద్రవ్యాలు వదులుతున్న చైర్మన్ శ్రీనివాసరావు దంపతులు, అమ్మవారి వంశీకులు

పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారి పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ముందుగా అమ్మవారి కల్యాణం పీటలపై కూర్చొన్న గోపయ్య సమేత తిరుపతమ్మవారి వంశీకులు కొల్లా రఘురామయ్య, రంగమ్మ దంపతులతో కలశపూజలు, పంచాహ్నిక కల్యాణాన్ని పురోహితులు, వేదపండితులు, ఆలయ అర్చకులు పాపమాంబ వంశీకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఐదు రోజుల కల్యాణ ఉత్సవం అనంతరం ఆలయ ఆవరణలో హోమం ఏర్పాటు చేసి శాంతి సంరక్షణ కోసం పూర్ణాహుతి కార్యక్రమం జరిపించారు. హోమం అనంతరం హోమద్రవ్యాలను హోమగుండంలో వేసి తిరునాళ్లకు ముగింపు పలికారు. అనంతరం అమ్మవారి వంశీకులు, పాపమాంబ వంశీకులను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు నూతన వస్త్రాలతో సత్కరించారు. అలాగే పాలకవర్గ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, వేద పండితులు, పురోహితులను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కల్యాణం రోజున తిరుముడి సమర్పించి దీక్ష విరమించని స్వాములు పూర్ణాహుతి రోజు దీక్ష విరమించారు. తిరుముడిలోని ముద్దర (నెయ్యితో నింపిన) టెంకాయలను ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన హోమగుండంలో వదిలారు. పూర్ణాహుతిలో స్వాములతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ అర్చకుల బాహాబాహీ..

భక్తుల ముందే ఆలయ అర్చకులు బాహాబాహీకి దిగిన సంఘటన ఆలయంలో మంగళవారం చోటు చేసుకుంది. అమ్మవారి పెద్దతిరునాళ్ల ముగింపు రోజున తిరుముడి సమర్పించిన దీక్షస్వాములు సమర్పించిన కానుకల విషయంలో ఘర్షణ తలెత్తింది. ఆలయంలో మొత్తం 23 మంది రెగ్యులర్ అర్చకులు ఉండగా ఆరుగురు ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్నారు. రెండు వర్గాల వారికి భక్తులు సమర్పించిన కానుకల విషయంలో వివాదం తలెత్తింది. ఆఖరికి ఒకరిపైఒకరు తోసుకుంటూ బాహాబాహీకి దిగారు. క్యూలైన్లో అక్కడే ఉన్న పాలకవర్గ సభ్యురాలు పద్మ, భక్తులు వారించినా వినిపించుకోలేదు. విషయం తెలిసిన వెంటనే ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు తన పాలకవర్గ సభ్యులతో వచ్చి పరిస్థితిని శాంతింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు మర్రెబోయిన వెంకటరమణ ఇటీవల మరణించారు. ఆయన మరణం తరువాత అర్చకులు రెండు వర్గాలుగా చీలిపోవటంతో కొంతకాలంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. జరిగిన సంఘటనపై ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన ఉప ప్రధానార్చకుడు ఎం. ద్వారకారావు, అర్చకుడు ఎం. సూరిబాబులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించి సంజాయిషీ కోరామన్నారు. అలాగే ఔట్ సోర్సింగ్ విధులు నిర్వర్తిస్తున్న జి. కాసులును విధుల నుంచి తొలగించామని చెప్పారు.

ఎన్నికలకు పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ



ఇబ్రహీంపట్నం నిమ్రా కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా, జేసీ సంపత్

ఇబ్రహీంపట్నం(మైలవరం): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలంలోని నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె. రాణా, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో కౌంటింగ్ కీలక ఘట్టం కావడంతో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి ప్రతిపాదనలు పంపినట్లు, వీటిలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్, పశ్చిమ, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్‌కు నోవా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీని, మైలవరం నియోజకవర్గానికి నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను ప్రతిపాదించినట్లు వివరించారు. కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చి భద్రపర్చడం, అనంతరం వాటిని కౌంటింగ్ కేంద్రాలకు చేర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో లేఅవుట్ ప్రకారం 28 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా, బారికేడింగ్ ఉంటుందన్నారు. ఈ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల ప్రవేశానికి ప్రత్యేక మార్గం, సూచికలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారికి కమ్యూనికేషన్ గది, మౌలిక వసతులు, మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ గదులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సందర్శనలో డీఆర్‌ఓ ఎస్. శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీఓటీహెచ్ భవానీ శంకర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీ

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాదిగ సంఘాల నేతలు



సంఘీభావం తెలుపుతున్న మాదిగ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేసి తీరుతామని మాట తప్పిన బీజేపీకి మంద కృష్ణ మద్దతు ఇవ్వడాన్ని మాదిగ సంఘాల నాయకులు తప్పుబట్టారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో దండు వీరయ్య, ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, కొడమల బెంజిమన్, వేజెండ్ల సుబ్బారావు, నాగయ్య పాల్గొని బీజేపీ తీరుపై మండిపడ్డారు. బీజేపీ మాదిగలను మోసం చేసిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడనున్న నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు జేఏసీగా ఏర్పడాలని సమావేశంలో నిర్ణయించారు. మాదిగల ఐకమత్యానికి సంకేతంగా త్వరలో మహాసభ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో సగం స్థానాలు మాదిగలకు కేటాయించాలన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల స్టేషనరీ సరఫరాకు సీల్డ్‌ కొటేషన్లు ఆహ్వానం

సమర్పించేందుకు మార్చి 4 వరకు గడువు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగమైన పోలింగ్‌ రోజుకు అవసరమయ్యే స్టేషనరీ, బ్రోచర్లు, సైన్‌ బోర్డులు, స్టీల్‌ ర్యాక్‌లు తదితరాలను సరఫరా చేసేందుకు ఆసక్తి గల సరఫరాదారుల నుంచి సీల్డ్‌ కొటేషన్స్‌ ఆహ్వానిస్తున్నట్లు డిస్ట్రిక్ట్‌ పర్చేజ్‌ కమిటీ చైర్మన్‌, జాయింట్‌ కలెక్టర్‌ సంపత్‌ కుమార్‌ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సప్లై రంగంలో అర్హతలు, అనుభవం కలిగిన వారు మార్చి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సీల్డ్‌ కొటేషన్లను ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. టెండర్లకు సంబంధించి పూర్తి వివరాలకుజిల్లా కలెక్టర్‌ కార్యాలయంలోగానీ, జిల్లా ఎన్టీఆర్‌.ఏపీ.జీఓవీ.ఇన్‌ ద్వారా సంప్రదించాలని సూచించారు. టెండరు నిర్వహణ ప్రక్రియ నిబంధనలు, షరతులకు లోబడి జరుగుతుందని జాయింట్‌ కలెక్టర్‌ సంపత్‌కుమార్‌ వివరించారు.

ఖాతాదారులకు క్లయిమ్‌ మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారుడికి క్లయిమ్‌ కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్‌ అధ్యక్షులు చింతలపూడి కిషోర్‌కుమార్‌, నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల మంగళవారం తీర్పు చెప్పారు. బంటుమిల్లికి చెందిన వారా పద్మ యునైటెడ్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీలో హెల్త్‌ ఇన్సూరెన్స్‌ పాలసీని 2020లో తీసుకున్నారు. పాలసీ ఫోర్స్‌లో ఉండగానే 2022లో పద్మకు ఆపరేషన్‌ జరిగింది. దానికి సంబంధించి రూ. 73,710 ఖర్చు కాగా ఆ మొత్తాన్ని ఇన్సూరెన్స్‌ కంపెనీ చెల్లించాలని దరఖాస్తు చేసుకున్నారు. క్లయిమ్‌ను తిరస్కరించడంతో పద్మ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను విచారించిన అనంతరం కమిషన్‌ సభ్యులు రూ. 73,710ను 2022 ఆగస్టు 29 నుంచి తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని, రూ. 25 వేలు మానసిక వేదనకు గురిచేసినందుకు, రూ. 10 వేలు ఖర్చుల నిమిత్తం తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా యునైటెడ్‌ ఇండియా ఇన్సూరెన్స్‌ కంపెనీ చెల్లించాలన్నారు.

దర్జీకి సంక్షేమ దర్జా..



‘ఈ చిత్రంలో కనిపిస్తున్న టి. రుతుకుమారిది మచిలీపట్నం. ఆనందపేటలో చిన్న టైలరింగ్‌ షాప్‌ పెట్టుకొని జీవిస్తున్నారు. పిల్లలు, కుటుంబ పోషణకు భర్త తిరుపతయ్య రోజువారి సంపాదనకు అండగా నిలవాలని టైలర్‌ షాప్‌ పెట్టుకున్నారు. రోజురోజుకు మోడరన్‌ ప్రపంచం విస్తరించడంతో షాప్‌ అంతంత మాత్రంగా నడిచేది. కొన్నిసార్లు దుకాణం అద్దె, కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి. వీళ్ల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.10 వేలు ఆర్థిక భరోసా ‘జగనన్న చేదోడు’ పథకం తెచ్చారు. నాలుగేళ్లలో రూ.40 వేలు నేరుగా ఆమె బ్యాంకు ఖాతాలో జమ కావడంతో ఎంతో ఊరటగా ఉందని.. ఆమె థ్యాంక్యూ జగనన్న అంటున్నారు.’

- టైలర్ల స్థితిగతులు చూసి ఏటా రూ.10 వేలు ఇస్తున్న ప్రభుత్వం
- దర్జీపై మాల్స్‌, షోరూంల ప్రభావం
- ప్రభుత్వ సాయం ఊరట ఇస్తోందంటున్న టైలర్లు
- ఉమ్మడి జిల్లాలో 70వేల మందికి లబ్ధి

సాక్షి, మచిలీపట్నం: దర్జా లేని దర్జీ ఇల్లు గడిపేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. పెద్ద పెద్ద మాల్స్‌, షోరూంలు పుట్టుకు వస్తుండటం, రోజుకో ఆఫర్‌ ప్రకటించడం, సరికొత్త మోడల్స్‌ అందుబాటులోకి రావడంతో జీవనం దయనీయంగా మారుతోంది. రోజంతా శ్రమించినా కుటుంబ పోషణ భారంగా మారడంతో అర్ధాకలి తప్పడం లేదు. ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం చిన్న వృత్తిదారులను ఆదుకునేందుకు పెద్ద పీట వేస్తోంది. వీరికి ఆర్థిక చేయూతనందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా రజకులు, నాయీ బ్రాహ్మణులతో పాటు టైలర్లకూ ఏటా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆచరణలో చేసి చూపారు. దీంతో జిల్లాలో వేల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. బుధవారం కుట్టు మిషన్‌ రూపకర్త విలియమ్స్‌ హూ జయంతి సందర్భంగా టైలర్స్‌ డే నిర్వహించనున్నారు.

రూ.10 వేలతో ఆర్థిక తోడ్పాటు

టైలర్ల కష్టాలను పాదయాత్రలో చూసి చలించి హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ కుల వృత్తులతో పాటు ఏటా రూ.10వేలు ఇచ్చి ఆర్థిక తోడ్పాడు అందిస్తున్నారు. ఏటా వెలువడే నోటిఫికేషన్‌ ఆధారంగా సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేస్తారు. అర్హులకు నేరుగా వారి ఖాతాలోకే నగదును జమ చేస్తారు.

గుర్తింపు ఇలా..

టైలర్లు ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకునేందుకు ముందుగా కార్మికులుగా గుర్తింపు కలిగి ఉండాలి. రాష్ట్ర టెక్నికల్‌ బోర్డు ద్వారా నిర్వహించిన టైలరింగ్‌ లోయర్‌/ హయ్యర్‌ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్లు, లేకపోతే కార్మిక శాఖ ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డు, టైలరింగ్‌ సంక్షేమ సంఘాలు ఇచ్చిన గుర్తింపు కార్డులు జత చేయాలి.

70 వేల మందికి లబ్ధి

‘జగనన్న చేదోడు’ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 70వేల కుటుంబాల్లో ఆనందం నింపింది. వెనుకబడిన తరగతుల సేవా, సహకార సంస్థ (బీసీ కార్పొరేషన్‌) ఆధ్వర్యంలో 2020–21 నుంచి అమలు చేస్తున్నారు. 21 ఏళ్ల నుంచి 60 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి షాపులున్న టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఉమ్మడి జిల్లాలో 70,210 మందికి రూ.70.21కోట్లు జమ చేశారు.

కృష్ణా జిల్లా లబ్ధిదారుల వివరాలు

2020–21 లో 6,587 మంది టైలర్లకు రూ.6.59 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేయగా 2021–22లో 6,332 మందికి రూ. 6.33 కోట్లు, 2022–23లో 7,144 మందికి రూ.7.14 కోట్లు, 2023–24లో 6,750 మందికి రూ. 6.75 కోట్లు చొప్పున నాలుగేళ్లలో 26,813 మంది లబ్ధిదారులకు రూ.26.81 కోట్లు ఖాతాలో వేశారు.

ఎన్టీఆర్‌ జిల్లాలో..

ఎన్టీఆర్‌ జిల్లాలో 2020–21లో 10,801మంది టైలర్లకు రూ.10.80కోట్లు, 2021–22లో 10,314 మందికి రూ.10.31 కోట్లు, 2022–23లో 11,356మందికి రూ.11.36కోట్లు, 2023–24 లో 10,926కి రూ.10.93 కోట్లు నాలుగేళ్లలో 43,397 మంది లబ్ధిదారులకు రూ.43.39 కోట్లు జమ చేశారు.

ప్రభుత్వ సాయం అభినందనీయం



టైలర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.10వేలు ఇచ్చి ఆర్థికంగా తోడ్పాటు అందించడం అభినందనీయం. మోడ్రన్‌ ప్రపంచం కారణంగా రోజురోజుకూ ఆదరణ తగ్గుతున్న రోజుల్లో వృత్తి చాలా కష్టంగా ఉంటోంది. ఇలాంటి సమయంలో మాకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–మహమ్మద్‌ బాషా, తేజాస్‌ టైలర్‌, మచిలీపట్నం

సద్వినియోగం చేసుకోవాలి



టైలర్లకు అండగా నిలవాలని ప్రభుత్వం రూ.10వేలు అందిస్తోంది. కృష్ణా, ఎన్టీఆర్‌ జిల్లాల్లో నాలుగేళ్లలో 70,210 మందికి రూ.70.21కోట్లు ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా వారి ఖాతాలో జమా చేసింది. ఇది వారికి ఎంతో ఊరటనిస్తుంది. వీటిని టైలర్లు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రాజేంద్ర బాబు, బీసీ కార్పొరేషన్‌ ఈడీ (ఎఫ్‌ఏసీ), మచిలీపట్నం

పెండింగ్‌ ఈకేవైసీ పూర్తికి నేడు ప్రత్యేక అవకాశం

కంకిపాడు: ఈ క్రాప్‌ నూరుశాతం పూర్తైంది. దీనికి అనుసంధానంగా జరగాల్సిన ఈకేవైసీ మాత్రం ఇంకా పూర్తి కాలేదు. ప్రభుత్వం నుంచి రాయితీలు దక్కాలన్నా, విపత్తు ముంచుకొస్తే పరిహారం దక్కాలన్నా, మార్కెట్‌ ఒడిదొడుకుల్లో పండించిన పంటకు సరైన ధర లభించాలన్నా ఈకేవైసీ తప్పనిసరి. కానీ రైతులు ఈకేవైసీ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. రైతుకు మేలుచేసే ఈకేవైసీ చేయించాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ఇందుకు ఈ నెల 28వ తేదీ ప్రత్యేక అవకాశం కల్పించారు. జిల్లాలో 79,511 మంది రైతులకు చెందిన 2,32,569 ఎకరాలకు ఈకేవైసీ పూర్తైంది. ఇది 77 శాతంగా నమోదైంది. ఇంకా 45,188 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. నూరుశాతం పూర్తయ్యేందుకు ఈ నెల 28వ తేదీ బుధవారం ప్రత్యేక అవకాశం కల్పించారు

రేపు పోరంకిలో జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 29వ తేదీ గురువారం పోరంకి శ్రీనివాసనగర్‌లోని హ్యాపీమైండ్స్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు వారి కంపెనీల్లో ఖాళీల భర్తీకి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 96666 15539 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రేమ, విలువ, వ్యవస్థతో వివక్షను రూపుమాపగలం

- ప్రొఫెసర్‌ సిడియోల్‌ ఫ్రాంక్‌.హెచ్‌.దీన
- ఏఎన్‌యూలో అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: సమాజంలో వివక్షను రూపుమాపేందుకు ప్రేమ, విలువ, వ్యవస్థ ఎంతో ముఖ్యమని ఆస్ట్రేలియా ఫిలిండర్స్‌ యూనివర్సిటీ అధ్యాపకురాలు ప్రొఫెసర్‌ సిడియోల్‌ ఫ్రాంక్‌.హెచ్‌.దీన అన్నారు. ఏఎన్‌యూ ఆస్ట్రేలియన్‌ స్టడీస్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ‘మార్జినాలిటీ అండ్‌ మల్టీ కల్చరల్‌ లిటరరీ నేటివ్‌ ఆస్ట్రేలియా అండ్‌ ఇండియా’ అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో రెండో రోజైన మంగళవారం పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు ప్రసంగించారు. కొందరు నేరుగా ప్రసంగించగా, కొందరు ఆన్‌లైన్‌ ద్వారా విదేశాల నుంచి తమ పరిశోధనా పత్రాలు సమర్పించి, ప్రసంగించారు. డాక్టర్‌ క్రిస్టియన్‌ విలియమ్స్‌ మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో దక్షిణాసియా డయాస్పరిక్‌ సాహిత్యం ఎంతో వెలుగునిస్తోందని, ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటోందన్నారు. న్యూయార్క్‌కు చెందిన ప్రొఫెసర్‌ నికోలస్‌ బిర్న్స్‌, ముంబాయి యూనివర్సిటీ అధ్యాపకులు ప్రొఫెసర్‌ రాజేష్‌ కర్నకల్‌, కేరళ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్‌ సుజా కురుప్‌, ప్రొఫెసర్‌ వైఎస్‌ శరత్‌ మాట్లాడారు. ప్రొఫెసర్‌ వి.నిర్మల అనువాద రచన ఫైర్‌ ఫ్లైస్‌ పై విమర్శనాత్మక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వీసీ, సదస్సు డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పి.రాజశేఖర్‌ సదస్సులో పాల్గొన్న కీనోట్‌ స్పీకర్లను సన్మానించారు. ప్రొఫెసర్‌ పాల్‌ శరద్‌ తన ప్లీనరీ ప్రసంగంలో కీలకమైన అంతర దృష్టిలను వివరించారు. తాను రాసిన ఏ షార్ట్‌ హిస్టరీ ఆఫ్‌ ఆస్ట్రేలియన్‌ లిటరేచర్‌ అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు.



‘ఏ హిస్టరీ ఆఫ్‌ ఆస్ట్రేలియన్‌ లిటరేచర్‌’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

కృష్ణా జిల్లా కలెక్టర్‌ రాజాబాబు

పామర్రు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పామర్రులో పర్యటించనున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కృష్ణా కలెక్టర్‌ రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌, జిల్లా ఎస్పీ అద్నాన్‌ నయిమ్‌ అస్మితో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ముందస్తు భద్రత సమన్వయం నిర్వహించారు. తొలుత పామర్రు బందరురోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న గడ్డి వాములు, ఇంకా మిగిలిపోయిన గడ్డిని వెంటనే తొలగించి భూమిని చదును చేయాలన్నారు. అనంతరం వారు అక్కడి నుంచి బహిరంగ సభా స్థలికి చేరుకుని అక్కడ వేదిక ఏర్పాట్లును పరిశీలించారు. సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధాన రహదారి నుంచి సభా స్థలికి చేరుకునే మార్గాన్ని చదును చేసే పనులు ముమ్మరం చేయాలన్నారు. తర్వాత సీఎం పర్యటన ఏర్పాట్లపై స్థానిక బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌ కుమార్‌తో చర్చించారు. అక్కడకు చేరుకున్న జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్‌.. సీఎం పర్యటనపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ఏర్పాటు చేయాల్సిన స్టాల్స్‌ తదితర అంశాలపై మాట్లాడారు. కలెక్టర్‌ వెంట ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ ఆశీర్వాదం, ఆర్‌ అండ్‌ బీ ఇంజినీరు శ్రీనివాసరావు, పంచాయతీరాజ్‌ ఎస్‌ఈ విజయ్‌ కుమారి, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్‌, డీఎంహెచ్‌వో డాక్టర్‌ గీతబాయి, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసు రత్నం, తహసీల్దార్‌ శ్రీ పల్లవి, పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



సీఎం పర్యటనపై పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌తో చర్చిస్తున్న కలెక్టర్‌ రాజాబాబు

యార్డుకు 1,56,917 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్‌ యార్డుకు మంగళవారం 1,56,917 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్‌ విధానం ద్వారా 1,40,541 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్‌ ఏసీ కామన్‌ రకం 334, నంబర్‌–5, 273, 341, 4884, సూపర్‌–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,400 వరకు పలికింది.

వివాహితపై కత్తితో దాడి.. యువకుడి ఆత్మహత్య

- మహిళ పరిస్థితి విషమం
- వివాహేతర సంబంధమే కారణం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్‌): వివాహేతర సంబంధం నేపథ్యంలో నెలకున్న వివాదాల కారణంగా వివాహితపై యువకుడు కత్తితో దాడి చేసి.. ఆపై తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సత్యనారాయణపురం పీఎస్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివాహిత కొన ఊపిరితో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా యువకుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం వక్కలగడ్డ పవన్‌కుమార్‌, మాధురి.. వారి ఇద్దరి సంతానం గుడివాడలో నివసించేవారు. వారిద్దరూ ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో గుడివాడకు చెందిన నాని అనే యువకుడితో మాధురికి పరిచయమైంది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం ఆమె ఇంట్లో తెలియడంతో అతనికి దూరంగా ఉంది. అయినా యువకుడు ఆమె వెంట పడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండేవాడు. గత వారం ఆమె తాను పని చేస్తున్న స్కూల్‌ నుంచి విజయవాడ బ్రాంచ్‌కు బదిలీ చేయించుకున్నారు. ఇద్దరు పిల్లలతో పాటు శ్రీనగర్‌కాలనీలోని ఆమె తల్లి వద్ద ఉంటోంది. ఇది తెలుసుకున్న నాని తనను కాదంటున్న ఆమెను హత్య చెయ్యాలనే ఉద్దేశంతో మంగళవారం సాయంత్రం ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో పిల్లలు బయట ఆడుకుంటుండగా వివాహితతో వాగ్విదానికి దిగాడు. తన వెంటతెచ్చుకున్న కత్తితో ఆమె మెడమీద నరికాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అపస్మారకస్థితిలో పడిపోవడంతో మృతి చెందినట్లు భావించాడు. భయంతో నాని (36) కూడా ఇంట్లో ఉన్న నైలాన్‌ తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఎన్‌పురం సీఐ వెంకట నారాయణ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నాడు. కొన ఊపిరితో ఉన్న మహిళను పోలీస్‌ వ్యాన్‌లోనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు విచారణ చేస్తున్నారు

జ్యూయలరీ షాపులో చోరీకి విఫలయత్నం

విస్సన్నపేట: జ్యూయలరీ షాపు వెనుక వైపు తాళాలు కోసి, షటర్‌ను గ్యాస్‌ కట్టర్‌తో కట్‌ చేసి చోరీకి యత్నించిన ఘటన స్థానిక బస్టాండ్‌ సెంటర్‌ సమీపంలోని హరిప్రియ జ్యూయలరీ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్యాస్‌ సిలిండర్‌, కట్టర్‌ మిషన్‌తో చోరీకి పాల్పడి దుకాణంలో ఉన్న లాకర్‌ను కట్‌ చేస్తుండగా దుకాణానికి ఎదురుగా ఉన్న నివాసితులు చూసి ఘటనా స్థలానికి చేరుకోవడంతో చోరీకి పాల్పడిన వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏసీపీ మురళీమోహన్‌, సీఐ అబ్దుల్‌నబీ, ఎస్‌ఐ రామకృష్ణ దుకాణాన్ని పరిశీలించి షాపు యజమాని నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ మురళీమోహన్‌ అన్నారు. స్థానిక పీఎస్‌ వద్ద మంగళవారం వ్యాపారులకు సమావేశం నిర్వహించారు.

సెంట్రల్‌ జోన్‌ క్రికెట్‌ విజేత ‘సీఆర్‌ రెడ్డి’ జట్టు



మొదటి బహుమతి అందుకుంటున్న సీఆర్‌ రెడ్డి కళాశాల జట్టు



రన్నర్‌ నిలిచిన వీఆర్‌ సిద్ధార్థ జట్టు

కంచికచర్ల: మిక్‌ కాలేజ్‌ ఆఫ్‌ టెక్నాలజీలో జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్‌ జోన్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ ఫైనల్‌ పోటీలు మంగళవారం జరిగాయని టోర్నమెంట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. కళాశాల సీఈఓ డి.పాండురంగారావు టాస్‌ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఫైనల్‌ మ్యాచ్‌ వీఆర్‌ సిద్ధార్థ(కానూరు) సీఆర్‌ రెడ్డి(ఏలూరు) జట్టు తలపడ్డాయి. తొలుత కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ టి.వంశీకిరణ్‌ రెండు టీంల సభ్యులను పరిచయం చేసుకున్నారు. టాస్‌ గెలిచి వీఆర్‌ సిద్ధార్థ జట్టు ఫీల్డింగ్‌ ఎన్నుకుంది. బ్యాటింగ్‌ ప్రారంభించిన సీఆర్‌ రెడ్డి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 122 పరుగులు సాధించింది. బ్యాట్‌మన్‌ దుర్గాప్రసాద్‌ 34 బంతుల్లో 44 పరుగులు సాధించారు. ఆ తర్వాత బ్యాటింగ్‌ ప్రారంభించిన వీఆర్‌ సిద్ధార్థ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 10 వికెట్లు నష్టపోయి 100 పరుగులు మాత్రమే చేసింది. సీఆర్‌ రెడ్డి జట్టు విజయం సాధించి సెంట్రల్‌జోన్‌ క్రికెట్‌ కప్‌ను కైవసం చేసుకున్నారు. సిద్ధార్థ జట్టు రన్నర్‌గా నిలిచింది. జేఎన్‌టీయూ కాకినాడ ఐసీటీ సెక్రటరీ డాక్టర్‌ జీపీ రాజు ఇరు జట్లకు బహుమతులు అందజేశారు.

రైలులో బ్యాగు చోరీ కేసులో నిందితుడి అరెస్టు



రైలులో బ్యాగు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

రూ. 9 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

రైల్వేస్టేషన్‌(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికురాలి బ్యాగు చోరీ చేసిన కేసులో రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి రూ. 9 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతికి చెందిన మహిళ ఈ నెల 16న తిరుపతి నుంచి తణుకు వరకు శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌ రైలులో బయలుదేరింది. తన బ్యాగులను బెర్త్‌ కింద ఉంచి నిద్రించింది. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున 2 గంటల సమయంలో రైలు విజయవాడ స్టేషన్‌ చేరుకున్నప్పుడు అదే కోచ్‌లోని టాయిలెట్‌ వద్ద ఎవరిదో ఒక బ్యాగు ఉన్నట్లు తోటి ప్రయాణికుడు అందరికీ చెబుతున్నాడు. మహిళ తన లగేజీని చూసుకోగా ఆమె బ్యాగు కనిపించలేదు. వెంటనే టాయిలెట్‌ వద్ద తన ఉన్న బ్యాగును గుర్తించి లోపల చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. అందులో 367 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు ఆమె గుర్తించింది. దీనిపై డ్యూటీలోని టీటీఈకి ఫిర్యాదు చేసి ప్రయాణం కొనసాగించింది. తణుకులో రైలు దిగిన తర్వాత అక్కడ జీఆర్‌పీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు జీరో ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసి విజయవాడ జీఆర్‌పీకి పంపించారు. దీనిపై విజయవాడ జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాస్‌, ఆర్‌పీఎఫ్‌ సీఐ టి.చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలసి రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి పాల్పడింది తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెంకు చెందిన తంబాల నితిన్‌ అనే యువకుడిగా గుర్తించి గాలించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నిందితుడు నగరంలోని జైహింద్‌ కాంప్లెక్స్‌ వద్ద సంచరిస్తుండగా పోలీసులు అరెస్టు చేసి అతనినుంచి రూ. 9 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

శ్మశానవాటికపై 'గద్దె' దొంగాట

- ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయించిన వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి చేసి అందుబాటులోకి...


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన రామలింగేశ్వర్‌నగర్ శ్మశానవాటిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): దళితులంటే 'తూర్పు' ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు చిన్నచూపు అని, నియోజకవర్గంలోని 14 పేటలకు చెందిన శ్మశానవాటిక విషయంలో ఆయన ఐదేళ్లు మోస గించిన తీరే ఇందుకు నిదర్శనం అని నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి సభల్లో ప్రజలు ప్రశ్నిస్తే నెలరోజుల్లో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తానని చెప్పిన గద్దె, అనంతరం తన కార్యాలయానికి వెళితే మీరు చెప్పి నట్లు చేయాలా అంటూ అవహేళన చేస్తూ మాట్లా డారని నాటి ఘటనలను దళితులు గుర్తు చేసుకుం టున్నారు. గత ఐదేళ్లు దళిత కాలనీల్లో ఒక్క పని కూడా చేయలేదంటున్నారు.

పద్నాలుగు పేటల సమస్యనూ పట్టించుకోలేదు

తూర్పు నియోజకవర్గంలోని ఉడ్‌పేట, నెహ్రూన గర్, బాడవపేట, వరలక్ష్మీనగర్, ఇస్రాయేల్‌పేట, ఫిటింగెల్‌పేట, జార్జిపేట, గ్రీన్‌ల్యాండ్స్, ఫకీరుగూ డెం, రాణీగారితోట, సెంట్రల్ పరిధిలోని న్యూగిరి పురం, గిరిపురం, కస్తూరిబాయిపేటలకు సంబం ధించి అమ్మ కల్యాణ మండపం వద్ద శ్మశానవాటిక ఉండేది. అది సమాధులతో నిండిపోవడంతో ప్రత్యామ్నాయంగా రామలింగేశ్వర్‌నగర్ కృష్ణానది ఒడ్డున అందుబాటులో ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేయాలని ఆ కాలనీల ప్రజలు కోరారు. దానికోసం దళిత క్రైస్తవ శ్మశాన వాటిక సాధన కమిటీని ఏర్పాటు చేశారు. దీని ద్వారా పలుమార్లు ఆందోళ నలు చేశారు.

దళితులను అరెస్ట్ చేయించిన గద్దె

దళిత క్రైస్తవ శ్మశాన వాటిక సాధన సమితి ఆధ్వ ర్యంలో నాడు నిరసన తెలుపుతున్న పలువురు దళిత నాయకులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అరెస్ట్ చేయించారు. వారిలో ఆ కమిటీ అధ్యక్షుడు కుక్కల యేసుతో పాటు, మహిళా కార్పొరేటర్ పాల ఝాన్సీలక్ష్మి, ఆమె భర్త పాలా బాబూరావు, ఇతర నేతలు ఉన్నారు. పాల ఝాన్సీలక్ష్మిని అర్ధ రాత్రి వరకూ స్టేషన్‌లో ఉంచి వదిలేసిన పోలీసులు, మిగిలిన ఇద్దరినీ తెల్లవార్లు స్టేషన్‌లోనే ఉంచి మరు సటి రోజు వదిలారు. వివాదం ఉన్న స్థలం కాకుం డా ప్రత్యామ్నాయ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరినా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పట్టించుకోలేదు.

అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత క్రైస్తవుల శ్మశాన వాటిక అభి వృద్ధిపై దృష్టి పెట్టారు. ఆ స్థలంలో బోరు వేయించ డంతో పాటు, రోడ్లు వేశారు. చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారు. సుమారు రూ.కోటితో అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఆ 14 కాల నీల్లో దళితుల శ్మశాన వాటిక సమస్య పరిష్కా రమైంది.

చిచ్చుపెట్టే కుట్ర చేశాడు



శ్మశాన వాటిక సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మమ్మల్ని తన కార్యా లయానికి పిలిపించారు. మరుసటి రోజే మాలో కొంతమందిని పిలిచి కమిటీని చీల్చే ప్రయత్నం చేశారు. కానీ ఆయన కుట్రలు చెల్ల లేదు. మా ముందు ఒకటి చెప్పి, తర్వాత మరొ కటి చేసేవారు. అలా ఐదేళ్లు శ్మశానవాటిక స్థలాన్ని అభివృద్ధి చేయకుండా దగా చేశారు.

–తోకల శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షుడు, దళిత క్రైస్తవ శ్మశాన సాధన కమిటీ

దళితులను మోసం చేసిన గద్దె



దళితుల సమస్యలంటే గద్దె రామ్మోహన్‌కు చిత్త శుద్ధి లేదు. శ్మశాన వాటిక సమస్యను సామ రస్యంగా పరిష్కరించ కుండా, రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారు. దళిత కాలనీల్లో అభివృ ద్ధిని విస్మరించారు. ఆయన ప్రజల మధ్యకు వచ్చినప్పుడు ఒకలా, తర్వాత మరోలా ప్రవ ర్తిస్తూ నయవంచన చేయడం ఆయన నైజం.

–చింతగుంట విజయ్, ఫకీరుగూడెం

నిరుపేదలకు బండ్లు పంపిణీ


నిరుపేదలకు బండ్లు అందజేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సహాయంతో నిరుపేదలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని మలేరియా ఆసుపత్రి వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన 5 నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన ఉచితం గా బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రూ.1.10 లక్షల విలువ చేసే ఒక ఇస్త్రీ బండి, ఒక టిఫిన్ బండి, మూడు తోపుడు బండ్లను ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు అం దజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మీర్‌హుస్సేన్, జోగారాజు, గొర్ల గోవింద్ తది తరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ లయోలా గార్డెన్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలి పివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివి జన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు మం గళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటే శ్వర నగర్ 1,2,3 అంతర్గత రహదారులు, సెం ట్రల్ ఎక్సైజ్ కాలనీ, స్పెన్సర్ సైడ్ రోడ్డు, సెం టినీ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమ నించి తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఎయిడ్స్‌పై కళాజాత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివా రణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళ వారం ఎయిడ్స్‌పై అవగాహనకు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సహకారంతో ఆటోనగ ర్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శన ద్వారా హెచ్.ఐ.వి.(ఎయిడ్స్), ఎ.ఆర్.టి మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్, ఏపీ శాక్స్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వీవీ సాంబశివరావు, ఏఎన్ఎం శాం తకుమారి, సిబ్బంది ఎ.వరప్రసాద్, ఎం.శేషు కుమార్, వై.రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో గణిత శాస్త్రంపై జాతీయ సదస్సు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేసే దిశగా మార్చి నెల 4, 5 తేదీలలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్ర లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జీఏపీ కిషోర్ తెలి పారు. మంగళవారం తన కార్యాలయంలో గణిత శాస్త్ర జాతీయ స్థాయి సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 4,5 తేదీలలో జరిగే ఈ కార్యక్రమానికి దేశంలో పేరెన్నికగన్న విద్యా సంస్థల నుంచి గణితశాస్త్ర అధ్యాపకులు వస్తారన్నారు. గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులు, అవకాశాలు వంటి విషయాలను వారు వివరిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకుని గణితంలో మెలకువలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్, గణిత శాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాలరావు, కన్వీనర్లు అను రాధ, తబిత పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వీల్‌చైర్, స్ట్రెచ్చర్ అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్ప త్రికి వచ్చే నడవలేని రోగులకు ఉపయోగప డేలా కాకాని ఆశయ సమితి ఆధ్వర్యంలో మం గళవారం వీల్‌చైర్, స్ట్రెచ్చర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సమితి వ్యవస్థాపక అధ్య క్షుడు కాకాని తరుణ్, ఎన్టీఆర్ జిల్లా వినియోగ దారుల సంఘం ఫిబ్రవరి 27న ప్రపంచ ఎన్జీవో (ప్రభుత్వేతర సంస్థలు) దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి కాకాని వెంకటర త్నం, ఆయన తనయుడు దివంగత కాకాని రామమోహన్‌రావు స్మారకార్థం డాక్టర్ తరుణ్ కాకాని స్థాపించిన కాకాని ఆశయ సాధన సమితి స్వచ్ఛంద సంస్థతో పాటు ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, న్యాయమూర్తి చిరంజీవి పాల్గొని ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ నమ్రతకు వాటిని అందజే శారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి గోగినేని ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ వాస్ మృతి చిత్రకళా రంగానికి తీరని లోటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ చిత్రకారుడు ఆంధ్రా అకాడమీ ఆర్ట్స్ ఉపాధ్య క్షుడు కేఎస్ వాస్ (77)మృతి చిత్రకళారంగా నికి తీరని లోటు అని ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ కార్యదర్శి ఎంవీ సాయిబాబు అన్నారు. స్థానిక ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి లలిత కళా ఆర్ట్స్ గ్యాలరీలో మంగళవారం ఆం ధ్రా అకాడమీ ఆర్ట్స్ ఆధ్వర్యాన చిత్రకారుడు కేఎస్ వాస్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్ వాస్ చిత్రకళ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిం చారని కొనియాడారు. నగరంలో వందలాది మంది విద్యార్థులకు చిత్రకళలో మెలకువలు నేర్పించి చిత్రకారులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్రకారులు మల్లిక్, దుర్గాప్రసాదరావు, రమేష్, సునీల్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొని వాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నవరత్న పథకాలతో నవశకానికి నాంది

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో నవశ కానికి నాంది పలికారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని స్వర్గపురి ఏరియా, మలేరియా ఆసుపత్రి ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివ రించి 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే చేప ట్టబోయే కార్యక్రమాలను మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన మేనిఫెస్టో కరపత్రాలను పం పిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లా డుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కుల, మత, రాజకీయ పార్టీల కతీతం గా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక లబ్ధి చేకూరు తుందన్నారు. ఈ డివిజన్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని అందుకే దమ్ముగా ధైర్యంగా ప్రజల ముందుకు వచ్చి చేసిన మంచిని సగర్వంగా వివరిస్తున్నామ న్నారు. రాజకీయాలలో సీనియర్ అని చెప్పుకొం టున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ఆయన సతీ మణి గద్దె అనురాధ అబద్ధపు ప్రచారాలతో కాలం గడుపుతున్నారని, చిన్న చిన్న ఘటనలను భూత ద్దంలో పెట్టి చూపిస్తున్నారన్నారు. తాము తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురిం చి మాత్రమే ప్రచారం చేస్తున్నామని చెప్పారు. భ్రమరాంబపురం ప్రజల ఇళ్ల పట్టాల సమస్య ముఖ్యమంత్రికి విన్నవించగా వెంటనే సానుకూలం గా స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, వీలైనంత త్వరగా ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదల వుతుందన్నారు. దోభీఘాట్‌ను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో, తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచే శారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్టాండింగ్ కమిటీ మెంబర్, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు జోగారాజు, నాగిరెడ్డి, పులి రమణారెడ్డి, గొర్ల గోవింద్, ఆసిఫ్, ఫజులుద్దీన్, జావీద్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్ జగన్ లక్ష్యం


కరపత్రాలను అందచేస్తున్న దేవినేని సుధీర

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం మం గళవారం ఏడో డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెం టర్, దాసరి లింగయ్య వీధిలో జరిగింది. దేవినేని సుధీర ఇంటింటికి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సం క్షేమ కార్యక్రమాల గురించి కరపత్రాలను అందజేసి వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గురించి తెలి యజేశారు. కార్యక్రమంలో ఏడో డివిజన్ కార్పొరే టర్ ఎం.మాధురితో పాటు వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం

గుణదల (విజయవాడ తూర్పు): ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రం లో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. తూర్పు నియో జకవర్గం పరిధిలోని పలు డివిజన్‌లలో మంగళ వారం ఆమె గడప గడపకు మన అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. 5వ డివిజన్ పరి ధిలోని క్రీస్తురాజపురం ప్రాంతంలో సిద్ధార్థ, 13వ డివిజన్‌లో దేవినేని అవినాష్ సోదరి క్రాంతి, 7వ డివిజన్ లో దేవినేని సుధీర పర్యటించారు. కరప త్రాలను అందజేస్తూ ఆయా ప్రాంతాలలో స్థానికు లను కలుసుకున్నారు. కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, 7వ డివిజన్ కార్పొరేటర్ మెరకన పల్లి మాధురి, 13వ డివిజన్ ఇన్‌చార్జి రామాయణపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుచికి రుచి...ఆరోగ్యానికి ఆరోగ్యం

- చిరుధాన్యాలతో కేక్‌ల తయారీ
- కోవే చాప్టర్ ద్వారా మహిళలకు ఉచితంగా శిక్షణ
- ఇంటి వద్దే తయారు చేస్తున్న మహిళలు
- ఆర్థికంగా కుటుంబాలకు ఆసరాగా ఉంటున్న వైనం


చిరుధాన్యాలతో తయారు చేసిన కేక్ ఇది


మరో రకం కేక్


కోవే చాప్టర్ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ చుట్టు పక్కల ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు చిరుధా న్యాల ద్వారా కేక్‌లను తయారు చేస్తున్నారు. గత కొంత కాలం నుంచి విజయ వాడకు చెందిన కోవే ఏపీ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక ఆధ్వర్యంలో కేక్‌ల తయారీపై పలు చోట్ల ఉచితంగా శిక్షణ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. వారం క్రితం విజయవా డలోని భారతీనగర్ కాలనీలో సుమారు 200 మంది మహిళలకు కేక్‌ల తయారీపై నిపుణులతో మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఇక్కడ నేర్చుకున్న మహిళలు తమ ఇళ్ల వద్ద కేక్‌లను తయారుచేసి విక్ర యిస్తూ, కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

మైదా లేకుండా కేక్‌ల తయారీ

చిరుధాన్యాలతో మహిళలు పలు రకాల కేక్‌లను తయారు చేస్తున్నారు. రాగి కేక్, చాక్లెట్, బనానా, ఓట్స్, బ్రౌనింగ్ చాక్లెట్ కేక్స్, పైనాపిల్‌తో పాటు పలు రకాలైన రుచికరమైన కేక్‌లను తయారు చేస్తు న్నారు. వీటి ద్వారా ఆరోగ్యం అధికంగా ఉంటుం ది. అంతే కాకుండా మైదా లేకుండా తయారు చేస్తు న్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మహిళలు కేక్‌ల తయారీని స్వయం ఉపాధిగా మార్చుకుంటు న్నారు. నెలకు వేలాది రూపాయలు సంపాదిస్తు న్నారు. ఈ రంగంలో ఇప్పటి వరకు సుమారు 1500 మందికి కేక్‌ల తయారీపై శిక్షణ ఇచ్చినట్టు కోవే చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక తెలిపారు. తమ వద్ద నేర్చుకున్న వారిలో సుమారు 10 శాతానికి పైగా మహిళలు సొంతంగా ఇళ్ల వద్ద తయారు చేసి విక్రయిస్తూ ఆర్థికంగా వారి కుటుం బాలకు ఆసరాగా ఉంటున్నారని చెప్పారు. మిగతా 90 శాతం మంది మహిళలు డిజిటల్ మార్కెటింగ్ ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. వ్యాపారం పెంచుకునేందుకుగాను ఆర్థికంగా బ్యాంకు రుణాలు (ముద్ర రుణాలు) ఇప్పిస్తున్నాం. చాలా మంది చిన్న చిన్న ఫంక్షన్‌లకు కేక్‌లను తయారు చేసి ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాపారం ఆశాజనకంగా ఉంది.

ఇంటి వద్దనే తయారు చేస్తున్నా



నేను ఒక ప్రయివేట్ కాలేజీలో ప్రొఫెసర్‌గా కొంత కాలం పనిచేశా. అక్కడ బాగా ఒత్తిడిగా ఉండడంతో అనారోగ్యానికి గురై ఆ ఉద్యోగానికి రాజీనామా చేశా. ఇటీవల కేక్‌ల తయారీలో శిక్షణ పొంది ఇంటి వద్దే కేక్‌లు తయారు చేస్తున్నా. చిన్న చిన్న ఫంక్షన్‌లకు ఆర్డర్‌లు వస్తున్నాయి. ఎలాంటి టెన్షన్ లేకుండా డబ్బులు సంపాదిస్తున్నా.

– పి.పుష్పలత గవర్నర్‌పేట

కోవే వారి శిక్షణ నాకు ఎంతో మేలు చేసింది



నేను గత కొంత కాలంగా కేక్‌లను తయారు చేస్తున్నా. చిరుధాన్యాలతో పలు రకాల కేక్‌లను తయారు చేస్తున్నా. కేక్‌ల తయారీతో పాటు టైల రింగ్ పని కూడా చేస్తున్నా. రెండింటి మీద ఆదాయం బాగానే వస్తుంది. కేక్‌ల తయారీపై తీసుకున్న శిక్షణ నాకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.

– ఎస్.పూజిత, నున్న

సమాజంలో నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ బాబ్జీ, అతిథులు

గన్నవరంరూరల్: సమాజంలో నర్సింగ్ వృత్తి పవిత్ర మైనదని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి తెలిపారు. చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ల్యాంప్ లైటింగ్ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రోగిని 24 గంటలు కంటికి రెప్పలా కాపాడేది నర్సులన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు మార్గదర్శనం కావాల న్నారు. మానవత్వంతో నర్సులు రోగులకు సేవలం దించాలని చెప్పారు. 21వ బ్యాచ్ జీఎన్ఎం, 16వ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచంలో నర్సుల కొరత

ప్రిన్సిపాల్ జె.వందన అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో కన్వీనర్ వి.శశికళ మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటికీ నర్సుల కొరత ఉందన్నారు. నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని, విలువలతో కూడిన విద్యను తమ కళాశాల, స్కూల్ అందిస్తున్నాయని చెప్పారు. ఇదే ఆవరణలో మెడికల్ కళాశాల, ఆస్పత్రి వంటి శిక్షణకు ఉపయోగపడే వనరులు ఉన్నాయని, వీటిని ఉపయో గించుకుని భవిష్యత్‌లో అందరూ మెచ్చే విధంగా ఎద గాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడి కల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, ఏపీఎ స్ఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల, సి.కళ్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ల్యాంప్ లైటింగ్ కార్యక్రమంలో స్కూల్, కళాశాల బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యా ర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి.

ఏజీ కార్యాలయంతో ఎస్ఆర్ఆర్ అవగాహన ఒప్పందం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏజీ కార్యా లయానికి చెందిన తెలుగేతర ఉద్యోగులకు తెలుగు భాషను నేర్పించడం కోసం మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖతో ఏజీ కార్యా లయం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం గత నాలుగు సంవత్సరాల నుంచీ కొనసాగుతోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీతో గత ఒప్పందం గడువు ముగిసిన కారణంగా తిరిగి కొత్తగా ఒప్పం దాన్ని కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఏజీ కార్యాలయ ఉద్యోగులకు కళాశాల తెలుగు శాఖ 'తెలుగు పరిచయం కోర్సు' పేరుతో రోజుకు రెండు గంటల చొప్పున 48 పని దినా లలో నేర్పిస్తుందని, ఉత్తీర్ణత సాధించిన ఉద్యోగులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తుందని తెలిపారు.

ఇంటర్నేషనల్ కల్చరల్ ఫెస్ట్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ



సురభి కల్చరల్ ఫెస్ట్‌లో బహుమతులు అందుకున్న నలంద విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల కేఎల్ విశ్వ విద్యాలయంలో జరిగిన సురభి ఇంటర్నేషనల్ కల్చ రల్ ఫెస్ట్ -2024లో గాయత్రినగర్‌లోని నలంద విద్యా నికేతన్ విద్యార్థులు సత్తా చాటారని ఆ స్కూల్ ప్రిన్సి పాల్ మాదల పద్మజ తెలిపారు. ఆ పోటీల్లో వెస్ట్రన్ గ్రూప్ మ్యూజిక్, బాటిల్ ఆఫ్ బాండ్ జూనియర్ విభాగాల్లో జి.సాహితి, వై.గంగ మేఘనారెడ్డి, పి.విహాన్, పి.రేహాన్‌నాగ్, పి.సుస్వరనందిని, వి.లాస్య, శ్రీశిఖ, బి.పార్థసాయిరెడ్డి, సీహెచ్ హాస్యశ్రీప్రియ ప్రథమ స్థానంలో నిలిచి నగదు బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. సోలో పెర్క షన్ (సంగీత వాయిద్యం) పోటీల్లో పి.రేహాన్‌నాగ్ ప్రథమ బహుమతి పొందగా, సింగింగ్ జోడి సీనియర్ విభాగంలో రూపేష్ కేశవ్ ఆనంద్, జి సూర్య సిద్ధార్థ తృతీయ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ విజేతలను అభినందించారు. పోటీల్లో గెలు పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సౌమ్యరూప్ ముఖర్జీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విద్యావేత్త నిడుమోలు రమాసత్యనార యణ అన్నారు. ఎస్ఎస్‌కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయం లో మంగళవారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లా డుతూ కళాకారులకు జాతీయ స్థాయి గుర్తింపు ఉం టుందన్నారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజ యలక్ష్మి మాట్లాడుతూ గాయనీ గాయకులు నిరం తరం సాధన చేయాలని సూచించారు. సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు గాయనీ గాయకుల కృషిని అభినందించారు. సంస్థ అధ్యక్షుడు పైడిపాటి వెంకన్న కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంతర్జాతీయ ఫ్యాషన్ షో విజేత సుహాన



పాయకాపురం(విజయవాడరూరల్): రవీంద్రభారతి హైస్కూల్ (వాంబేకాలనీ) అజిత్ సింగ్‌నగర్ రవీం ద్రభారతి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న షేక్ సుహాన వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షోలో మిస్ టీన్‌గా గెలుపొందినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మి మంగ ళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హైదరాబా దులో ఈ నెల 24వ తేదీన వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ షో జరిగింది. ఈ షోలో టీన్ విభాగంలో జరిగిన పోటీలో మొత్తం 61 మంది పాల్గొనగా షేక్ సుహాన మిస్ టీన్‌గా ఎంపికైనట్టు తెలిపారు.ఈ సంద ర్భంగా మంగళవారం హైస్కూల్‌లో జరిగిన అభినం దన కార్యక్రమంలో సుహాన మాట్లాడుతూ ఈ గెలు పునకు కారణం తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు హైస్కూల్ యాజమాన్యం అని తెలియజేశారు. ఈ సందర్భంగా యాజమాన్యం,హెచ్ఓడీలు, జీఎం, జోనల్ ఇన్‌చార్జి సుహానను అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడపలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళ వారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ 2లో బుర్రిరామ్‌గోపాల్ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతను ఏసీ మెకానిక్‌గా పని చేస్తుండగా అతని సోదరుడు శివదుర్గాప్రసాద్ అతని వద్దే పని చేస్తున్నాడు. కాగా శివదుర్గాప్రసాద్ ఈ నెల 23న గుంటూరులో పెళ్లికి వెళ్లి వస్తానని వెళ్లాడు. ఆ తరువాత అతను తిరిగి ఇం టికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు శివదుర్గాప్రసాద్ కోసం వెతికారు. అయితే అతని జాడ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ దాసాంజనేయస్వామివారి దేవా లయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం ఆకుపూజలు శాస్త్రోక్తం గా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్య క్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

ఫిర్యాదు చేస్తే అంతు చూస్తాం

'మార్గదర్శి' బాధితులకు రామోజీ ముఠా బెదిరింపులు

'మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పైనే ఫిర్యాదు చేస్తారా ... మీ సంగతి తేలుస్తాం'

'మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితులు.. అని సంఘం పెట్టేంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది'

'మీ ష్యూరిటీ పత్రాలు మా దగ్గర ఉన్నాయి.. మీ ఆస్తులు వేలం వేయిస్తాం..'



గురివింద రామోజీ-7

ఇవీ రాజగురివింద రామోజీరావు ఆర్థిక అక్రమాల పుట్ట.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి చందాదారులకు కొన్ని నెలలుగా వస్తున్న బెదిరింపులు. నేరుగా చందాదారుల ఇళ్లకే వచ్చి బెదిరిస్తుండటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. మరికొందరికి రామోజీ ముఠా ఫోన్లు చేసి వేధిస్తోంది. కొందరిని తమ చిట్‌ఫండ్ కార్యాలయాలకు పిలిపించుకుని మరీ బెదిరిస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల పుట్ట బద్దలు కావడంతో రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. దశాబ్దాల తరబడి ఆయన, ఆయన కోడలు శైలజ వేధింపులు భరించిన చందాదారులు ప్రస్తుతం ధైర్యం చేసి ఫిర్యాదులు చేస్తుండటంతో రామోజీ ముఠా బెదిరింపుల పర్వానికి బరితెగించింది. దీంతో చందాదారుల భద్రతే లక్ష్యంగా ఫిర్యాదులు చేసేందుకు సీఐడీ ప్రత్యేక వాట్సాప్ నంబరును అందుబాటులోకి తెచ్చింది. తాజాగా కొందరు చందాదారులు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘాన్ని' ఏర్పాటు చేసి రిజిస్టర్ చేయించడంతో ఈ వ్యవహారం కీలక మలుపు తిరిగింది.

ధైర్యంగా బాధితుల ముందడుగు..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసును విచారిస్తున్న సీఐడీ.. బాధితులు ఫిర్యాదు చేసేందుకు 94931 74065తో వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వాట్సాప్ నంబరుకు ఇప్పటికే వేల సంఖ్యలో చందాదారులు ఫిర్యాదులు చేశారు. తమ అనుమతి లేకుండా చిట్టీలు పాడటం, చిట్ పాడుకున్న నగదు ఇవ్వకుండా రశీదు డిపాజిట్లుగా జమ చేయడం, ష్యూరిటీలు ఇచ్చినా తిరస్కరించి వేధించడం, తమ సంతకాలు ఫోర్జరీ చేయడం వంటి అక్రమాలపై బాధితులు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నారు. వీటిని సీఐడీ ప్రత్యేక విభాగం నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

వేధింపులకు పాల్పడ్డ పలువురు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ మేనేజర్లు, ఇతర సిబ్బందిని సీఐడీ విచారిస్తుండటంతో రామోజీ బెంబేలెత్తుతున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ కార్యాచరణతో చందాదారులు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. విజయవాడ కేంద్రంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. బాధితులు తమ సమస్యలను చెప్పుకునేందుకు ప్రత్యేకంగా 99481 14455 ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో కేవలం మూడు రోజుల్లోనే వందల సంఖ్యలో బాధితులు ఈ సంఘాన్ని సంప్రదించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అందరి ఫిర్యాదులను నమోదు చేస్తూ అటు సీఐడీ ద్వారా, ఇటు న్యాయపరంగా చర్యలు తీసుకునేందుకు ఆ సంఘం సన్నద్ధమవుతోంది.

బాధితులపై మార్గదర్శి వేధింపుల పర్వం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల పుట్ట బద్దలు కావడంతో రామోజీరావు హడలిపోతున్నారు. సీఐడీ అధికారులు కేసు నమోదు చేయడం, ఏకంగా తన ఇంటికే వచ్చి మరీ విచారించడంతో ఆయన బెంబేలెత్తుతున్నారు. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు బాధితులు కూడా దూకుడు పెంచడంతో ఏక్షణం ఏం జరుగుతుందోనని రామోజీ బేజారెత్తుతున్నారు. దీంతో కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు తన ముఠాలను ఆయన రంగంలోకి దించారు. సీఐడీ అధికారులు, బాధితుల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నవారిని లక్ష్యంగా చేసుకుని వారికి ఫోన్లు చేసి రామోజీ ముఠా వేధిస్తోంది. సీఐడీకి ఫిర్యాదు చేసిన చందాదారులను మొదట లక్ష్యంగా చేసుకుంది. సీఐడీ దర్యాప్తునకు సహకరించవద్దని వారిని బెదిరిస్తోంది. ఏకంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజ కిరణ్ ఆఫీసు నుంచే చందాదారులకు ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతుండటం గమనార్హం. రామోజీ కోడలు శైలజ కిరణ్ పీఏ శశికళ, మార్గదర్శి బ్రాంచ్ మేనేజర్లు స్వయంగా ఫోన్లు చేసి మరీ బెదిరిస్తుండటం ఆ సంస్థ దిగజారుడుతనానికి నిదర్శనం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం అందుబాటులోకి తెచ్చిన ఫోన్ నంబరుకు కూడా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. 'అసలు సంఘాన్ని ఎందుకు ఏర్పాటు చేశారు.. మీ వెనుక ఎవరు ఉన్నారు.. ఎవరున్నాసరే మిమ్మల్ని కాపాడలేరు.. మీ సంగతి చూస్తాం.. అంతు తేలుస్తాం' అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

– సాక్షి, అమరావతి

న్యాయపోరాటానికి బాధితులు సిద్ధం..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది కాల్‌మనీ రాకెట్ గూండాల మాదిరిగా చందాదారుల ఇళ్లపై పడుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లి మరీ బెదిరిస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు వ్యక్తులకే తెలియకుండా తాము ఘోస్ట్ చందాదారులుగా నమోదు చేసిన వారి ఇళ్లకు వెళ్లి దౌర్జన్యం చేస్తున్నారు. అసలు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తాము చందాదారులుగా చేరిన విషయమే తమకు తెలియదనివారు ఎంతగా చెబుతున్నా వినిపించుకోవడం లేదు. 'సీఐడీ అధికారులు అడిగితే మీరే చందాదారులుగా చేరారని చెప్పండి.. మీకు ఇబ్బందిరాకుండా చూస్తాం.. అంతేగానీ తెలియదని చెబితే మాత్రం మీరు మాకు భారీగా బకాయిలు ఉన్నారని కోర్టులో కేసులు వేస్తాం' అని హడలెత్తిస్తున్నారు. దాంతో తమకు తెలియకుండానే తమ పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ సాగిస్తున్న ఆర్థిక అవకతవకలపై వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇక చందాదారుల కోసం ష్యూరిటీ సంతకాలు చేసిన వారి ఇళ్లకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది వెళ్లి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. 'మీరు ఇచ్చిన ఖాళీ చెక్కులు మా వద్ద ఉన్నాయి.. వాటిపై భారీ మొత్తం రాసి బ్యాంకులో జమ చేసి బౌన్స్ అయ్యేలా చేస్తాం. తరువాత కేసు పెట్టి అరెస్ట్ చేయిస్తాం' అని కొందరిని బెదిరించడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొందరు చందాదారుల ఇళ్లకు వెళ్లి 'మీరు భారీగా బకాయి పడ్డారు...అందుకు ప్రతిగా మీ ఇళ్లు, ఆస్తులు వేలం వేయిస్తాం' అని వేధింపులకు దిగారు. చందాదారుల తరఫున మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బందే ఫోర్జరీ సంతకాలు చేసేసి.. తిరిగి చందాదారులపైనే ఫోర్జరీ కేసు పెడతామని బెదిరిస్తున్నారు. ఈ పరిణామాలతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం ద్వారా అటు సీఐడీని ఆశ్రయించడంతోపాటు మరోవైపు న్యాయపోరాటం చేసేందుకు ఉద్యుక్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో కీలక పరిణామాలు సంభవించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆగ్రహా'సేన'

పవన్ నిర్ణయంపై సొంత పార్టీ నేతల తిరుగుబాటు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర

సాక్షి, అమరావతి/కడియం/గోకవరం/అమలాపురం/అంబాజీపేట: పొత్తులో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు విదిల్చిన 24 సీట్లను తీసుకునేందుకు అంగీకరించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ఆ పార్టీ శ్రేణులు మండిపడుతున్నారు. రోడ్లపైకి వచ్చి నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు. దీంతో ఈనెల 24న సీట్ల ప్రకటన తర్వాత హైదరాబాద్ వెళ్లిన ఆయన అక్కడే ఉండిపోయారు. శ్రేణులకు ముఖం చాటేశారు. దీంతో జనసేన పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం చల్లారడం లేదు. నాలుగు రోజులుగా నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. సోషల్ మీడియాలోనూ పవన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పలుచోట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ నిర్వహించిన టీడీపీ–జనసేన సమన్వయ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. అంబాజీపేటలో జరిగిన ఈ సమావేశాన్ని జనసేన కార్యకర్తలు ముట్టడించి వీరంగం సృష్టించారు. కుర్చీలను, బల్లలను గాల్లోకి ఎగరేశారు. టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్ కారు అద్దాలు ధ్వంసం చేశారు. గతంలో సోషల్ మీడియా వేదికగా జనసేన నాయకులు, కార్యకర్తలను బూతులు తిట్టిన రాజేష్‌కు మద్దతు తెలిపేది లేదని తేల్చిచెప్పారు. ఈ విషయమై గంటి హరీష్‌ను రెండు రోజుల క్రితం పి.గన్నవరంలో జనసేన నాయకులు నిర్బంధించారు. రాజేష్ అభ్యర్థిత్వాన్ని టీడీపీ శ్రేణులూ అంగీకరించడం లేదు. దీంతో అధిష్టానం సూచనతో రాజేష్ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాల జోనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు ఆధ్వర్యంలో అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మంటపంలో జరిగిన సమావేశపు హాలులోకి జనసైనికులు దూసుకువచ్చి 'రాజేష్ గో బ్యాక్' అని నినాదాలు చేశారు. టీడీపీ నాయకులతో వాగ్వావాదానికి దిగడంతో గలాభా సృష్టించారు. పోలీసుల రంగప్రవేశంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం రంగారావు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల నుంచి సేకరించిన అభిప్రాయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళతానన్నారు. చివరకు హరీష్ మాట్లాడుతూ 'నా కారు అద్దాలు పగల కొట్టారా? ఆ విషయం నా దృష్టికి రాలేదే' అని చెప్పడం కొసమెరుపు.

- కాకినాడ జిల్లా జగ్గంపేట సీటును టీడీపీకి కేటాయించడాన్ని నిరసిస్తూ అక్కడి జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజులుగా ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. అయినా పొత్తు ధర్మంగా కనీసం టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ జనసేన నాయకుల వద్దకు రాకపోవడాన్ని జనసైనికులు తప్పుబడుతున్నారు. నెహ్రూకు ఎట్టిపరిస్థితుల్లోనూ సహకరించేది లేదని సూర్యచంద్ర స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ, ఆయన తనయుడు నవీన్ తీరును తప్పుబట్టారు. తమను పాలేరుల్లా చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.
- తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ సీటును టీడీపీకి కేటాయించనున్నారన్న ప్రచారం నేపథ్యంలో మంగళవారం జనసేన నాయకులు కడియం నుంచి రాజమండ్రి బస్టాండ్ వరకు పాదయాత్ర నిర్వహించారు. సీటును జనసేన నేత కందుల దుర్గేష్‌కే కేటాయించాలని డిమాండ్ చేశారు.
- అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సీటును టీడీపీకి కేటాయించడాన్ని నిరసిస్తూ స్థానిక జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు మంగళవారం జరిగిన టీడీపీ–జనసేన ఉమ్మడి సమావేశానికి దూరంగా ఉన్నారు.

పశ్చిమాన ప్రకంపనలు

టీడీపీ, జనసేన పార్టీల్లో నిరసన సెగలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: టీడీపీ, జనసేన టికెట్ల ప్రకటన పశ్చిమగోదావరి జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. ఇరుపార్టీల్లోనూ నిరసన సెగలు ఎగసిపడుతున్నాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ సూచనతో భీమవరం నుంచి జనసేన అభ్యర్థిగా తాను పోటీ చేసే అవకాశం ఉందని భీమవరం టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే టికెట్ కేటాయించలేదని తణుకు జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు నాదెండ్ల మనోహర్ ఎదుటే తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఉండిలోనూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు అసమ్మతి బావుటా ఎగురేశారు. ఈ నేపథ్యంలో బుధవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రత్తిపాడులో నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన సంయుక్త బహిరంగ సభను రెండుపార్టీల శ్రేణులు లైట్ తీసుకున్నాయనే వాదన వినిపిస్తోంది.

భీమవరం జనసేన అభ్యర్థిని నేనే: పులపర్తి

టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సోమవారం హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్‌తో భేటీ అయ్యారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల్లో జనసేనలో చేరుతున్నానని ప్రకటించారు. ఒకవేళ పవన్‌కళ్యాణ్ భీమవరంలో పోటీ చేయకపోతే తనను పోటీ చేయాలని ఆయన కోరారని, దానికి అంగీకారం తెలిపానని వివరించారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే... తాను మద్దతిచ్చి గెలిపిస్తానని చెప్పారు. దీంతో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని నాలుగేళ్ల నుంచి జనసేన జిల్లా అధ్యక్షుడు సహా అందరూ సీటుపై ఆశలు వదిలేస్తే... చివరికి టీడీపీ మాజీ ఎమ్మెల్యేకి టికెట్ ఇవ్వడం కోసం హైదరాబాద్ పిలిచి మాట్లాడటం అంటే జనసేన వారిని అవమానించినట్టే కదా.. అని నేతలు మండిపడుతున్నారు.

అట్టుడుకుతున్న టీడీపీ

టీడీపీలో చల్లారని టికెట్ల చిచ్చు



మద్దతు కోసం వచ్చిన మంతెన రామరాజుకు సహకరించేది లేదని చెబుతున్న శివరామరాజు

సాక్షి, అమరావతి/సాక్షి, నంద్యాల/సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): టీడీపీలో టికెట్ల కేటాయింపు చంద్రబాబుకు పెద్ద తలనొప్పిలా మారింది. తమ్ముళ్లకు సర్దిచెప్పలేక బాబు నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నారు. ఉండవల్లికి పిలుపించుకుని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా టీడీపీ శ్రేణులు వెనక్కితగ్గకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో పడిపోయారు. ఇదంతా చంద్రబాబు నిర్వాకం వల్లేనని, పార్టీ కోసం కష్టపడినవారికి కాకుండా టికెట్లు అమ్ముకున్నారంటూ సీనియర్లు, కిందిస్థాయి నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. దీంతో టీడీపీలో టికెట్ల చిచ్చు ఇప్పట్లో చల్లారేలాలేదు. వేరే వారికి సీట్లు ప్రకటించారని కొన్నిచోట్ల, తమ సీట్లు జనసేనకు కేటాయించారని మరికొన్ని చోట్ల ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు రచ్చ రచ్చ చేస్తున్నారు. చంద్రబాబు తన నిర్ణయం మార్చుకోకపోతే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని అల్టిమేటం జారీ చేశారు.

టీడీపీ కీలక నేతపై దాడి

అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం సీటును మహాసేన రాజేష్‌కు ఇవ్వడంపై అక్కడి టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. టీడీపీ కేడర్‌తో పాటు జనసేన నేతలు, కార్యకర్తలు రాజేష్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మంగళవారం టీడీపీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్‌పై కేడర్ ఏకంగా దాడికి పాల్పడ్డారు. దీంతో చంద్రబాబు ఇరకాటంలో పడ్డారు. అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించారనే సమాచారంతో అక్కడి టీడీపీ నేతలు ఇప్పటికే తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. కాగా, తనకు సీటు ఇవ్వకపోవడం మహదానందంగా ఉందంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి మండలి బుద్ధప్రసాద్ వ్యంగ్యంగా స్పందించారు. జనసేనకు సీటు ఎలా ఇస్తారంటూ ఆయన అనుచరులు నియోజకవర్గంలో హడావుడి చేస్తున్నారు.

ఉండిలో రామరాజును ఓడిస్తా: శివరామరాజు

పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు మళ్లీ సీటు ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఇప్పటికే ఆయన ప్రకటించగా.. ఆయన్ను బుజ్జగించేందుకు టీడీపీ సీనియర్ నేతలు ఎంత ప్రయత్నించినా వినేందుకు సిద్ధంగా లేరు. మంగళవారం శివరామరాజు కార్యాలయానికి వెళ్లిన రామరాజు ఆయన మద్దతు కోరి అభాసుపాలయ్యారు. రామరాజుతో కరచాలనం చేసేందుకు శివరామరాజు ఇష్టపడకపోగా తన కార్యాలయానికి రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ రామరాజు మీడియాతో మాట్లాడేందుకు ప్రయత్నించడంపై శివరామరాజు అభ్యంతరం తెలిపారు. రామరాజును ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడిస్తానని ఆయన స్పష్టం చేశారు.

భగ్గుమన్న శేషారావు వర్గం

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు సీటును జనసేనకు కేటాయించారనే ప్రచారంతో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు వర్గం ఆగ్రహంతో ఉంది. శేషారావుకు టికెట్ ఇవ్వాల్సిందేనని ఆయన వర్గం డిమాండ్ చేస్తోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నేతలు సమావేశమై జనసేన అభ్యర్థికి సహకరించేది లేదని తీర్మానాలు చేశారు. రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక చిచ్చు కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం, తిరువూరు, కృష్ణా జిల్లా పెనమలూరు, పెడన, ఏలూరు జిల్లా నూజివీడు, విజయనగరం జిల్లా గజపతినగరం, విశాఖపట్నం వెస్ట్, నంద్యాల జిల్లా డోన్, కర్నూలు జిల్లా కోడుమూరు, సత్యసాయి జిల్లా పెనుకొండ, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, చిత్తూరు జిల్లా చిత్తూరు తదితర నియోజకవర్గాల్లో నేతలు సీట్ల కోసం సిగపట్లు పడుతున్నారు. చంద్రబాబు వారిని తన వద్దకు పిలిపించుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నా వినేందుకు సిద్ధంగా లేరు.

సూళ్లూరుపేటలో ఆరని చిచ్చు

సూళ్లూరుపేట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా నెలవల విజయశ్రీని ప్రకటించడంపై మాజీ ఎమ్మెల్యే పరసా వెంకటరత్నయ్య కుమార్తె షాలిని తీవ్రంగా మండిపడ్డారు. 1994 నుంచి కష్టాల్లో పార్టీకి అండగా ఉన్న వెంకటరత్నయ్యకు ఒక్కమాట చెప్పకుండా అభ్యర్థిని ప్రకటించడాన్ని ఆమె తప్పుపట్టారు. తనను గాని, తన భర్తను గాని ఐవీఆర్ సర్వేలో ఎందుకు పెట్టలేదని ఆమె ప్రశ్నించారు.

డోన్‌లో నువ్వా.. నేనా!

డోన్‌లో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంపై టీడీపీ మాజీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి వర్గం రగిలిపోతోంది. మార్చి 1న డోన్‌లో నూతన కార్యాలయం ప్రారంభించాక ఓ ఫంక్షన్ హాలులో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశానికి కోట్ల సిద్ధమవుతుండగా.. పోటీగా సమావేశం నిర్వహించేందుకు సుబ్బారెడ్డి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కోట్ల తనయుడు మండలాల్లో కార్యకర్తలతో సమావేశమై తమకు మద్దతుగా నిలవాలని అభ్యర్థిస్తున్నారు. తనకు టికెట్ ఇస్తామని చెప్పి.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా అభ్యర్థిని ప్రకటించడంపై సుబ్బారెడ్డి సీరియస్‌గా ఉన్నారు. ప్రజా మద్దతు తనకే ఉందని అధినాయకత్వానికి చాటిచెప్పేలా మార్చి 2న సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అభిమానులు, కార్యకర్తల అభీష్టం మేరకే వచ్చే ఎన్నికల్లో రెబల్‌గా పోటీపై నిర్ణయం తీసుకుంటామని మంగళవారం బేతంచెర్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో స్పష్టం చేశారు.

కృష్ణమ్మ రాకతో

చెరువుల్లో జలకళ

- వడివడిగా వస్తున్న కృష్ణా జలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- కాలువ నీటిపై రాజకీయం తగదన్న జలవనరుల శాఖ



కృష్ణా నీటితో నిండిన కుప్పం నియోజకవర్గంలోని శెట్టికుంట చెరువు

శాంతిపురం: కుప్పం కాలువలోకి వచ్చిన కృష్ణా జలాలతో మండలంలోని వెంకటేష్‌పురం వద్ద ఉన్న శెట్టికుంట చెరువు నిండింది. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం మిట్టపల్లి సమీపంలోని మద్దికుంట చెరువుకు నీరు వదలటంతో అది నిండుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం రామకుప్పం మండలంలోని రాజుపేట నుంచి కుప్పం నియోజకవర్గానికి లాంఛనంగా నీటిని విడుదల చేశారు. అప్పటికే అధికారుల ట్రయల్ రన్‌తో కాలువ కింది భాగంలోనూ నీరు ఉండటంతో అదే రోజు సాయంత్రానికి రామకుప్పం మండలం దాటి శాంతిపురం మండలంలో కృష్ణా జలాలు ప్రవేశించాయి. గుండిశెట్టిపల్లి వద్ద పలమనేరు జాతీయ రహదారిపై ఉన్న వంతెన వద్ద నీరు ముందుకు సాగటంతో స్థానిక రైతులు రాత్రి పూట సైతం గంగ పూజలు చేశారు. అదే క్రమంలో వెంకటేష్‌పురం వద్ద ఉన్న చెరువుకు ఉన్న ఓటీ పాయింట్ తెరిచి ఉండటంతో మంగళవారం మధ్యాహ్నంలోగా ఈ చెరువు పూర్తిగా నిండిపోయింది. మిట్టపల్లి వద్ద గల మద్దికుంట చెరువుకు మంగళవారం అధికారులు నీరు విడుదల చేయటంతో చెరువు క్రమంగా నిండుతోంది. జలకళతో కనువిందు చేస్తున్న ఈ రెండు చెరువులను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులు తరలివస్తున్నారు.

కృష్ణా జలాలపై తప్పుడు రాజకీయం తగదు

హంద్రీనీవా కుప్పం కెనాల్‌లో నీటి ప్రవాహంపై తప్పుడు రాజకీయం చేయడం తగదని రాష్ట్ర జలవనరుల శాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రామకుప్పం మండలం రాజుపేట వద్ద బ్రాంచి కెనాల్ నుంచి కుప్పం నియోజకవర్గానికి నీటిని విడుదల చేసినట్టు తెలిపింది. క్రాస్ రెగ్యులేటర్ నుంచి కృష్ణా జలాలను వదిలి 70.10 కిలోమీటర్ వద్ద తూము గుండా మద్దికుంట చెరువుకు నీటిని తరలించినట్టు వెల్లడించింది. శాంతిపురం మండలంలో 75.75 కిలోమీటర్ల వద్ద గల వెంకటేష్‌పురం శెట్టివానికుంట చెరువును పూర్తిగా నీటితో నింపినట్టు తెలిపింది. గుండిశెట్టిపల్లి వద్ద గంగ పూజలు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నేతల నుంచి వచ్చిన విజ్ఞప్తితో కాలువలోని 84వ కిలోమీటరు వరకూ నీటిని విడుదల చేసినట్టు వెల్లడించింది. పూజల అనంతరం నీటిని పూర్తిగా మద్దికుంట చెరువుకు మళ్లించి, అది నిండిన తర్వాత నాగసముద్రం, మణీంద్రం చెరువుకు నీటిని పంపే ఏర్పాట్లలో జలవనరుల శాఖ అధికారులు ఉన్నారని తెలిపింది. కానీ.. కొందరు రాజకీయ దురుద్దేశంతో కృష్ణా జలాలు ఆగిపోయాయని తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు పేర్కొన్నారు. కృష్ణా నదిలో నీటి లభ్యత తక్కువై శ్రీశైలంలో కనీస నీటి నిల్వ ఉన్నప్పటికీ అక్కడి నుంచి 27 చోట్ల ఎత్తిపోతల ద్వారా 733 మీటర్ల ఎత్తులో.. 676 కిలోమీటర్ల దూరంలోని కుప్పం ప్రాంతానికి ప్రభుత్వం నీటిని ఇస్తోందన్నారు. భగీరథ ప్రయత్నంతో అధికారులను పరుగులు పెట్టించిన ముఖ్యమంత్రిని ప్రశంసించాల్సింది పోయి, రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరికాదని జల వనరుల శాఖ పేర్కొంది.

మాట ప్రకారం నీళ్లిచ్చారు



ఏడాది క్రితం కుప్పానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కృష్ణా నది నీటిని కాలువలోకి విడుదల చేశారు. దీంతో మా ఊరి చెరువు కూడా పూర్తిగా నిండింది. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నాడు. ఆయన తలచుకుంటే ఎప్పుడో మాకు నీటి కష్టాలు లేకుండా చేసేవాడు. కానీ ఆయన ఎప్పుడూ మమ్మల్ని ఓట్లేసే బానిసలుగానే చూశాడు.

– మంజునాథ్, రైతు, వెంకటేష్‌పురం

నీళ్లు రాలేదంటే కళ్లుపోతాయి



మా ఊరి దగ్గర హంద్రీనీవా కాలువలో సోమవారం నుంచి నీళ్లు పారుతున్నాయి. నీళ్లు వస్తున్నా రాలేదని గంగమ్మ తల్లితో రాజకీయాలు చేస్తే కళ్లుపోతాయి. ఈ ప్రభుత్వం కుప్పానికి నీరు రావటానికి కాలువను సిద్ధం చేసింది. రేపు కృష్ణా నదిలో నీళ్లు వస్తే మా ప్రాంతంలో ఉన్న అన్ని చెరువులకు నీళ్లు వస్తాయి.

– జయరామిరెడ్డి, రైతు, దండికుప్పం

కుప్పంలో ఇప్పుడెలా?

- కృష్ణమ్మ పరవళ్లు... తమ్ముళ్ల గుండెల్లో రైళ్లు
- సీఎం జగన్ కుప్పం సభకు పోటెత్తిన జనంతో చంద్రబాబు మైండ్‌బ్లాంక్
- తనకూ... చంద్రబాబు పాలనకు ఉన్న తేడా లెక్కల్లో చూపిన జగన్
- జగన్‌కు జై కొట్టేందుకు కుప్పం నియోజకవర్గ జనం సిద్ధం

సాక్షి, చిత్తూరు: కుప్పంలో సోమవారం సీఎం వైఎస్ జగన్ పర్యటన పచ్చనేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. అక్కడి సభలో తన 57 నెలల పాలనలో ఆ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి... 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసి చెప్పడం జనాన్ని ఆలోచింపజేసింది. సీఎం జగన్ పాలనలో కుప్పం రూపురేఖలు మారాయి. చరిత్రలో నిలిచిపోయేలా అక్కడి బీడు భూముల్లో కృష్ణమ్మ జలాలు పరవళ్లు తొక్కాయి. అభివృద్ధికి ఆమడదూరంలో ఉండే కుప్పం పట్టణంలో మౌలిక సదుపాయాలు ఊపందుకున్నాయి. పార్టీలకు అతీతంగా 92 శాతం అక్కడి ప్రజలకు నవరత్న పథకాలు అందాయి. దళారుల బెడద లేకుండానే 82,039 కుటుంబాలకు డీబీటీ ద్వారా రూ.1400 కోట్లు చేరాయి. ఈ విషయాన్ని సీఎం జగన్ స్వయంగా ప్రకటించడం ప్రజలను ఆలోచింపజేస్తోంది. ఇది చంద్రబాబుకు ఏ మాత్రం మింగుడు పడటం లేదు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

2022 సెప్టెంబర్ 23న కుప్పం నియోజకవర్గంలో సీఎం జగన్ పర్యటించారు. అప్పుడు జరిగిన సభలో కృష్ణా జలాలు తీసుకొస్తానని మాటిచ్చారు. ఆ తర్వాతే ఓటు అడుగుతానని కూడా స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు చేపట్టారు. అనంత వెంకటరెడ్డి హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా రూ.560.29 కోట్ల వ్యయంతో ఈ పనులు పూర్తి చేశారు. దీనిద్వారా కుప్పం నియోజకవర్గంలోని 110 మైనర్ ఇరిగేషన్ చెరువుల ద్వారా 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 4.02 లక్షల జనాభాకు తాగునీటిని స్వయంగా ముఖ్యమంత్రి జగన్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కుప్పంలో సోమవారం నిర్వహించిన సీఎం సభ ప్రభంజనం సృష్టించింది. సొంత నియోజకవర్గానికి న్యాయం చేయలేని చంద్రబాబు రాష్ట్రానికి ఏం చేస్తారని చెప్పడం అక్కడి జనాన్ని ఆలోచింపజేసింది. ఈ సభ తరువాత కుప్పంలో గతంలో ఎన్నడూ లేనంతగా జగన్నినాదం మార్మోగింది. ఇన్నాళ్లూ తనకు తిరుగులేదని భ్రమించిన చంద్రబాబుకు తాజా సభ మైండ్ బ్లాంక్ అయ్యేలా చేసింది.

కొత్త ప్రాజెక్టుల ప్రకటనతో బాబు వర్గం డీలా...

కుప్పం నియోజకవర్గంలో మరికొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తామని జగన్ చెప్పడంతో బాబు వర్గంలో ఆందోళన మొదలైంది. కృష్ణమ్మ నీటిని నిల్వ ఉంచుకునేందుకు కొత్తగా రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లతోపాటు రూ.215 కోట్లతో పాలారు నదిపై మరో చిన్నపాటి రిజర్వాయర్ నిర్మించేలా పరిపాలన అనుమతులు ఇచ్చామని సీఎం ప్రకటించారు. బాబు గత పాలనలో ఒక్క ఇంటి పట్టా ఇవ్వలేదు. కానీ, జగన్ సీఎంగా ఉన్న కొద్ది కాలంలోనే ఏకంగా 15,721 వేల ఇళ్ల పట్టాలిచ్చారు. త్వరలోనే మరో 15వేల ఇంటి పట్టాలివ్వనున్నట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఏం చెప్పి ఓట్లడగాలో తెలియక చంద్రబాబు లోలోన మథనపడిపోతున్నారు. ఇదే తరుణంలో కుప్పంలో సీఎం సభ విజయవంతం కావటంతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో మంచి జోష్ కనిపిస్తోంది. ఇదే ఉత్సాహంతో ఎన్నికలకు సమాయత్తమవుతోంది.

పెడన నుంచే పోటీ చేస్తా

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్



పెడన మండలం బల్లిపర్రులో అనుచరులతో మాట్లాడుతున్న వేదవ్యాస్

పెడన: తాను పెడన నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని, ఏ పార్టీ తరఫున అనేది తరువాత విషయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లా పెడన మండలం బల్లిపర్రులో పర్యటించిన ఆయన అంబేడ్కర్, వంగవీటి రంగా, గౌతు లచ్చన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2019లో టికెట్ ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇవ్వలేదని, 2024లో ఇస్తానని చెప్పి ఇప్పుడు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పవన్‌కళ్యాణ్‌ను కలిసి జనసేన టికెట్ ఇవ్వాలని కూడా కోరానన్నారు. ఏమైందో తెలియదని, ఇద్దరూ టికెట్ ఇవ్వలేదని ఆవేదన వెలిబుచ్చారు. తన హయంలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ఆ నమ్మకం, అభిమానంతో ప్రజలను ఓట్లు అడిగే హక్కు తనకు ఉందని అన్నారు.

ప్రచారం ప్రారంభించిన కాగిత

కాగా.. పెడన జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్ పేరును ఖరారు చేయడంతో ఆయన ప్రచారం ప్రారంభించారు. ఇదే సమయంలో తనకు సీటు దక్కలేదని, అయినా పోటీకి దిగుతానంటూ బూరగడ్డ వేదవ్యాస్ సైతం నియోజకవర్గంలో పర్యటిస్తుండటంతో టీడీపీతోపాటు జనసేన నేతలు కూడా గందరగోళానికి, అయోమయానికి గురవుతున్నారు.

From: Chandramouli prasad RV
Subject: Ranji captain
Date: 11-Jan-2024

Dear sir,

With Regards
Thanking you
Rv Chandramouli Prasad
Chairman senior selection committee 2023-24.

వ్యక్తిగత కారణాలతో ఈ సీజన్‌కు రంజీ కెప్టెన్సీ నుంచి వైదొలుగుతానని హనుమ విహారి అభ్యర్థించారని, కాబట్టి రికీ భుయ్‌ని కెప్టెన్‌గా చేస్తున్నామని సెలక్షన్ కమిటీ హెడ్ చంద్రమౌళి ప్రసాద్ రాసిన మెయిల్.

From: Hanuma Vihari hanumavihari@gmail.com
Date: 11-Jan-2024 at 3:07:42 PM
To: President Andhra Cricket Association president@andhracricket...
Cc: CEO Andhra Cricket Association ceo@andhracricket.com; Chandramouli prasad R.V. chairmanselect2023@gmail.com; Secretary Andhra Cricket Association secretary@andhracricket.com

Respected sir,

I heartily welcome the decision taken by the selection committee.
I assure you that I will continue to give my 100% which I've always done to make Andhra the best team in The country.

Thanking you,

Warm regards

Hanuma vihari

సెలక్షన్ కమిటీ నిర్ణయాన్ని నూరు శాతం స్వాగతిస్తున్నానంటూ విహారి ఇచ్చిన సమాధానం.

From: Abhinay Varma varmaabhinay1234@gmail.com
Date: 27-Feb-2024 at 6:21:02 PM
To: secretary@andhracricket.com

This is P V Satyanarayana Raju,I was present in the Be... ACA-VDCA Stadium in Vizag, Ricky anna and Hanuma... from me. In that letter, we all agreed that Vihari would... keep the signature under pressure as it was my first ti... scared that if we did not sign those papers, they would... future matches.So, out of fear for our careers, I signed... as captain as few players supported him for well-being and I had no option left .

విహారినే కెప్టెన్‌గా కొనసాగించాలంటూ రాసిన లేఖపై తాను ఒత్తిడి వల్లే సంతకం చేశానని, సంతకం చేయకుంటే తన కెరీర్ ఏమవుతుందోనని భయపడ్డానంటూ ఆటగాడు సత్యనారాయణ రాజు రాసిన లేఖ.

From: Ashwin Hebbar
Subject: Regarding the incident in Ranji Trophy – Ashwin hebbar
Date: 27-Feb-2024 at 7:11:38 PM
To: secretary@andhracricket.com

Dear sir,
I was in the dressing room when the incident happened between kn prudhvi Raj and hanuma vihari, firstly I would like to tell you that I have nothing do with any group in Andhra and I mostly stay away from such topics. With regards to the incident, there was foul language that was used in the dressing room towards kn prudhvi Raj, it was the frustration of the match that he has showcased on kn prudhvi Raj and I also feel it was extremely hurtful and disrespectful towards kn prudhvi Raj. regarding the signatures, I signed it because of the amount of players that have signed it and it would not look good as being part of the team and not signing when everyone was . So I felt the pressure and being hated by the some players in the team , so I obliged to sign it, but on a personal note the words he used during the incident reflected very poorly on that occasion and I do not support it in any way.

సంఘటన రోజు తాను డ్రెసింగ్ రూమ్‌లో ఉన్నానని, పృథ్వీరాజ్‌ను విహారి దుర్భాష లాడాడని... ఇక కెప్టెన్‌గా విహారినే కొనసాగించాలంటూ అందరినీ బెదిరించి సంతకాలు తీసుకోవటంతో తనను టార్గెట్ చేస్తారన్న భయంతో సంతకం పెట్టానన్న అశ్విన్ హెబ్బర్.

వివాదాల 'విహారి'!

ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్ హనుమ విహారిపై అనేక ఫిర్యాదులు

- విచారణలో ఆరోపణలన్నీ వాస్తవాలని తేలాయి.. అందుకే ఏసీఏ చర్యలు
- ఏసీఏ కార్యదర్శి కోటా కొత్త పద్ధతి కాదు.. బాబు హయాంలోనూ ఉన్నదే
- కొన్ని టీమ్స్‌లో 18 మంది, 22 మంది కూడా ఉన్నారు
- ఈ విషయాలు తెలిసీ రామోజీ విష ప్రచారం

సాక్షి, విశాఖపట్నం: క్రికెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) చేస్తున్న కృషితో పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన క్రీడలు దేశాన్నే ఆకర్షించాయి. ఈ రాష్ట్రం ఏ రంగంలో బాగుపడినా నచ్చని పచ్చమీడియా.. ముఖ్యంగా రామోజీరావు క్రీడలపైనా విషం చిమ్ముతున్నారు. ఇందుకు ఆంధ్ర రంజీ మాజీ కెప్టెన్ హనుమ విహారి ఉదంతాన్ని కూడా విషపూరితం చేసి, చిలువలు పలువలు అల్లి ఈనాడులో కథనాలు వండి వారుస్తున్నారు. నిజానికి ఆంధ్ర క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హనుమ విహారి వైఖరి ఆది నుంచి వివాదాస్పదమే. జట్టు సభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడుతుంటారన్న ఫిర్యాదులున్నాయి. విహారి వ్యవహార శైలిపై పలుమార్లు సాటి ఆటగాళ్లు, ఏసీఏ అధికారులు, కోచ్‌లు, కోచ్ హెడ్‌లు కూడా ఫిర్యాదులు చేశారు. అవన్నీ వాస్తవమేనని విచారణలో తేలడంతో చర్యలు తీసుకున్నారు. ఏసీఏ కథనం ప్రకారం..

From: Hanuma Vihari
Subject: Re: NOC
Date: 23-Jun-2023 at 5:53 PM
To: Secretary Andhra Cricket Association
Cc: Andhra Cricket; CEO Andhra Cricket Association

I apologise for the mail. Out of frustration that I've not been considered for the Indian team I put out a mail.
I want to revoke my decision in moving out and continue serving Andhra cricket.
I once again apologise.

Regards
Hanuma vihari

On Fri, 23 Jun 2023 at 4:06 PM, Hanuma Vihari wrote:
Sir

Myself Hanuma Vihari (captain of Andhra Ranji team) is requesting you for a NOC to play for a different state from the following season. I've made up my mind because I feel it's best for me to play as a professional player for a different state because of the phase of my career I'm in. I want to challenge myself and give myself a best opportunity to make a comeback to the indian ...

ఆంధ్రా జట్టుకు తాను ఆడలేనని, మరో రాష్ట్రానికి ఆడతానని, దీనికోసం ఎన్‌ఓసీ ఇవ్వాలని గత ఏడాది జూన్ 23న సాయంత్రం 4 గంటలకు లేఖ రాసిన విహారి. మళ్లీ 5.53కు మరో లేఖ రాస్తూ... ఆంధ్రా జట్టుకే ఆడతానని, ఇండియా జట్టుకు సెలక్ట్ కాలేదన్న ఫ్రస్టేషన్‌తో ఆ లేఖ రాశానని క్షమాపణలు చెప్పిన విహారి.

విహారిపై ఫిర్యాదుల్లో కొన్ని..

- బెంగాల్ రంజీ మ్యాచ్‌లో విహారి అందరి ముందు ఒక ఆటగాడి (పృథ్వీరాజ్)ని అసభ్యంగా దుర్భాషలాడారు. దీనిపై ఆయన ఏసీఏకు ఫిర్యాదు చేశారు.
- సాటి జట్టు సభ్యులు, సపోర్టు స్టాఫ్‌తో పాటు ఏసీఏ అధికారులు సైతం తరచూ విహారి అసభ్యకర పదజాలంపై ఫిర్యాదులు చేశారు.
- ముస్తాఖ్ ఆలీ టోర్నమెంట్ ఆంధ్ర టీం మేనేజర్ రాజారెడ్డి కూడా జట్టులో గ్రూపులకు విహారి కారణమవుతున్నారని ఫిర్యాదు చేశారు.
- ఇతర రాష్ట్రాల తరఫున మ్యాచ్‌లు ఆడేందుకు నిరభ్యంతర సర్టిఫికెట్ ఇవ్వాలని విహారి పదే పదే ఏసీఏని అడిగేవారు. కొన్నిసార్లు తన నిర్ణయాన్ని మార్చుకుని క్షమాపణలు కూడా చెప్పేవారు. తరచూ కెప్టెన్సీ నుంచి తప్పించాలనేవారు. మళ్లీ ఆంధ్ర జట్టులోనే కొనసాగుతానని చెబుతుండేవారు.
- విహారి అనుభవం, ఆంధ్ర క్రికెట్ ప్రయోజనాల దృష్ట్యా జట్టులో కొనసాగించారు.
- హనుమపై వచ్చిన ఆరోపణలు వాస్తవాలేనని విచారణలో తేలింది.
- కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాలని సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి చంద్రమౌళి ప్రసాద్ చౌదరి నుంచి ప్రతిపాదన వచ్చింది. దీంతో విహారి తర్వాత స్థానంలో ఉన్న రిక్కీబుయ్‌ని కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ నిర్ణయాన్ని కూడా విహారి అంగీకరించి అభినందించారు కూడా.
- ఆ తర్వాత కెప్టెన్‌గా తననే కొనసాగించాలంటూ విహారి తమను బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించుకున్నట్టు జట్టు సభ్యులు తెలిపారు.
- పృథ్వీరాజ్ ఒకేసారి రంజీ జట్టులోకి రాలేదు. అండర్ 14, 16, అండర్ 19 వినూ మన్కడ్, కూచ్ బిహార్, అండర్ 23, 25 కల్నల్ సీకేనాయుడు, విజయ్ హజారే ట్రోఫీల్లో ఆడి ప్రతిభ నిరూపించుకున్నాడు. ఇంత సీనియారిటీ, అనుభవం ఉన్నప్పటికీ, జనవరిలో బెంగాల్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో కెప్టెన్ విహారి అతన్ని ఆడించలేదు. గాయపడిన మరో వికెట్ కీపర్‌ను ఆడించారు.

చాలా జట్లలో 17 మందికన్నా ఎక్కువ సభ్యులు

ఈనాడు పేర్కొన్నట్టు.. క్రికెట్ జట్టులో 15 మందే ఉండాలన్న నిబంధనేమీ లేదు. 17 మందికి మించి సభ్యులున్న జట్లు చాలానే ఉన్నాయి. 2023–24 క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ టీమ్‌లో 18 మంది ఉన్నారు. హైదరాబాద్ జట్టులోనూ 17 మంది కంటే ఎక్కువే ఉన్నారు. కోవిడ్ సమయంలో ఏసీఏ కూడా ఆంధ్ర జట్టుకు 22 మందిని ఎంపిక చేసింది. ఏసీఏ కార్యదర్శి కోటా కూడా కొత్తదేమీ కాదు.. చంద్రబాబు హయాం నుంచే ఉంది. ఈ విషయాలు తెలియకుండానే రామోజీ కథనం అల్లారా?

ఫౌండేషన్ మూతపడేలా

2021 నవంబర్‌లో తిరుపతిలో వరదల్లో ప్రజలకు పాలు, బ్రెడ్ వంటి ఆహార పదార్థాలను హనుమ విహారి ఫౌండేషన్ అందించింది. ఫౌండేషన్ సహాయ కార్యక్రమాల్లో ఇద్దరు వాలంటీర్లు ఎన్టీఆర్ ట్రస్ట్ టీ షర్ట్స్ వేసుకుని కనిపించారు. దీంతో వరద బాధితులకు ప్రభుత్వం సహాయం చేయడంలేదని, తామే చేస్తున్నామంటూ టీడీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. అయితే, ఈ సహాయ కార్యక్రమానికి టీడీపీకి కానీ, ఎన్టీఆర్ ట్రస్టుకు కానీ సంబంధం లేదని, తమ బృందంలోని ఇద్దరు వాలంటీర్స్ ఎన్టీఆర్ ట్రస్ట్ టీ షర్ట్స్ వేసుకుని ఉన్నారని, అంతమాత్రాన ఇది ఎన్టీఆర్ ట్రస్టు చేసినట్టు కాదంటూ విహారి ఫౌండేషన్ గట్టిగా ఖండించింది. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు విహారిని వేధించి, వెంటబడి ఫౌండేషన్ మూతపడేలా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అదే టీడీపీ నేతలు ఇప్పుడు విహారిపై ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడటం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

From: rohit varma
Subject: Complaint Regarding Conduct Issues
Date: 07-Jan-2024 at 12:57:31 PM
To: Secretary Andhra Cricket Association

To,
Honourable Secretary,
Andhra Cricket Association,

Subject: Formal Complaint Regarding Conduct Issues

Respected sir,

I am writing to bring to your attention an incident that occurred on December 14, 2023, involving Hanuma Vihari.
On that day, I received a WhatsApp message from Mr. Vihari inquiring about ACA's social media page and suggesting that we had overlooked his milestone. I responded by emphasizing a more respectful mode of communication and assured him that we would rectify any oversight if indeed one had occurred. Unfortunately, the conversation escalated, with Mr. Vihari questioning my authority and suggesting that my position is a result of players, not the other way around. He also suggested I should earn respect and not ask for it and asking me not to teach an Indian player how to talk which is insulting. This exchange lacked the professionalism and respect expected within the ACA.

హనుమ విహారి తనను దూషించారని, అందరితోనూ ఇలాగే అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నాడని టీమ్ మేనేజరు రోహిత్ వర్మ ఈ ఏడాది జనవరి 7న ఇచ్చిన ఫిర్యాదు.

పైరవీలు చేస్తే నా కొడుకు కెప్టెన్ అయ్యేవాడుగా?

ఆంధ్రా క్రికెట్ జట్టు సభ్యుడు పృథ్వీరాజ్ తండ్రి నరసింహాచారి



తిరుపతి మంగళం: 'భారత క్రికెట్ జట్టుకు ఆడిన ఆంధ్రా మాజీ కెప్టెన్ హనుమ విహారి తన సహచర ఆటగాడు పృథ్వీరాజ్‌పై అసత్య ఆరోపణలతో ట్వీట్ చేయడం బాధాకరం. నిజంగా నేను పైరవీలు చేసి ఉంటే నా కుమారుడు పృథ్వీరాజ్ ఎందుకు ఆంధ్రా జట్టులో 17వ ఆటగాడిగా ఉంటాడు. ఏకంగా కెప్టెన్ అయ్యేవాడు కదా..' అని పృథ్వీరాజ్ తండ్రి నరసింహాచారి అన్నారు. ఆయన మంగళవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'తిరుపతికి చెందిన నా కుమారుడు పృథ్వీరాజ్ అండర్–12, 14, 17, 19 క్రికెట్‌లో విశేష ప్రతిభ చూపాడు. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా అనేక రికార్డులు పృథ్వీరాజ్‌పై ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు ఒక్క రంజీ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. నేను రాజకీయంగా ప్రభావితం చేసి నా కుమారుడిని క్రికెట్ జట్టులోకి తీసుకువస్తున్నట్లు హనుమ విహారి ఆరోపణలు చేయడం సమంజసం కాదు. నేను ఏసీఏను రాజకీయంగా ప్రభావితం చేయగలిగే వాడినే అయితే నా కుమారుడు ఒక్క మ్యాచ్ కూడా ఎందుకు ఆడకుండా ఉంటాడు. నా కుమారుడు పృథ్వీరాజ్ ప్రతిభ కలిగినవాడు. స్వశక్తితో పైకి రావాలని కోరుకుంటాడు. పైరవీలు, రాజకీయ ప్రభావంతో ఎదగాలని ఏ రోజూ కోరుకోలేదు. భారత జట్టుకు ఆడిన హనుమ విహారి తోటి క్రీడాకారులను పైకి తీసుకువచ్చే విధంగా ఆలోచించాలి. కానీ ఆయన మరొక క్రికెటర్‌ను దెబ్బతీసేలా మాట్లాడటం, అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదు. హనుమ విహారి చేసిన తప్పులను త్వరలోనే మీడియా ముందుకు తీసుకువస్తా..' అని నరసింహాచారి చెప్పారు.

క్రికెట్‌పై రాజకీయాలు దురదృష్టకరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్

జెంటిల్మన్ గేమ్ అయిన క్రికెట్ క్రీడపై రాజకీయాలు చేయడం దురదృష్టకరమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'క్రికెట్ అభివృద్ధి, విస్తరణకు దేశంలోని పలు అసోసియేషన్ల మాదిరిగానే ప్రతిష్టాత్మక ఏసీఏ కూడా విశేష కృషి చేస్తోంది. ఆటగాళ్ల ప్రవర్తన నియమావళి, నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను అనుసరిస్తోంది. ఇందులో పక్షపాతం, రాగద్వేషాలకు తావులేదు. ఏసీఏనుద్దేశించి హనుమ విహారి ఆరోపణలు చేయడం విచారకరం. ఆటగాళ్ల మధ్య చిన్నచిన్న పొరపొచ్చాలు వచ్చినా సమన్వయం కుదిర్చి సత్ఫలితాలు సాధించడం జట్టు బాధ్యత. అందులోభాగంగా ఏ ఆటగాడైనా తొందరపడినా, మరో రకంగా ప్రవర్తించినా వారి పట్ల అత్యంత సంయమనం పాటిస్తూ జట్టును ఏకతాటిపైకి తీసుకు రావడానికి ఏసీఏ కృషి చేస్తుంది. జట్టు ప్రయోజనాలు, క్రికెట్ స్ఫూర్తిని పరిగణనలోకి తీసుకుని లోలోపలే సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తుంది. పరిధి దాటితే నిబంధనల ప్రకారం వివక్ష లేకుండా చర్యలు తీసుకుంటుంది. హనుమ విహారి బహిరంగంగా సామాజిక మాధ్యమాల వేదికగా ఏసీఏ, సాటి సభ్యులపై ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రజలు గమనించాలి' అని ఏసీఏ కోరింది.

అధికారం కోసమే బాబు అండ్ కో అవాస్తవాల ప్రచారం



1,248వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అధికారం కోసమే చంద్రబాబు అండ్ కో సభలు పెట్టి మరీ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,248వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు మంగళవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబుతో కలిసి ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన పార్టీలు రాష్ట్రాన్ని వాటాలు వేసుకొని పంచుకోవటానికేనని మండిపడ్డారు. కరోనా కష్టకాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి పేదవాడి ఇంటి వద్దకే పింఛన్, బ్యాంకు ఖాతాల్లో నేరుగా సంక్షేమ పథకాల నగదు అందించి ఆదుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో బాబు, పవన్‌లు పక్క రాష్ట్రంలోని అద్దాల మేడల్లో ఉంటూ కనీసం పేదలు ఎలా ఉన్నారని కూడా పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు అడ్డదారుల్లో వెళ్లి ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా రాష్ట్రంలో బహుజనుల సత్తా ఏంటో చూపించి బాబు అండ్ కోను రాష్ట్రం నుంచి తరిమికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పల్లె బాబు, బోదాల సౌమ్య, కొమరవల్లి కిషోర్ బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, బోదాల సలోమీ, కారుమూరు పుష్పరాజు, బొలిమేర శామ్యూల్, నూతక్కి జోషి పలువురు దళిత నేతలు, మహిళలు పాల్గొన్నారు.

కొంతమంది త్యాగం చేయక తప్పదు

కొనసాగుతున్న బాబు బుజ్జగింపులు

సాక్షి, అమరావతి : అందరికీ సీట్లు ఇవ్వలేనని, పొత్తుల్లో భాగంగా కొందరు త్యాగం చేయక తప్పదని పలువురు టీడీపీ నేతలను చంద్రబాబు కోరారు. సీట్లు రాక అసంతృప్తితో ఉన్న నేతలను మంగళవారం ఆయన ఉండవల్లిలోని తన నివాసం వద్దకు పిలిపించుకుని మాట్లాడారు. తంబళ్లపల్లి సీటును ఈసారి జయ చంద్రారెడ్డికి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌తో చర్చించారు. తొలి జాబితాలో చోటు దక్కని ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డితో మాట్లాడారు. మాజీ మంత్రి జేసీ దివాకర్ రెడ్డి తనయుడు జేసీ పవన్‌ను పిలిపించుకున్న చంద్రబాబు.. ఆయనకు సీటు లేదని చెప్పినట్లు సమాచారం. పవన్ అనంతపురం ఎంపీ సీటు ఆశిస్తున్నారు. అయితే ఆ సీటును బీకే పార్థసారథికి ఇవ్వడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. పార్థసారథి మాత్రం తనకు పెనుగొండ అసెంబ్లీ స్థానం ఇవ్వాలని కోరుతున్నారు. కానీ ఎంపీ సీటు త్యాగం చేయాల్సిందేనని పవన్‌కు చంద్రబాబు సర్ది చెప్పినట్లు తెలిసింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చంద్రబాబును కలిసి త్వరలో తాను పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కడప పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కూడా చంద్రబాబును కలిశారు. రాయచోటి, శింగనమల నియోజకవర్గ నేతలతో చంద్రబాబు చర్చించి, టిక్కెట్ ఇచ్చిన అభ్యర్థులకు సహకరించాలని కోరారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల జనసేనకు కేటాయించడంతో అసంతృప్తిగా ఉన్న టీడీపీ ఇన్‌చార్జి బంగార్రాజుకు భవిష్యత్తులో అవకాశం ఇస్తానని సర్ది చెప్పారు. వీరంతా బయటకు వచ్చాక తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు. తాము బాబు మాటకు ఊకొట్టినా, తమ అనుచరులు మాత్రం తమ మాట వినే పరిస్థితి లేదని బాధిత నేతలు స్పష్టం చేస్తున్నారు.

ఎన్నికల అధికారుల బదిలీలపై ఈసీ స్పష్టత

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. ఈ అంశంపై గతేడాది డిసెంబర్ 21న, ఫిబ్రవరి 23వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన సూచనలను పాటించాలని తెలిపింది. ఈ మేరకు మంగళవారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఈసీ లేఖ రాసింది. అందరు డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఆర్ఓ, ఏఆర్ఓ, రేంజ్ ఏడీజీలు, ఐజీలు, డీఐజీలు, ఎస్ఎస్పీలు, ఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు, డిప్యూటీ ఎస్పీలు, సర్కిల్ అధికారులు ఒకే పార్లమెంటరీ నియోజకవర్గం లేదా జిల్లాలలో గత 4 సంవత్సరాలలో 3 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకుంటే.. వారిని ఇతర జిల్లాల్లో నియమించాలని సూచించింది. గత ఫిబ్రవరి 23 నాటి కమిషన్ సూచనలు పైన సూచించిన అధికారులకు మాత్రమే వర్తిస్తాయని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. అంతేకాకుండా.. ఆర్ఓలు, ఏఆర్ఓలు సొంత జిల్లాలో ఉన్న పార్లమెంటరీ నియోజకవర్గంలో పనిచేయడం లేదన్న అంశాన్ని నిర్ధారించుకోవాలని సూచించింది. ఈ సూచనల నుంచి 5 పార్లమెంటరీ నియోజకవర్గాల వరకు ఉన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది.

ఎవరు ఎక్కువ సీట్లిస్తే వారి వెంటే..

కాపు జేఏసీ నాయకుల స్పష్టీకరణ

సీతమ్మధార (విశాఖ ఉత్తర): కాపులకు ఎవరు ఎక్కువ సీట్లు ఇస్తే వారి వెంటే నడుస్తామని కాపు జేఏసీ నాయకులు తెలిపారు. విశాఖ జిల్లా కాపునాడు ఆధ్వర్యంలో ఆశీలమెట్టలో కాపు ఉద్యమ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కాపునాడు విశాఖ జిల్లా అధ్యక్షుడు తోట రాజీవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిణీ రిజర్వేషన్ నివేదిక ఇవ్వాలని కోరారు. 20 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, వచ్చే ఎన్నికల్లో కాపు ఓట్లు కావాలంటే తమ సమస్యల్ని కోల్డ్‌స్టోరేజ్ నుంచి తీయాలని డిమాండ్ చేశారు. 10 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని, వెనుకబడిన వర్గాలకు ఎఫ్ కేటగిరిలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం చేసిన 33/2017 బిల్లు అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో దామాషా ప్రకారం కాపులకు పదవులు ఇవ్వాలన్నారు. 25 శాతం కాపు జనాభా ఉందని, కాపులకు ఎవరు ఎక్కువ సీట్లు ఇస్తే వారి వెంటే ఉంటామన్నారు. ముద్రగడ పద్మనాభంకు సముచిత గౌరవం ఇచ్చిన పార్టీ వెంట నడుస్తామన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న కాపు జేఏసీ నేతలు

కుప్పుస్వామి సిఫార్సులు అమలు చేయాలి

కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ.. కాపు ఉద్యమంలో ఉన్నవారికి సీట్లు ఇవ్వాలన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలని, కుప్పుస్వామి కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఏటా రూ.రెండు వేల కోట్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు అన్ని పథకాల కింద రూ.30 వేల కోట్లు ఇచ్చామని చెబుతున్నారన్నారు. కాపు నేతల పేర్లు కొత్త జిల్లాలకు పెట్టలేదని విచారం వ్యక్తం చేశారు. కాపు నేత సాయి సుధాకర్ మాట్లాడుతూ.. కాపులకు 25 శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాపు నేతలు నల్లా విష్ణుమూర్తి, బీఎస్ మూర్తి, నక్కా వెంకటరమణ, తోట నగేష్, గంధం శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, శ్రీదేవి, వాసురెడ్డి యేసుదాసు, చందు జనార్ధన్, శ్రీదేవి వర్మ, అరేటిప్రకాశ్,కె.సంజీవ్ పాల్గొన్నారు.

అడుగడుగునా ఆదరణ.. అందుకే అక్కసు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిపై టీడీపీ దౌర్జన్యకాండ
- పార్టీ కార్యాలయం ప్రారంభానికి ముందే దాడి.. ఫ్లెక్సీలు చింపివేత



చింపివేసిన ఫ్లెక్సీలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అగ్రకులస్తులు ఎక్కువగా ఉండే చోట బీసీ మహిళకు వైఎస్సార్‌సీపీ సీటు కేటాయించింది. తమ ఆధిపత్యానికి గండి పడుతుందనే ఓటమి భయంతో పచ్చ పార్టీకి చెందిన ఒక సామాజిక వర్గం కక్ష కట్టింది. అడుగడుగునా దాడులకు తెగబడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది. వైఎస్సార్‌సీపీకి నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో రాజకీయంగా పోరాడే సత్తా లేక టీడీపీ గూండాలు చెలరేగిపోతున్నారు. గుంటూరు పశ్చిమలో రజినిని అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత అప్పటి వరకూ ఉన్న పరిణామాలన్నీ మారిపోయాయి. టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్రతో పాటు, ఉయ్యూరు శ్రీనివాస్, మన్నవ మోహనకృష్ణ లాంటి తన సామాజికవర్గ నేతలను పక్కన పెట్టి ఇక్కడ బీసీ మహిళనే పోటీకి దింపాలని చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించారు.

అంతు లేని అరాచకం

ఈ ఏడాది జనవరి 1న వైభవంగా వైఎస్సార్‌సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నూతన కార్యాలయం ప్రారంభించుకోవడానికి ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. ప్రధాన రహదారి సమీపంలో మంత్రి రజినికి సంబంధించిన సొంత కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రారంభోత్సవానికి సిద్ధమై ఉన్న కార్యాలయంపై టీడీపీ అల్లరి మూకలు రాళ్లు రువ్వాయి. ఏకంగా బస్తాల్లో రాళ్లు తీసుకొచ్చి కార్యాలయంపై దాడిచేయడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ దీపాలు పగిలిపోయాయి. అర్ధరాత్రి 12:30 గంట నుంచి 2:30 గంటల వరకు విధ్వంసకాండ సృష్టించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా కార్పొరేషన్‌కు పన్ను కడుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే వాటిని చించేశారు. ఎక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా వాటిని టీడీపీ మూకలు చించేస్తున్నాయి. గుంటూరులో కొద్దిరోజుల కిందట పలువురు అస్వస్థతకు గురైతే వారిని పరామర్శించేందుకు ఆస్పత్రికి మంత్రి రజని వెళ్లగా బీజేపీ నాయకులు కారును అమానవీయ కోణంలో అడ్డుకున్నారు. గుంటూరులోని పలు ప్రాంతాల్లో మంత్రి రజిని సొంత నిధులతో బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. పార్కులు, జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఈ బెంచీలు ఏర్పాటు చేస్తుంటే వీటిని కూడా ధ్వంసం చేస్తున్నారు. ఈ ఘటనలు టీడీపీ విచ్చలవిడితనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

చంద్రబాబు రాజకీయ క్రీ'నీడ'లో జనసేన బలి

- మూడు ముక్కలాటలో పవన్ జోకర్
- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్. చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు, అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ క్రీనీడలో జనసేన పార్టీ బలి పశువు అవుతుందని జనసేన కిందిస్థాయి కార్యకర్తలు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారని, ఇటీవల ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలే అందుకు నిదర్శనమని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన సీట్ల సంఖ్యను చూస్తే.. కూరలో కరివేపాకు మాదిరిగా చంద్రబాబు చూస్తున్నారని స్పష్టమవుతుందన్నారు. చంద్రబాబు మూడు ముక్కలాటలో పవన్ జోకర్‌లా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సినీ రంగంలో పేరు తెచ్చుకున్న హీరోగా, మెగాస్టార్ చిరంజీవి సోదరునిగా గుర్తింపు పొందిన పవన్.. టీడీపీ పల్లకీ మోయాల్సిన అవసరం ఏమొచ్చిందో తెలియడం లేదన్నారు. పవన్ సీఎం కావాలని జనసేన కార్యకర్తలు కోరుకుంటుంటే.. ఆయన మాత్రం చంద్రబాబు, లోకేశ్‌ను సీఎం చేయాలనుకుంటున్నారని.. మరోవైపు బీజేపీతో జనసేన పొత్తు అంటారని, ఇవెక్కడి రాజకీయాలని ఎంపీ ప్రశ్నించారు. జనసేన ఎదగకుండా చంద్రబాబు అడ్డు పడుతున్నారో, లేక ఆ పార్టీని అడ్డం పెట్టుకుని చంద్రబాబు ఎదుగుతున్నారో జనసేన కార్యకర్తలు గ్రహించాలని కోరారు. గత నలభై సంవత్సరాలుగా రాజకీయాల్లోనూ, పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ప్రజలకు, రాష్ట్రానికి చేసిందేమీ లేదని భరత్ రామ్ అన్నారు. జగన్ సీఎం అయ్యాక నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని, రైతులను అన్ని విధాలా ఆదుకోవడంతో ఆత్మహత్యలే లేవని చెప్పారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి, వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, రాష్ట్రానికి పలు పరిశ్రమలు వచ్చాయని.. అభివృద్ధి అంటే ఇది కాదా అని విపక్షాలను ప్రశ్నించారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనల్లో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని భరత్‌రామ్ సవాల్ విసిరారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

ఆ కూటమిలో పవన్ స్థానం ఏమిటో?

- రాజ్యాధికారం పంపకంలో పవన్, బాబు పాత్ర తేలకుండా ముందుకెళ్లడానికి వీల్లేదు
- తాడేపల్లిగూడెం సభలో చంద్రబాబు హామీ ఇవ్వాలి
- సంతృప్తికర స్పందన లేకుంటే.. 29న వ్యక్తిగత నిర్ణయం వెల్లడిస్తా
- మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య మరో లేఖ



పాలకొల్లు సెంట్రల్ : టీడీపీ, జనసేన కూటమిలో పవన్ స్థానం ఏమిటో అర్థంకావడంలేదని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య తెలిపారు. రాజ్యాధికారం పంపకంలో పవన్ పాత్ర, బాబు పాత్ర ఏమిటనేది తేలకుండా ముందుకెళ్లడానికి వీల్లేదని ఆయన స్పష్టంచేశారు. ఈ నెల 28న పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న టీడీపీ–జనసేన కూటమి బహిరంగ సభలో ఈ విషయమై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్పష్టత ఇవ్వాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఆ సభలో దీనిపై సంతృప్తికరమైన స్పందన రాకుంటే.. ఈ నెల 29న తన వ్యక్తిగత నిర్ణయం వెల్లడిస్తానని ఆయన అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం జోగయ్య పాలకొల్లులో ఒక లేఖ విడుదల చేశారు.

అధికారంలో సగభాగం జనసేనకు దక్కాల్సిందే..

ఇటీవల జరిగిన సీట్ల కేటాయింపును గమనిస్తే.. బడుగు, బలహీన వర్గాల ప్రజలు కోరుకుంటున్న రాజ్యాధికారం పక్కదారి పడుతున్నట్లు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. కాపులు భాగస్వాములుగా ఉన్న బడుగు, బలహీనవర్గాలు యాచించే స్థితి నుంచి శాసించే స్థాయికి చేరితేనే భవిష్యత్తుకు ఒకదారి ఏర్పడుతుందని తెలిపారు. పవన్‌ను సీఎంని చేయాలని, తద్వారా బడుగు, బలహీనవర్గాల ప్రజల బానిస సంకెళ్లు బద్దలుకొట్టాలని కాపులు పెద్దన్న పాత్ర పోషిస్తున్నారన్నారు. కానీ, ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తే.. టీడీపీ–జనసేన కూటమిలో పవన్ స్థానం ఏమిటో అర్థంకావడంలేదని చెప్పారు. అధికారంలో సగభాగం జనసేనకు దక్కాల్సిందేనని హరిరామ జోగయ్య స్పష్టంచేశారు.



ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ అరుంధతికి జరిమానా

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ అరుంధతి రెడ్డి మ్యాచ్ ఫీజులో కోత విధించారు. సోమవారం యూపీ వారియర్స్‌తో మ్యాచ్‌లో లోయర్ ఆర్డర్ బ్యాటర్ పూనమ్ వికెట్ తీసిన సంబరంలో అరంధతి అతిగా స్పందించింది. ఆ బ్యాటర్‌ను గేలి చేసేలా అనుచితంగా ప్రవర్తించింది. దీనిపై సమీక్షించిన మ్యాచ్ రిఫరీ వర్ష నాగ్రే డబ్ల్యూపీఎల్ నియమావళి ప్రకారం ఆమెపై చర్యలు తీసుకుంది. ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించింది. ఈ మ్యాచ్‌లో క్యాపిటల్స్ తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచి లీగ్‌లో బోణీ కొట్టింది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ



దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత ప్లేయర్ యూకీ బాంబ్రీ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీ 89 నిమిషాల్లో 6-7 (6/8), 6-3, 10-8తో అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)-మనారినో (ఫ్రాన్స్) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో ఆడుతున్న యూకీ-హాస్ జంట ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.



అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన నమీబియా బ్యాటర్ జాన్ నికోల్

కీర్తిపూర్ (నేపాల్): ధనాధన్ ఆటతో అదరగొట్టిన నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్... అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. మూడు దేశాల టి20 టోర్నీలో భాగంగా మంగళవారం నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో జాన్ నికోల్ 36 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్స్‌లతో 101 పరుగులు చేసి అవుటయ్యాడు. 22 ఏళ్ల జాన్ నికోల్ కేవలం 33 బంతుల్లో సెంచరీ మైలురాయి దాటాడు. ఇందులో 92 పరుగులు ఫోర్లు, సిక్సర్ల ద్వారానే రావడం విశేషం. గత ఏడాది ఆసియా క్రీడల సందర్భంగా మంగోలియాతో జరిగిన టి20 మ్యాచ్‌లో నేపాల్ ప్లేయర్ కుశాల్ మల్లా 34 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ రికార్డును జాన్ నికోల్ బద్దలుకొట్టాడు. నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ముందుగా నమీబియా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. అనంతరం నేపాల్ 18.5 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. జాన్ నికోల్ 29 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

రన్నరప్ భారత్



అలాన్యా: టర్కిష్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. నాలుగు దేశాల మధ్య లీగ్ ఫార్మాట్‌లో ఈ టోర్నీ జరిగింది. కొసోవో జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0-1 గోల్‌తో ఓడిపోయింది. ఈ టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన కొసోవో 9 పాయింట్లతో విజేతగా నిలువగా... 6 పాయింట్లతో భారత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ భారత జట్టుకు ఆడి హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక గోల్ కూడా చేసింది.

బెంగళూరు ధనాధన్...

- 12.3 ఓవర్లలోనే విజయం
- మెరిసిన స్మృతి, మేఘన, రేణుక
- మళ్లీ ఓడిన గుజరాత్ జెయింట్స్


మేఘన


స్మృతి

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ధనాధన్ ఆటతీరుతో వరుసగా రెండో విజయాన్ని సాధించింది. మంగళవారం జరిగిన పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. 7.3 ఓవర్లు మిగిలుండగానే స్మృతి మంధాన బృందం లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 107 పరుగులే చేసింది. ఓపెనర్ హర్లీన్ డియోల్ (31 బంతుల్లో 22; 3 ఫోర్లు), హేమలత (25 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రేణుక సింగ్ (2/14) స్వింగ్ బౌలింగ్‌కు మేటి బ్యాటర్లు బెత్ మూనీ (8), లిచ్‌ఫీల్డ్ (5) తలవంచారు. వేద కృష్ణమూర్తి (9), ఆష్లే గార్డ్‌నర్ (7)లు కూడా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ సోఫీ మోలినెక్స్ (3/25) గుజరాత్‌ను కోలుకోని విధంగా దెబ్బతీసింది. ఆర్‌సీబీ ఏకంగా ఏడుగురు బౌలర్లను ప్రయోగించింది. అనంతరం సులువైన లక్ష్యాన్ని బెంగళూరు 12.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన (27 బంతుల్లో 43; 8 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగింది. సహచర ఓపెనర్ సోఫీ డివైన్ (6) ఆరంభంలోనే నిష్క్రమించినా... వన్‌డౌన్ బ్యాటర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి సబ్బినేని మేఘన (28 బంతుల్లో 36 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి చకాచకా పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ 9వ ఓవర్లో తనూజ (1/20) స్మృతి వేగానికి కళ్లెం వేసింది. అయితే మేఘన, ఎలీస్ పెరీ (14 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు) మరో వికెట్ పడకుండా తమ కెప్టెన్‌లాగే ధనాధన్ ఆటతీరును కొనసాగించారు. దాంతో 13వ ఓవర్ పూర్తికాకముందే బెంగళూరు విజయతీరాలకు చేరుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

నీల్ వాగ్నర్ వీడ్కోలు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ ఎడంచేతి వాటం పేస్ బౌలర్ నీల్ వాగ్నర్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. దక్షిణాఫ్రికాలో పుట్టి 2008 నుంచి న్యూజిలాండ్‌లో స్థిరపడిన వాగ్నర్ 2012లో తొలి టెస్టు ఆడాడు. టెస్టుల్లో బౌలింగ్ ఓపెనింగ్ చేయకుండా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా 37 ఏళ్ల వాగ్నర్ గుర్తింపు పొందాడు. కేవలం టెస్టు ఫార్మాట్‌లోనే న్యూజిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించిన వాగ్నర్ మొత్తం 64 టెస్టులు ఆడి 260 వికెట్లు పడగొట్టాడు. ఇన్నింగ్స్‌లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తొమ్మిది సార్లు, ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు 13సార్లు తీసిన వాగ్నర్ 2022లో న్యూజిలాండ్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించాడు.

షమీకి శస్త్రచికిత్స

న్యూఢిల్లీ: భారత సీనియర్ సీమర్ మొహమ్మద్ షమీ ఎడమ కాలి మడమకు లండన్‌లో శస్త్రచికిత్స జరిగింది. దీంతో వచ్చేనెలలో ప్రారంభమయ్యే ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా అతను దూరమయ్యాడు. జూన్‌లో జరిగే టి20 ప్రపంచకప్ కల్లా అతను కోలుకుంటాడని జట్టు వర్గాలు భావిస్తున్నాయి. 33 ఏళ్ల పేసర్ చివరిసారిగా గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో బరిలోకి దిగాడు. 'ఆపరేషన్ సక్సెస్ అయింది. కోలుకునేందుకు కాస్త సమయం పడుతుంది. త్వరగా కోలుకొని నడవాలనుంది' అని షమీ 'ఎక్స్'లో ట్వీట్ చేశాడు. షమీ వేగంగా కోలుకోవాలని ఎప్పట్లాగే కెరీర్‌ను కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్‌లో ఆకాంక్షించారు.



హాకీ ఇండియా సీఈఓ ఎలీనా రాజీనామా



న్యూఢిల్లీ: హాకీ ఇండియా (హెచ్ఐ)లో మరో కుదుపు! 13 ఏళ్లుగా హాకీ ఇండియాకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా వ్యవహరిస్తున్న ఎలీనా నార్మన్ రాజీనామా చేసింది. ఇటీవలే మహిళల జట్టు చీఫ్ కోచ్ యానిక్ షాప్‌మన్ కూడా రాజీనామా చేసింది. 'భారత హాకీలోని రెండు గ్రూపుల మధ్య విబేధాలతో గురుతర బాధ్యతలు నిర్వర్తించడం చాలా కష్టం. మూడు నెలలుగా జీతం నిలిపి వేశారు. సంప్రదింపులు, సముదాయింపుతో గతవారం పూర్తిగా జీతం చెల్లించారు' అని 49 ఏళ్ల ఎలీనా వివరించారు. 2011లో సీఈఓగా నియమితులైన ఎలీనా హయాంలోనే భారత్‌లో రెండు పురుషుల ప్రపంచకప్‌లు (2018, 2023), రెండు జూనియర్ పురుషుల ప్రపంచకప్‌లు (2016, 2021) విజయవంతంగా నిర్వహించారు.


తుషార్ తనుష్

'శత'క్కొట్టిన తనుష్, తుషార్

పదో వికెట్‌కు 232 పరుగుల భాగస్వామ్యం ● రంజీ ట్రోఫీ సెమీస్‌లో ముంబై

ముంబై: బరోడా, ముంబై జట్ల మధ్య జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో అద్భుతం చోటు చేసుకుంది. ముంబై జట్టుకు చెందిన చివరి వరుస బ్యాటర్లు తనుష్ కొటియన్ (129 బంతుల్లో 120 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), తుషార్ దేశ్‌పాండే (129 బంతుల్లో 123; 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతకాలతో అదరగొట్టారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో (మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజులు జరిగే మ్యాచ్‌లు) ఒకే ఇన్నింగ్స్‌లో పదో నంబర్, పదకొండో నంబర్ బ్యాటర్లిద్దరూ సెంచరీలు చేయడం కేవలం ఇది రెండోసారికాగా, రంజీ ట్రోఫీలో మాత్రం తొలిసారి. 1946లో ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా సర్రే కౌంటీ జట్టుతో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత జట్టు తరఫున పదో నంబర్ ప్లేయర్ చందూ సర్వాతే (124 నాటౌట్), పదకొండో నంబర్ ప్లేయర్ శుతె బెనర్జీ (121) సెంచరీలు చేశారు.

బరోడాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఓవర్‌నైట్ స్కోరు 379/9తో ఆట చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 132 ఓవర్లలో 569 పరుగులకు ఆలౌటైంది. తనుష్, తుషార్ సెంచరీలు చేయడంతోపాటు పదో వికెట్‌కు 232 పరుగుల భాగస్వామ్యం జోడించారు. ఒక పరుగు తేడాతో రంజీ రికార్డును సమం చేసే అవకాశం కోల్పోయారు. 1992 రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో ముంబైతో జరిగిన మ్యాచ్‌లో అజయ్ శర్మ-మణిందర్ సింగ్ పదో వికెట్‌కు 233 పరుగులు జత చేశారు. ముంబై నిర్దేశించిన 606 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బరోడా రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. మ్యాచ్‌లో ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో టీ సెషన్ తర్వాత రెండు జట్ల కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముంబై జట్టు సెమీఫైనల్ చేరుకుంది.

విదర్భ విజయం

నాగ్‌పూర్‌లో కర్ణాటకతో జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో విదర్భ 127 పరుగుల తేడాతో గెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. విదర్భ నిర్దేశించిన 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కర్ణాటక 62.4 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. విదర్భ బౌలర్లు హర్ష్ దూబే (4/65), ఆదిత్య సర్వాతే (4/78) కర్ణాటకను దెబ్బ తీశారు. మార్చి 2 నుంచి జరిగే సెమీఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌తో విదర్భ; తమిళనాడుతో ముంబై తలపడతాయి.

గాయత్రి-ట్రెసా జోడీ గెలుపు



బెర్లిన్: జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడి శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 18-21, 21-11, 21-13తో సు యిన్ హుయ్-లిన్ జి యు (చైనీస్ తైపీ) జంటపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా

నయా కాంబినేషన్


● రజనీకాంత్, సాజిద్ నడియాడ్‌వాలా

రజనీకాంత్ ఇప్పటివరకూ దక్షిణ, ఉత్తరాది, హాలీవుడ్ మూవీ (బ్లడ్ స్టోన్) కలుపుకుని దాదాపు 170 చిత్రాల్లో నటించారు. ఇన్ని సినిమాలు చేసిన ఆయన గత కొన్నేళ్లుగా హిందీ నిర్మాతలతో సినిమాలు చేసింది లేదు. ఇప్పుడు అగ్రనిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాతో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హిందీలో 'హౌస్‌ఫుల్ సిరీస్, 2 స్టేట్స్, హీరో పంతి, కిక్, సూపర్ 30, ఛిచోరే, 83' తదితర చిత్రాలతో పాటు రీసెంట్ హిట్ 'సత్య ప్రేమ్ కీ కథ' చిత్రం నిర్మించారు సాజిద్ నడియాడ్‌వాలా. 'హౌస్‌ఫుల్, హౌస్‌ఫుల్ 2, కిక్' వంటి చిత్రాలకు దర్శకుడు కూడా. ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్-సాజిద్‌ల నయా కాంబినేషన్ సెట్ అయింది. ''ఒక లెజండరీ నటుడితో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను'' అని సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు సాజిద్. కాగా ఇది హిందీ చిత్రమా లేక పాన్ ఇండియన్ ప్రాజెక్టా? ఈ చిత్రానికి దర్శకుడు ఎవరు? వంటి విషయాలను సాజిద్ స్పష్టం చేయలేదు.

మహేశ్ సినిమాకి అతిథిగా...?


● జేమ్స్ కామెరూన్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో దర్శకుడు రాజమౌళికి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. పైగా ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డు ('నాటు నాటు..' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డు) కూడా సాధించడంతో హాలీవుడ్ ప్రముఖుల దృష్టిలో పడ్డారు రాజమౌళి. 'టైటానిక్, అవతార్'లాంటి అద్భుత చిత్రాల సృష్టికర్త జేమ్స్ కామెరూన్ అయితే 'ఆర్ఆర్ఆర్'ని, రాజమౌళి మేకింగ్‌ని ప్రశంసించారు కూడా. రాజమౌళిలోని మేకర్ అంటే కామెరూన్‌కి మంచి అభిమానం ఏర్పడిందని ఆయన మాటలు స్పష్టం చేశాయి. ఆ అభిమానంతోనే రాజమౌళి ఆహ్వానానికి కామెరూన్ పచ్చజెండా ఊపారని టాక్. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ప్రపంచ దేశాల్లోని పలు భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. బడ్జెట్ రూ. వెయ్యి కోట్లు అని భోగట్టా. ఇంత భారీ చిత్రం కాబట్టే ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కామెరూన్‌ని ఆహ్వానించారని టాక్. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తి కావచ్చిన నేపథ్యంలో త్వరలో సినిమాని ఆరంభించాలనుకుంటున్నారట. సో.. వార్తల్లో ఉన్న ప్రకారం కామెరూన్‌ని రాజమౌళి ఆహ్వానించారా లేదా అనేది త్వరలోనే తెలిసిపోతుంది.



"ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్‌లో ఒక ఫ్లైట్ సిమ్యులేటర్‌లో నన్ను కూర్చోబెట్టి రియల్ లైఫ్ ప్రొజెక్షన్ అనుభూతిని ఇచ్చేలా చేశారు. అందులో కూర్చుంటే నిజంగా విమానం నడిపినట్లే ఉంటుంది. ముఖానికి ఆక్సిజన్ మాస్క్, తలకు హెల్మెట్ ఉండటంతో కళ్లతోనే భావోద్వేగాలు పలికించాలి. ఇలాంటి పాత్రలు చేయడం ఒక సవాల్‌గా అనిపించింది" అన్నారు వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్‌పై ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ చెప్పిన విశేషాలు.

ప్రతి భారతీయుడు కనెక్ట్ అయ్యే సినిమా ఇది

- వరుణ్ తేజ్

'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రీకరణ అక్టోబర్‌లో పూర్తయింది. ఆ తర్వాత బ్రేక్ తీసుకుని నవంబరులో లావణ్యా త్రిపాఠిని పెళ్లి చేసుకున్నాను. ఈ సినిమా కోసం హిందీ డైలాగులు నేర్చుకుంటున్నప్పుడు తను కూడా సాయం చేసింది. మా ఇద్దరికీ సరిపడే పాత్రలు ఉంటే కచ్చితంగా మళ్లీ జోడీగా నటిస్తాం (గతంలో 'మిస్టర్', 'అంతరిక్షం' సినిమాలు చేశారు).. అంతేకానీ, ఏదో మేమిద్దరం కలిసి చేసేయాలనే ఉద్దేశంతో మాత్రం చేయం.

● 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రకథని శక్తి ప్రతాప్ సింగ్ 2020లో చెప్పాడు.. వినగానే నచ్చింది. శక్తి హిందీ అబ్బాయి అయినప్పటికీ ఈ సినిమాని తెలుగులోనే చేయాలని అనుకున్నాడు. నేను సోనీ పిక్చర్స్ వారితో ఓ సినిమా చేయాల్సి ఉండటంతో ఈ చిత్రకథను వారికి పంపించాను. నేషనల్ అప్పీల్ కంటెంట్ ఉన్న ఈ కథ సోనీ పిక్చర్స్ వారికి కూడా బాగా నచ్చడంతో హిందీలో కూడా చేయాలని నిర్ణయించాం. ద్విభాషా చిత్రంగా రూపొందిన ఈ మూవీలోని ప్రతి సీన్‌ని తెలుగు, హిందీ భాషల్లో చిత్రీకరించాం. ● 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రంలో రుద్ర పాత్రలో కనిపిస్తాను. కొందరు రియల్ ఎయిర్ ఫైటర్స్ స్ఫూర్తితో నా పాత్రని చాలా అద్భుతంగా డిజైన్ చేశాడు శక్తి ప్రతాప్. నా పాత్రతో అందరూ చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఈ సినిమా కోసం శక్తి చాలా పరిశోధన చేశాడు. తనకి వీఎఫ్ఎక్స్‌పై కూడా మంచి పట్టు ఉంది. ● 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో 40మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దానికి కారణమైన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత వైమానిక దళం ఓ ఆపరేషన్ నిర్వహించి, శత్రువులకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. ఫిబ్రవరి 14న ప్రపంచమంతా వాలెంటైన్స్ డే జరుపుకుంటుంది. అయితే ఫిబ్రవరి 14న ఈ ఘటన జరిగింది కాబట్టి మా సినిమాకి 'ఆపరేషన్ వాలెంటైన్' టైటిల్ పెట్టాం. ఈ సినిమాలో వాలెంటైన్ అంటే ప్రతి ఒక్కరికీ దేశం మీద ఉన్న ప్రేమ అని అర్థం. మా సినిమా చూసిన ఎయిర్ ఫోర్స్ అధికారులు పుల్వామా ఘటనపై ఇప్పటి వరకూ వచ్చిన సినిమాల్లో 'ఆపరేషన్ వాలెంటైన్' ది బెస్ట్ అని ప్రశంసించారు. ప్రతి భారతీయుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ● 'ఆపరేషన్ వాలెంటైన్'ని తెలుగు, హిందీ భాషల్లో చేశాం. హిందీలో డైలాగులు చెప్పేందుకు రెండు నెలలు క్లాసులు తీసుకున్నాను. హిందీలో నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పాను. ఇక ప్రస్తుతం 'మట్కా' సినిమా చేస్తున్నాను.

కథ వినగానే ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లా!

- 'దిల్' రాజు


● 'దిల్' రాజు, వైష్ణవీ చైతన్య, అరుణ్ భీమవరపు

''లవ్ మీ' కథ వినగానే ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లా. 'ఆర్య' కథ విన్నప్పుడు ఎలా ఎగ్జైట్ అయ్యానో 'లవ్ మీ' స్క్రిప్ట్ విన్నాక అలాగే ఎగ్జైట్ అయ్యాను. ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రాబట్టుకుంటుందని నమ్మకంగా ఉంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యూ డేర్' అనేది ఉపశీర్షిక. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ని విడుదల చేసి, సినిమాని ఏప్రిల్ 27న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. 'దిల్' రాజు మాట్లాడుతూ- ''లవ్ మీ' కథ నచ్చి, సంగీత దర్శకుడు కీరవాణిగారు, కెమెరామేన్ పీసీ శ్రీరామ్‌గారు ఈ మూవీకి పని చేశారు. వైష్ణవి ఈ స్క్రిప్ట్ చదివి ఎగ్జైట్ అయింది. ఆశిష్‌కి చక్కగా సరిపోయే కథ ఇది. తొలి సినిమా 'బలగం'తో హిట్ అందుకున్న హర్షిత్, హన్షిత 'లవ్ మీ'తోనూ విజయం అందుకోవాలి'' అన్నారు. ''మా సినిమా చూసిన ప్రేక్షకులు కొత్త అనుభూతితో బయటకు వస్తారు'' అన్నారు వైష్ణవీ చైతన్య. అరుణ్ భీమవరపు, హర్షిత్ రెడ్డి, నాగ మల్లిడి పాల్గొన్నారు.

అది చాలా నిజం!

- వీడీలాంటి భర్త కావాలి


● రష్మిక

''రష్మికా మందన్నాకి భర్తగా రావాలంటే అతనికి ఏయే లక్షణాలు ఉండాలి? ఆమె నేషనల్ క్రష్ కాబట్టి ఆమె భర్త ప్రత్యేకంగా ఉండాలి. చెప్పాలంటే ఆమె భర్త వీడీలా ఉండాలి.. అంటే 'వెరీ డేరింగ్'.. ఆమెను చక్కగా చూసుకోవాలి. మేం ఆమెను రాణి అని పిలుస్తాం. ఆమె భర్త రాజులా ఉండాలి'' అంటూ సోషల్ మీడియా వేదికగా రష్మికా మందన్నా అభిమాని షేర్ చేశాడు. ఆ పోస్ట్‌కి 'అది.. చాలా నిజం' అని రష్మిక స్పందించడం హాట్ టాపిక్ అయింది. అంటే.. ఆ అభిమాని పేర్కొన్నట్లు తనకు వీడీలాంటి భర్త కావాలని ఈ బ్యూటీ స్పష్టం చేశారు. ఇక.. 'వీడీ' అంటే విజయ్ దేవరకొండ అంటూ పలువురు నెటిజన్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ విధంగా ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

హారర్ వార్డ్


● గణేశ్, గాయత్రి

గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భవానీ వార్డ్'. జీడీ నరసింహ దర్శకత్వం వహించారు. సాయి సతీష్, 'జబర్దస్త్' అప్పారావు, ఈశ్వర్ బాబు ధూళిపూడి కీలక పాత్రలు చేశారు. కల్యాణ్ చక్రవర్తి, చంద్రకాంత్ సోలంకి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. జీడీ నరసింహ మాట్లాడుతూ- ''హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'భవానీ వార్డ్'. అందరికీ నచ్చేలా ఈ మూవీ తీశాను. మరీ ముఖ్యంగా హారర్ సినిమాలను ఇష్టపడే వారికి బాగా నచ్చుతుంది'' అన్నారు. ''నరసింహ చెప్పిన కథ నాకు చాలా నచ్చి, ఈ సినిమా నిర్మించాను'' అన్నారు కల్యాణ్ చక్రవర్తి.

వినోదాలు పంచే చారి


● అదితీ సోని, కీర్తికుమార్, సంయుక్త

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతోంది. అదితీ సోనీ మాట్లాడుతూ- ''నిర్మాతగా 'చారి 111' నా తొలి సినిమా. వైవిధ్యమైన కథతో తీసిన మంచి వినోదాత్మక చిత్రమిది'' అన్నారు. ''మళ్ళీ మొదలైంది' సినిమా తర్వాత నేను చేసిన ద్వితీయ చిత్రం 'చారి 111'. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్'' అన్నారు టీజీ కీర్తికుమార్. ''ఈ సినిమాలో ఒక్కటే పాట ఉంది. ఈ పాటని అద్భుతంగా రాయడానికి మూడు నెలల సమయం తీసుకున్నాను'' అన్నారు రామజోగయ్య శాస్త్రి. ''తెలుగులో నాకు తొలి చాన్స్ ఇచ్చిన యూనిట్‌కి థ్యాంక్స్'' అన్నారు సంయుక్తా విశ్వనాథన్. ''ఈ సినిమాకు మ్యూజిక్ అందించడం హ్యాపీగా ఉంది'' అన్నారు సైమన్ కె. కింగ్.

అనుమానం అక్కర్లేదు

- శ్రీవిష్ణు


● రాహుల్, శ్రీవిష్ణు, సునీల్ బలుసు, ప్రియదర్శి, అయేషా

''గుప్త నిధుల కోసం ముగ్గురు శాస్త్రవేత్తలు ఏం చేశారు? అనే నేపథ్యంలో 'ఓం భీమ్ బుష్' ఆసక్తిగా ఉంటుంది. మా పాత్రలకు (శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి) ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. రెండు గంటల పాటు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతారు.. ఆ విషయంలో అనుమానం అక్కర్లేదు'' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ లీడ్ రోల్స్‌లో యూవీ క్రియేషన్స్ సమర్పణలో వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ సినిమా మార్చి 22న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ- ''టీజర్ అందరికీ నచ్చడం హ్యాపీగా ఉంది. సినిమా ఇంకా అద్భుతంగా ఉంటుంది'' అన్నారు. ''ఈ సినిమా కోసం ఏడాదిన్నర కష్టపడ్డాం. మా కష్టానికి తగ్గ ఫలితం దక్కాలంటే ప్రేక్షకులు చూడాలి'' అన్నారు రాహుల్ రామకృష్ణ. ''మా సినిమాని అందరూ చూడాలి'' అన్నారు శ్రీహర్ష కొనుగంటి.

సాక్షి బిజినెస్
బుధవారం
28-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్	▲ 305	73,095
నిఫ్టీ	▲ 76	22,198

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,997	▲ 21
డోజోన్స్	38,903	▽ 166
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,686	▽ 1
డాక్స్	17,556	▲ 133
షాంఘై	3,015	▲ 133
నికాయ్	39,240	▲ 6

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,271
బంగారం (99.5 స్వచ్ఛత)	62,022
వెండి (కేజీ)	69,902

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.48	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.94	106.51
€	యూరో	ఎస్‌బీఐ	88.89	91.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.53	55.76
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.26	55.17
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.38	64.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.09	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.46
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.47

తుది దశకు చైనా రుణ యాప్‌లపై దర్యాప్తు

కార్పొరేట్ వ్యవహారాల శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు ఎదుర్కొంటున్న పలు చైనా కంపెనీలపై, ముఖ్యంగా రుణ యాప్‌లతో లింకులున్న సంస్థలపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ విచారణ జరుపుతోంది. వీటిలో కొన్ని కేసుల్లో దర్యాప్తు తుది దశలో ఉందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆయా కంపెనీల్లో మోసాలేమైనా జరిగాయా అనే కోణంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. కొన్నింటిపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో) విచారణ జరుపుతున్నట్లు వివరించారు. అక్రమంగా రుణ యాప్‌లను నిర్వహిస్తున్న కంపెనీలపై, అసలైన లబ్ధిదారు వివరాలను దాచి పెట్టే వ్యక్తులు, సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ .. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ, ఆర్‌బీఐ మొదలైన వాటి నుంచి వచ్చిన ఫిర్యాదులపై సదరు సంస్థలపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారి చెప్పారు. కొన్ని కంపెనీల నిధుల మూలాలను కనుగొనడం కష్టమే అయినప్పటికీ, నిర్దిష్టంగా లబ్ధి పొందే యాజమాన్య సంస్థను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్-ఆర్‌క్యాప్ ప్రణాళికకు ఓకే..

బ్యాంకులకు 63 % హెయిర్‌కట్

ముంబై: రుణభారంతో కుంగిన రిలయన్స్ క్యాపిటల్‌కి సంబంధించి హిందుజా–ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ ప్రతిపాదించిన రూ. 9,650 కోట్ల పరిష్కార ప్రణాళికకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం కంపెనీ రుణదాతలు భారీగా 63% రుణాలను వదులుకోవాల్సి వస్తుంది. అలాగే, ప్రణాళిక అమల్లో భాగంగా ఆర్‌క్యాప్ షేర్లను ఇండస్‌ఇండ్‌కు బదలాయించాక, దాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి తొలగిస్తారు. మొత్తం రూ. 38,526 కోట్ల రుణాల క్లెయిమ్‌లకు గాను ఎన్‌సీఎల్‌టీ రూ. 26,086 కోట్ల క్లెయిమ్‌లనే అనుమతించింది. కానీ, 2023 జూన్‌లో బిడ్ వేసిన ఇండస్‌ఇండ్ అందులో రూ. 9,661 కోట్లు (37%) కడతానని ప్రతిపాదించింది.

జీఆర్‌టీ జ్యువెలర్స్ చెవి రింగుల సంబరాలు

హైదరాబాద్: ప్రతిష్టాత్మక జీఆర్‌టీ జ్యువెలర్స్ చెవి రింగుల సంబరాలు నిర్వహిస్తోంది. కస్టమర్ల వ్యక్తిగత శైలికి పెద్దపీట వేస్తూ, క్లాసిక్ డిజైన్ల నుంచి సమకాలీన ట్రెండ్‌ల వరకు చేతితో తయారు చేసిన చెవిరింగులను అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా పాత బంగారు ఆభరణాల మారిడిపై గ్రాముకు అదనంగా రూ.50లు, కొత్త బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50లు తగ్గింపు ఆఫర్ ప్రకటించింది. చెవిరింగుల సంబరాలతో అద్భుతమైన చెవిపోగుల సేకరణను ఆవిష్కరించడానికి సంతోషిస్తున్నామని సంస్థ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. సౌందర్యం, ఆకర్షణ కలబోసిన గొప్ప వేడుకకు ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు మరో ఎండీ రాధాకృష్ణన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-2-2024	
విశాఖ	500-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
27-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

ఆటో, ఐటీ షేర్ల జోరు



- నష్టాల్లోంచి లాభాల్లోకి సూచీలు
- సెన్సెక్స్ లాభం 305 పాయింట్లు
- 76 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- కలిసొచ్చిన ప్రపంచ మార్కెట్ల రికవరీ

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు రెండు రోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, ఆటో షేర్లు రాణించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ర్యాలీ కలిసిరావడంతో మంగళవారం అరశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 305 పాయింట్లు పెరిగి 73,095 వద్ద నిలిచింది. నిఫ్టీ 76 పాయింట్లు బలపడి 22,200 స్థాయి చేరువలో 22,198 వద్ద స్థిరపడింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ప్రథమార్థంలో నష్టాలతో ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి ఐటీ, ఆటో, మెటల్, ఫార్మా, ప్రైవేట్ బ్యాంకుల షేర్లు రాణించడంతో నష్టాల్లోంచి లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 371 పాయింట్లు దూసుకెళ్లి 73,161 వద్ద, నిఫ్టీ 96 **పాయింట్లు పెరిగి 22,218 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. కమోడిటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, టెలీ కమ్యూనికేషన్, యుటిలిటీ, ఇంధన షేర్లు అమ్మకాల** ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.25 %, 0.10 % నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,509 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,861 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు అరశాతం లాభంతో ట్రేడవుతున్నాయి. కాగా పేటీఎం షేరు ఆరంభ లాభాలు నిలుపుకోలేకపోయింది. ఇంట్రాడేలో 5% ఎగసి రూ.449 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. అయితే ఆరంభ లాభాలు నిలుపుకోవడంలో విఫలమైంది. చివరికి 0.11% నష్టపోయి రూ. 427.50 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో రూ.449 వద్ద గరిష్టాన్ని, రూ.413.55 వద్ద కనిష్టాన్ని తాకింది. టీసీఎస్ షేరు 2.50% ర్యాలీ చేసి రూ.4103 వద్ద ముగిసింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ ఈ షేరు **రేటింగ్‌ను 'న్యూట్రల్' నుంచి 'బై'కు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు టార్గెట్ ధరను రూ.4,000 నుంచి రూ.4,700కు పెంచింది. ట్రేడింగ్‌లో 3.25% పెరిగి రూ.4,125 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.**

దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతాయ్

కార్పొరేట్లపై సీతారామన్ విశ్వాసం



సదస్సులో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు గ్రీన్ సర్టిఫికెట్ అందిస్తున్న ఫిక్కీ ప్రెసిడెంట్ అనీష్ షా

న్యూఢిల్లీ: కార్పొరేట్ ప్రపంచం దేశాభివృద్ధి లక్ష్యాలతో మమేకం అవుతుందన్న విశ్వాసమున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తద్వారా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవించడంలో భాగస్వాములవుతాయని తెలియజేశారు. వెరసి శత వసంత స్వాతంత్ర్య దినోత్సవ (2047) సమయానికల్లా వికసిత్ భారత్‌గా ఆవిర్భవించే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. భవిష్యత్ తరాలకు అత్యుత్తమ భారత్‌ను అందించే బాటలో ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్‌ను సాధించేందుకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించినట్లు పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ @ 2047: వికసిత్ భారత్–ఇండస్ట్రీ' పేరుతో ఫిక్కీ నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. 2047కల్లా లక్ష్యాలను సాధించడంలో పారిశ్రామిక రంగం పాత్ర కీలకమన్నారు.

నవభారతానికి స్టార్టప్‌లే వెన్నెముక: గోయల్



న్యూఢిల్లీ: నవభారత నిర్మాణానికి అంకుర సంస్థలే వెన్నెముకలాంటివని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 2047 నాటికి 35 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఎదిగే క్రమంలో దేశం అందించే అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఏ ఒక్కదాన్ని చేజార్చుకోవద్దని **స్టార్టప్‌లకు సూచించారు. స్టార్టప్ మహాకుంభ్ కర్టెన్ రైజర్** కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. దేశాభివృద్ధిలో కీలకమైన స్టార్టప్ విప్లవానికి వచ్చే నెల 18 నుంచి మూడు రోజులు జరిగే మహాకుంభ్ దర్పణంగా నిలుస్తుందని గోయల్ చెప్పారు. దేశీయంగా మనకు అతి పెద్ద మార్కెట్ ఉంది కదా అని నింపాదిగా ఉండకూడదని, అంతర్జాతీయ మార్కెట్లలోనూ కార్యకలాపాలను విస్తరించడంపై అంకుర సంస్థలు మరింతగా దృష్టి పెట్టాలని మంత్రి చెప్పారు. ఎంట్రప్రెన్యూర్ షిప్, ఆవిష్కరణలపై ఆసక్తి గల విద్యార్థులు ఈ సదస్సులో పెద్ద ఎత్తున **పాల్గొంటారని ఈ సందర్భంగా తెలిపారు.**

మారుతీ సుజుకీ డీలర్లకు యూనియన్ బ్యాంక్ రుణం

న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తాజాగా యూనియన్ బ్యాంక్‌తో ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా మారుతీ సుజుకీ డీలర్లకు యూనియన్ బ్యాంక్ రుణ సాయం చేస్తుంది. దేశవ్యాప్తంగా 4,000 పైచిలుకు మారుతీ విక్రయశాలల్లో వాహనాల నిల్వకు కావాల్సిన నిధుల సమీకరణ అవకాశాలను ఈ భాగస్వామ్యం మెరుగుపరుస్తుందని సంస్థ మంగళవారం ప్రకటించింది. డీలర్ నెట్‌వర్క్‌ను పెంపొందించడంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.



2008 నుంచి మారుతీ సుజుకీ, యూనియన్ బ్యాంక్ మధ్య బంధం కొనసాగుతోంది. 3,00,000 పైచిలుకు కస్టమర్లకు యూనియన్ బ్యాంక్ వాహన రుణం సమకూర్చింది.

వొడాఫోన్ ఐడియా నిధుల బాట

రూ. 45,000 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్ ఐడియా భారీ స్థాయిలో నిధుల సమీకరణ చేపట్టనుంది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీలు, ఇతర రుణ మార్గాల ద్వారా రూ. 45,000 కోట్లు సమీకరించేందుకు కంపెనీ బోర్డు తాజాగా ఆమోదముద్ర వేసింది. రూ. 2.1 లక్ష కోట్ల భారీ రుణ భారంతో కుదేలైన కంపెనీ మనుగడ కోసం పలు సమస్యలను ఎదుర్కొంటోంది. త్రైమాసిక వారీగా నష్టాలు ప్రకటించడంతోపాటు.. వినియోగదారులను కోల్పోతోంది.

ఏప్రిల్‌లో బోర్డ్ భేటీ...



నిధుల సమీకరణ నిర్వహణ కోసం బ్యాంకర్లను ఎంపిక చేసేందుకు యాజమాన్యానికి అధికారాలనిస్తూ బోర్డు తీర్మానించింది. దీనిలో భాగంగా ఏప్రిల్ 24న వాటాదారుల సమావేశాన్ని నిర్వహించనుంది. వాటాదారుల అనుమతి తదుపరి త్రైమాసికంలో ఈక్విటీ నిధుల సమీకరణను పూర్తి చేయనున్నట్లు వొడాఫోన్ ఐడియా తెలియజేసింది.

వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 6% పతనమై రూ. 16 దిగువన ముగిసింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణలో 563 గ్రూప్-1 పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. గ్రూప్–1 పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 563

అర్హత

» ఆర్టీవో పోస్టుకు మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మిగతా పోస్టులన్నింటికీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఏసీఎల్ పోస్టులకు డిగ్రీతోపాటు సోషల్ వర్క్‌లో పీజీ చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తారు.

» **వయసు:** యూనిఫామ్ సర్వీసులైన డీఎస్పీ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్), పోస్టులకు 35 ఏళ్లు కాగా, మిగిలిన పోస్టులకు 46 ఏళ్లు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల వరకు, దివ్యాంగులకు పదేళ్లు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

» **ఓటీఆర్ తప్పనిసరి:** కమిషన్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్)లో నమోదైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ఓటీఆర్ లేని వారు కొత్తగా నమోదు చేసుకోవాలి. ప్రతి అభ్యర్థి దరఖాస్తులో తన ఓటీఆర్, మొబైల్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి.

ఎంపిక విధానం

ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ప్రాథమిక (ప్రిలిమినరీ) పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో 150 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో అర్హత పొందిన వారికి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు.

» **మెయిన్స్ పరీక్ష:** ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. జనరల్ ఇంగ్లిష్ 150 మార్కులు, పేపర్–1 సమకాలీన అంశాలపై సాధారణ వ్యాసం (జనరల్ ఎస్సే)–150 మార్కులు, పేపర్–2 చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం–150 మార్కులు, పేపర్–3 భారతీయ సమాజం, రాజ్యాంగం, పాలన–150, పేపర్–4 ఆర్థిక శాస్త్రం, అభివృద్ధి–150 మార్కులు, పేపర్–5 సైన్స్, టెక్నాలజీ అండ్ డెటా ఇంటర్‌ప్రిటేషన్–150, పేపర్–6 తెలంగాణ ఆలోచన(1948–70), సమీకరణ దశ(1971–90), తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వైపు(1991–2014)–150 మార్కులు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తులకు చివరితేది:** 14.03.2024.
» **దరఖాస్తుల్లో సవరణలకు అవకాశం:** 23.03.2024 ఉదయం 10 గంటల నుంచి 27.03.2024 సాయంత్రం 5 గంటల వరకు;
» **ప్రాథమిక పరీక్ష:** 2024, జూన్ 9
» **మెయిన్స్:** సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
» **వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 3000 అప్రెంటిస్‌లు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్.. దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3000
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–100, తెలంగాణ–96.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. **వయసు:** 31.03.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్, బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్, బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్, బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్, బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 06.03.2024
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 10.03.2024.
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 490 పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 490
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్)–03, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇంజనీరింగ్–సివిల్)–90, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇంజనీరింగ్–ఎలక్ట్రికల్)–106, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రానిక్స్)–278, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)–13.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్–2024 స్కోరు ఉండాలి. **వయసు:** 01.05.2024 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 1,40,000.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.05.2024.
» **వెబ్‌సైట్:** www.aai.aero

ఆతిథ్య రంగం.. అవకాశాలు పదిలం!

» ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ–2024కి నోటిఫికేషన్ విడుదల
» బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశం
» ఈ కోర్సు పూర్తి చేసుకుంటే ఆతిథ్య రంగంలో ఉపాధి అవకాశాలు
» ఇంటర్మీడియెట్‌తో ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈకి దరఖాస్తు చేసుకోవచ్చు

ఆతిథ్య రంగం.. వేగంగా విస్తరిస్తూ యువతకు ఉపాధి కల్పిస్తున్న రంగం! జాబ్ మార్కెట్‌లో ఆతిథ్య రంగ నిపుణులకు ఎంతో డిమాండ్ ఉంది. హాస్పిటాలిటీ రంగంలో కెరీర్ కోరుకునే విద్యార్థులు హోటల్ మేనేజ్‌మెంట్, అనుబంధ కోర్సుల్లో.. చేరేందుకు మార్గం.. ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ!! ఇందులో ర్యాంకు సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో ఐహెచ్‌ఎం, రాష్ట్ర స్థాయిలో ఎస్‌హెచ్‌ఐఎం క్యాంపస్‌లలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్‌లో అడుగు పెట్టొచ్చు. తాజాగా.. 2024కు సంబంధించి ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈతో ప్రవేశం కల్పించే కోర్సు, దరఖాస్తుకు అర్హతలు, ప్రవేశ పరీక్ష విధానం, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం..



ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ 2024

ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక చాలా మంది ఇంజనీరింగ్ వైపు దృష్టి సారిస్తున్నారు. దీనికి కారణం .. విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తాయనే అభిప్రాయమే. అదే అర్హతతో మరెన్నో వినూత్న కోర్సులు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైంది బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్‌గా పేర్కొనొచ్చు. కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని ఐహెచ్‌ఎంలలో ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. హాస్పిటాలిటీ రంగంలో ఉపాధి అవకాశాలు పొందొచ్చు అంటున్నారు నిపుణులు.

హాస్పిటాలిటీలో నిపుణుల కోసం

దేశంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్ తదితర కోర్సులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్‌లు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దే ఉద్దేశంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యాసంస్థ.. ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం). ఈ క్యాంపస్‌లలో.. బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును అందిస్తున్నారు. వీటిల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ.

78 ఇన్‌స్టిట్యూట్‌లు.. 12 వేల సీట్లు

ప్రస్తుతం జాతీయ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లోని 78 హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 11,995 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో 21 ఇన్‌స్టిట్యూట్‌లు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 30 ఇన్‌స్టిట్యూట్‌లు,24 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు, పీపీపీ విధానంలో రాష్ట్ర స్థాయిలో రెండు ఎస్‌హెచ్‌ఐఎం, ఒక పీఎస్‌యూ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్‌లలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు అందుబాటులో ఉంది. వీటి పర్యవేక్షణకు జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ సంస్థను కూడా పర్యాటక శాఖ ఏర్పాటు చేసింది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ ఇలా

ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో 200 ప్రశ్నలకు జరుగుతుంది. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ (30 ప్రశ్నలు), రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ (30 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ (30 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (60 ప్రశ్నలు), ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ (50 ప్రశ్నలు)ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.

ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్

ఎన్‌సీఏహెచ్‌ఎం–జేఈఈ ఫలితాల తర్వాత సీట్ల భర్తీకి ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకుని తమ ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలతో ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేస్తే..అందుబాటులో ఉన్న సీట్లు, అప్లికేషన్లు, విద్యార్థులు పొందిన ఎంట్రన్స్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తారు. గత ఏడాది రెండు రౌండ్లలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

కొలువులు ఇవే

బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి విస్తృత కొలువులు లభిస్తున్నాయి. గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్, ఫ్రంట్ డెస్క్ మేనేజర్, కిచెన్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ మేనేజర్, సర్వీస్ ఎగ్జిక్యూటివ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ట్రిప్ అడ్వైజర్, బ్యాక్ ఎండ్ ఎగ్జిక్యూటివ్స్, చెఫ్స్ వంటి పలు ఉద్యోగాలు అందుకునే వీలుంది. ప్రారంభంలో సగటున రూ.నాలుగు లక్షల నుంచి రూ.అయిదు లక్షల వేతనం లభిస్తోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 31
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2024 ఏప్రిల్ 2 – ఏప్రిల్ 5
- పరీక్ష తేదీ: 2024, మే 11
- వెబ్‌సైట్: https://exams.nta.ac.in/NCHM/, www.nta.ac.in

బెస్ట్ స్కోర్‌కు మార్గం ఇలా

న్యూమరికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటిక్స్‌లో బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. అభ్యర్థులు హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా శాతాలు, లాభ–నష్టాలు, నెంబర్ సిస్టమ్, సగటు, కాలం–పని, సాధారణ వడ్డీ, బారు వడ్డీ, కాలం–వేగం–దూరం, నిష్పత్తులు, జామెట్రీ వంటి వాటిపై పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్ కోసం నిర్దిష్టంగా డేటాను విశ్లేషించగలిగే సామర్థ్యం, డేటాలోని ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చిన ప్రశ్నకు అనువుగా, సమాధానం ఇచ్చే స్కిల్ సొంతం చేసుకోవాలి.

రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్

సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగమిది. ఇందులో మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే.. మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్ వంటి రీజనింగ్ ఆధారిత అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా డేటా సఫిషియన్సీ, వెన్ డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

ఈ విభాగంలో మంచి మార్కులు పొందాలంటే.. స్కూల్ స్థాయిలోని చరిత్ర, రాజ్యాంగం, జాగ్రఫీ, ఎకనామిక్స్ పాఠ్యాంశాలు చదవాలి. హిస్టరీలో ముఖ్యమైన యుద్ధాలు–పరిణామాలు–పర్యవసానాలు, స్వాతంత్ర్యోద్యమం వంటి అంశాలపై అవగాహన లాభిస్తుంది. జాగ్రఫీలో దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలు, ఖనిజ వనరులు–అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్ కోసం ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, ఇటీవల కాలంలో అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, ప్రిపోజిషన్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, యాంటానిమ్స్, సినానిమ్స్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. దీని కోసం బేసిక్ గ్రామర్ పుస్తకాలను అధ్యయనం చేయడంతోపాటు దినపత్రికలు చదవడం, వాటిలోని కొత్త పదాలను తెలుసుకోవడం, ఆ పదాలను వినియోగించిన తీరుపై అవగాహన ఏర్పరచుకోవడం వంటివి లాభిస్తాయి.

ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈలో ప్రత్యేకమైన విభాగంగా ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగాన్ని పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అభ్యర్థికి ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న ఆసక్తి, దృక్పథాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఘటన లేదా అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలు అభ్యర్థుల్లో ఎదుటి వారిని మెప్పించే తీరు, సందర్భానికి తగినట్లు వ్యవహరించే శైలికి సంబంధించి ఉంటాయి.

క్లుప్తంగా...

ముగిసిన మిలాన్-2024

- చివరి రోజు ఆకట్టుకున్న యుద్ధ విన్యాసాలు
- నేడు తిరుగు ప్రయాణం కానున్న 51 దేశాల ప్రతినిధులు, యుద్ధ నౌకలు





సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్-2024లో సీ ఫేజ్ విన్యాసాలు మంగళవారం ముగిశాయి. రెండు రోజుల పాటు విశాఖ సాగర తీరానికి 40 కిలోమీటర్ల దూరంలో సముద్ర జలాల్లో తొలి రోజున యుద్ధ నౌకల మధ్య రణరంగం, రెండో రోజు సాగరజలాలు, ఉపరితల యుద్ధ విన్యాసాలు నిర్వహించారు. చివరి రోజున వాణిజ్యంలో సముద్రపు దొంగల బారి నుంచి ఎలా బయటపడాలి.. శత్రువుల బారి నుంచి రక్షించేందుకు మిత్ర దేశాల నౌకాదళాల సహాయం ఎలా తీసుకోవాలనే అంశాలపై వివరిస్తూ విన్యాసాలు నిర్వహించారు. భారత్, ఆస్ట్రేలియా, రష్యా, యూఎస్, జపాన్, శ్రీలంక, మయన్మార్, మలేషియా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, సింగపూర్ తదితర దేశాలకు చెందిన నేవీ బృందాలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. మిలాన్ భాగస్వామ్య దేశాలు బుధవారం నుంచి తమ ప్రాంతాలకు బయలు దేరనున్నాయి. మంగళవారం రాత్రి 51 దేశాల ప్రతినిధులకు భారత నౌకాదళం వీడ్కోలు ఆతిథ్యాన్ని అందించింది.

'స్కిల్' కేసులో అప్రూవర్ పిటిషన్ విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో అప్రూవర్ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితుడు (ఏ13)గా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆయన దాఖలు చేసిన పిటిషన్ కాపీ తమకు కావాలని ఈ కేసులో ఏ2గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ పిటిషన్ దాఖలు చేయడంపై సీఐడీ తరపు న్యాయవాదులు మంగళవారం న్యాయస్థానంలో విచారణ సందర్భంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రకాంత్ షా అప్రూవర్ వాంగ్మూలాన్ని నమోదు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసు విచారణను న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసింది.

పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, అమరావతి: పురపాలక పట్టణాభివృద్ధి పరిధిలో పనిచేస్తున్న 24 మంది మున్సిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాదు కాదన్నా కట్టుకథలేనా?

పర్యాటకాభివృద్ధిని అడ్డుకోవడానికి పచ్చ మీడియా తంటాలు

- విశాఖలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను డీ-లింక్ చేస్తున్నట్లు అధికారులు వీడియో రిలీజ్
- అందులో ఉద్యోగులు బ్రిడ్జ్, ప్లాట్‌ఫాంను విడదీస్తున్నట్లు స్పష్టంగా దృశ్యాలు
- అయినప్పటికీ తెగిపోయిందంటూ తప్పుడు కథనాలు
- ప్రతి 15 రోజులకొకసారి బ్రిడ్జ్ నుంచి ప్లాట్‌ఫాం విడదీసి పరిశీలన
- సందర్శకుల రక్షణ కోసం 10 మంది లైఫ్‌గార్డులు, రెండు మోటర్ పడవలు సిద్ధం
- శాస్త్రీయ అధ్యయనం తరువాతే బీచ్ రోడ్డులో ఏర్పాటు
- తెగిపోయిందన్న వార్తలో వాస్తవంలేదు.. లంగరు వేశాం
- జిల్లా కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ. మల్లికార్జున వెల్లడి



విశాఖ సిటీ: విశాఖపై పచ్చపత్రికలు మరోసారి పూనకం వచ్చినట్లుగా ఊగిపోయాయి. విషపు రాతలతో రెచ్చిపోయాయి. జిల్లా అభివృద్ధిని జీర్ణించుకోలేక విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు.. ఇష్టానుసారం బురదజల్లాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా చేపడుతున్న ప్రాజెక్టులపై దుష్ప్రచారాలకు వలువలన్నీ విప్పేశాయి. నిత్యం అభాసుపాలవుతున్నా సిగ్గూఎగ్గూ లేకుండా అబద్ధాలనే అచ్చేస్తూ పైశాచికానందం పొందుతున్నాయి. తాజాగా.. విశాఖ నగరంలో చోటుచేసుకున్న ఓ చిన్న సంఘటనను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు తెగ ఆరాటపడ్డ పచ్చ మీడియా చివరికి బొక్కబోర్లా పడి తమ పరువును తీసుకున్నాయి. ఇక్కడ సాగర తీరంలో కొత్తగా ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి పటిష్టతను పరిశీలించేందుకు బ్రిడ్జి నుంచి ప్లాట్‌ఫాంను డీ-లింక్ చేస్తే బ్రిడ్జి తెగిపోయిందంటూ చేతికొచ్చింది రాసిపారేశాయి. బ్రిడ్జి సిబ్బంది డీ-లింక్ చేస్తున్న వీడియోను అధికారులు విడుదల చేసినప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా వాస్తవాలను సమాధి చేస్తూ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాల్జేయడమే పనిగా పెట్టుకుని అప్పటికప్పుడు కట్టుకథలు అల్లేశాయి. పచ్చపత్రికల విషపు రాతలపై 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..

శాస్త్రీయ అధ్యయనాలు చేశాకే..

పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు విశాఖ బీచ్ రోడ్డులో సముద్ర అధ్యయన శాస్త్రవేత్తల సూచనలతో.. ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకునేలా పూర్తి భద్రతా ప్రమాణాలతో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) సంకల్పించింది. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియానికి సమీపంలో దీనిని ఏర్పాటుచేశారు. దేశంలో ఈ తరహా ప్రాజెక్టుల తీరును పరిశీలించేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ (కాలికట్) వద్ద బేపూర్ తీరంలోను, త్రిస్సూర్ నగరంలోని చావక్కడ్ తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జిలను సందర్శించారు. అధికారులు, నిర్మాణ, నిర్వహణదారులతో మాట్లాడి అక్కడ ప్రాజెక్టు విధానాలు తెలుసుకున్నారు. కేరళలో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిలు ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న విషయాన్ని గమనించారు. ఇవి ఏర్పాటుచేసిన ప్రతిచోటా విజయవంతంగా నడుస్తున్నట్లు గుర్తించారు. దీంతో పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు వీఎంఆర్‌డీఏ గ్లోబల్ టెండర్లు ఆహ్వానించింది. ఇందులో సాయి మోక్షా షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ ఈ టెండర్‌ను దక్కించుకుంది. వీఎంఆర్‌డీఏకు ఏడాదికి రూ.15.3 లక్షలు ముందస్తు చెల్లింపుల ప్రతిపాదికన ఈ ప్రాజెక్టును చేపట్టింది.

సముద్ర అధ్యయన శాస్త్రవేత్తల సూచనలతో..

తొలుత.. ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జిను తెన్నేటి పార్కు సమీపంలో ఏర్పాటుచేయాలని అధికారులు భావించారు. అయితే, ఆ ప్రాంతం అటవీశాఖ పరిధిలో ఉండడంతో అక్కడ విరమించుకున్నారు. రుషికొండ ప్రాంతంలో ఏర్పాటుపై ఆంధ్రా యూనివర్శిటీలో సముద్ర అధ్యయన, భూభౌతిక శాస్త్రవేత్తలను సంప్రదించారు. ఇక్కడ ప్రాణాంతకమైన రిప్ కరెంట్ అధికంగా ఉంటుందని, ప్రాజెక్టుకు అనుకూలమైన ప్రాంతం కాదని చెప్పి కురుసుర మ్యూజియం ఉత్తర దిశ ప్రాంతం ఫ్లోటింగ్ బ్రిడ్జికు అనుకూలమైనదని సూచించారు. దీంతో నిర్వాహకులు ఆ ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు.

మాక్‌డ్రిల్ చేస్తే తెగిపోయిందంటూ రాద్ధాంతం..

సహజంగా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో సముద్రపు ఆటుపోట్లు ఎక్కువగా ఉంటాయి. ఆ సమయాల్లో ఫ్లోటింగ్ బ్రిడ్జిను డీ-లింక్ చేస్తారు. అయితే.. సోమవారం సముద్ర కెరటాల తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో ఆ రోజు నుంచి బ్రిడ్జిపైకి సందర్శకులను అనుమతించాలని ముందు భావించినప్పటికీ అలల ఉధృతి కారణంగా అనుమతించలేదు. ఈ సమయంలో మాక్‌డ్రిల్ చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందులో భాగంగా సిబ్బంది సోమవారం మ.3 గంటల సమయంలో బ్రిడ్జి, ప్లాట్‌ఫాంలను విడదీశారు. ఆ ప్లాట్‌ఫాంను లాగి యాంకర్ వద్దకు తీసుకువెళ్లారు. ఇదంతా అక్కడ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో స్పష్టంగా రికార్డయింది. అయితే.. బ్రిడ్జి, ప్లాట్‌ఫాం మధ్య కొంత ఖాళీ ప్రాంతాన్ని ఫొటో తీసి ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోయిందని పచ్చ పత్రికలు, మీడియా తెగ రాద్ధాంతం చేశాయి. వెంటనే అధికారులు, నిర్వాహకులు అప్రమత్తమై బ్రిడ్జి తెగిపోయిందని చేస్తున్న ప్రచారంలో వాస్తవంలేదని సా.5 గంటలకే సీసీ కెమెరా దృశ్యాలను విడుదల చేశారు. అందులో బ్రిడ్జి, ప్లాట్‌ఫాంను 10 మంది సిబ్బంది విడదీయడంతో పాటు తాళ్లతో యాంకర్ వద్ద తీసుకెళ్లిన దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ.. పచ్చపత్రికలు, పచ్చ పార్టీల లక్ష్యం వేరు కదా.. వాటిని అస్సలు పట్టించుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లాయి. వాస్తవ దృశ్యాలను తొక్కిపెట్టి విశాఖపై అక్కసు వెళ్లగక్కాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఇచ్చిన వివరణను సైతం పట్టించుకోలేదు. కేవలం విశాఖ ఇమేజ్, అభివృద్ధిపై విషం చిమ్మడమే పనిగా తప్పుడు కథనాలు ప్రచురించాయి.

బ్రిడ్జి తెగిపోలేదు.. లంగరు వేశాం..



ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోయిందన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవంలేదు. మాక్‌డ్రిల్‌లో భాగంగా రెండింటిని వేరుచేసి లంగరు వేశాం. తెగిపోతే సముద్రంలో కొట్టుకుపోవడమో, ఒడ్డుకు రావడమో జరిగేది. ప్లాట్‌ఫాం ఒకేచోట ఉండదు. వాస్తవాలను పట్టించుకోకుండా పెనుప్రమాదం తప్పిందని వార్తలు ప్రచురించడం సరికాదు. సముద్రంలో ప్రతికూలతవల్ల అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో సందర్శకులను అనుమతించలేదు. ప్రధాన వంతెన, వ్యూ పాయింట్ వేరుగా ఉండడంతో మధ్య ఖాళీ ప్రాంతాన్ని ఫొటోతీసి దుష్ప్రచారం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రతికూల పరిస్థితులున్న సమయాల్లో ఇటువంటి మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తాం. సంచలనాల కోసం అసత్య వార్తలు రాకుండా అధికారుల నుంచి వివరాలు తీసుకుని ధృవీకరించుకుని ప్రచురించాలి. విశాఖ ఖ్యాతిని మరింత పెంచేందుకు అందరూ సహకరించాలి.

– డాక్టర్ ఎ. మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ కమిషనర్

పూర్తి భద్రతా ప్రమాణాలతో..

- సబ్‌మెరైన్ మ్యూజియం ప్రాంతానికి సమీపంలో ముంబై నుంచి వచ్చిన నిర్మాణ నిపుణుల నేతృత్వంలో బ్రిడ్జిను ఏర్పాటుచేశారు.
- ఒకేసారి 200 మంది సామర్థ్యాన్ని తట్టుకునేలా బలమైన యాంకర్లతో పటిష్టంగా హెచ్‌డీపీఈ బ్లాక్‌లతో ఈ నిర్మాణం చేపట్టారు.
- మొత్తం 100 మీటర్లు ఉండే ఈ బ్రిడ్జి 20 మీటర్లు తీరం ఒడ్డున, 80 మీటర్లు సముద్రంపై ఉంది.
- అలల తాకిడికి దెబ్బతినకుండా ఉండేలా 38 యాంకర్లను వినియోగించారు. వాటిలో 150 కిలోలు బరువైనవి నాలుగు, 200 కిలోలతో 14.. 500 కిలోలతో 20 యాంకర్లు ఉన్నాయి.
- తాత్కాలికంగా నిర్మాణమైన ఈ బ్రిడ్జిలో వినియోగించిన బ్లాకులు, యాంకర్లు, ఇతర సామాగ్రి పూర్తిగా పర్యావరణ సానుకూలమైనవి.

బ్రిడ్జి చుట్టూ నిరంతర గస్తీ..

- సముద్రం అలలకు తగ్గట్లుగానే ఫ్లోటింగ్ బ్రిడ్జి ప్రతిస్పందిస్తుంటుంది.
- దానిపై నడిచే వారు అందుకు తగ్గట్టుగా సరికొత్త అనుభూతిని పొందుతారు.
- పర్యాటకాభివృద్ధి కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టులో పర్యాటకుల భద్రతపై కూడా వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.
- ఫ్లోటింగ్ బ్రిడ్జి చుట్టూ రెండు పడవలతో నిర్వాహకులు నిరంతరం గస్తీ నిర్వహించనున్నారు.
- అలాగే, సందర్శకుల భద్రత నిమిత్తం 10 మంది గజ ఈతగాళ్లను నియమించారు.
- వారి పర్యవేక్షణలో మాత్రమే వంతెనపై సందర్శనకు అనుమతిస్తారు.
- ప్రతి సందర్శకుడికి లైఫ్‌జాకెట్ అందజేస్తారు. అది ధరించకపోతే అనుమతించరు.
- ఇండియన్ నేవీ వారు వినియోగించే లైఫ్ జాకెట్లను ఇందుకోసం సిద్ధంచేశారు. ఇవి 200 కేజీల బరువును 14 గంటలపాటు సముద్రంలో తేలియాడేలా చేస్తాయి. ప్రమాద సమయాల్లో లైఫ్‌గార్డును అప్రమత్తం చేసేందుకు జాకెట్‌కు కుడివైపున విజిల్ ఉంటుంది.
- బ్రిడ్జిపై సందర్శకుల వెంట ఇద్దరు లైఫ్‌గార్డులు ఉంటారు.
- అలాగే, బ్రిడ్జి చుట్టూ లైఫ్‌గార్డులు రక్షణ వలయంగా ఉంటారు.
- రక్షణకు సంబంధించి ప్రజలకు శిక్షణ నిచ్చేందుకు నేవీ విశ్రాంత అధికారి, మెరైన్ కమాండోను అందుబాటులో ఉంచారు.
- నిరంతర పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను సైతం ఏర్పాటుచేశారు.

కులశేఖరపట్నం నుంచి నేడు ఇస్రో తొలి ప్రయోగం

తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో సిద్ధమవుతున్న మరో స్పేస్ పోర్టు



ప్రయోగించబోయే ఆర్ఎస్-200 సౌండింగ్ రాకెట్

సూళ్లూరుపేట: ఇస్రో తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్నంలో మరో స్పేస్ పోర్టును సిద్ధం చేస్తోంది. అక్కడి పోర్టు నుంచి బుధవారం రోహిణి సౌండింగ్ రాకెట్-200ను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భవిష్యత్‌లో భారీ ప్రయోగాలు చేయనున్న ఇస్రో చిన్న ప్రయోగాలు, వాణిజ్యపరమైన ప్రయోగాలు, ఎస్ఎస్ఎల్‌వీలాంటి చిన్నతరహా రాకెట్లు, ప్రైవేట్ సంస్థలకు చెందిన రాకెట్లను ప్రయోగించేందుకు కులశేఖరపట్నంలో రాకెట్ కేంద్రాన్ని సిద్ధం చేస్తోంది. ఐదారేళ్ల క్రితమే తూర్పుతీర ప్రాంతంలో రెండో స్పేస్ పోర్టు నిర్మించాలనే ఉద్దేశంతో స్థలాన్వేషణ చేశారు. అదే సమయంలో కృష్ణా జిల్లా నాగాయలంకను పరిశీలించారు. అక్కడి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్నం వద్ద భూములను పరిశీలించారు. వెంటనే స్థలసేకరణ జరిపారు. స్పేస్ పోర్టు ఏర్పాటు చేసేటపుడు ముందుగా సౌండింగ్ రాకెట్ ప్రయోగాలు చేసి అక్కడ గ్రావిటీ పవర్, సముద్రపు వాతావరణం, భూమికి అతితక్కువ దూరంలో వాతావరణంలో తేమలాంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. కులశేఖరపట్నం నుంచి రోహిణి సౌండింగ్-200 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు సూళ్లూరుపేటలోని శ్రీహరికోట సెంటర్ నుంచి 40 మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు తరలి వెళ్లారు.

యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్లాంట్ నిబంధనలకు విరుద్ధం

- దాన్ని తొలగించేలా ఆదేశాలివ్వండి
- హైకోర్టులో సీనియర్ పాత్రికేయుడు కేబీజీ తిలక్ పిల్

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద బుడమేరు డైవర్షన్ కెనాల్‌పై ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించిన మినీ హైడల్ పవర్ ప్లాంట్ అండ్ రెగ్యులేటర్‌ను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన మినీ హైడల్ పవర్ ప్లాంట్‌ను తొలగించే విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ విజయవాడకు చెందిన స్వర్ణాంధ్ర పత్రిక ప్రచురణకర్త, సీనియర్ జర్నలిస్ట్ కేబీజీ తిలక్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై వచ్చే బుధవారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. ఈ మినీ హైడల్ పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల 2008లో అనేక నివాస కాలనీలు, వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయని తిలక్ తన వ్యాజ్యంలో వివరించారు. ముంపు నుంచి విజయవాడను రక్షించేందుకు బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు అడ్డంకిగా ఉన్న వాటన్నింటినీ తొలగించాలని 2009లో అప్పటి ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. యాక్టివ్ పవర్‌కు ఇచ్చిన ఎన్‌వోసీని రద్దు చేశారన్నారు. అయితే తిరిగి 2014లో వచ్చిన ప్రభుత్వం ఎన్‌వోసీని పునరుద్ధరిస్తూ జీవో ఇచ్చిందని తెలిపారు. అంతేకాకుండా ఐలాండ్‌లో కాకుండా బుడమేరుపై పవర్ ప్లాంట్ కడితే, జీవోలో మాత్రం ఐలాండ్‌లోనే కట్టినట్టు పేర్కొన్నారని వివరించారు.

నేడు కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాలపై జాతీయ సదస్సు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాలపై బుధవారం విశాఖలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఐదు రాష్ట్రాల నుంచి ఆరోగ్య శాఖాధికారులు హాజరవుతారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ), ప్రధాని మంత్రి జననీ సురక్ష యోజన, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం, ఇతర పథకాలపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ హెల్త్ మిషన్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ కమిషనర్ నివాస్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఏపీలో 26 జిల్లాల వైద్య ఆరోగ్యశాఖాధికారులు, సమన్వయ అధికారులు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్తలు హాజరవుతారు. రుషికొండ రాడిసన్ హోటల్‌లో ఈ జాతీయ సదస్సు జరుగుతుందని జిల్లా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

నోటీసులిచ్చి అభ్యంతరాలు స్వీకరించండి

- ఆ తరువాత తగిన ఉత్తర్వులివ్వండి
- సీఆర్‌డీఏకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో భూ సమీకరణ పథకం కింద కేటాయించిన ప్లాట్లను రద్దుచేసి మరోచోట ప్లాట్లు కేటాయించే వ్యవహారంలో రైతులకు నోటీసులు జారీచేయాలని హైకోర్టు మంగళవారం సీఆర్‌డీఏను ఆదేశించింది. ప్లాట్లు ఎందుకు రద్దుచేయాల్సి వచ్చిందో ఆ నోటీసుల్లో స్పష్టంగా తెలియజేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్పు కాపీ అందిన నాటినుంచి వారంలోపు ఈ నోటీసులను జారీచేయాలని తెలిపింది. ఆ తరువాత మూడు వారాలపాటు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

గత ప్రభుత్వ తప్పిదాన్ని సరిదిద్దాలని..

సీఆర్‌డీఏ చట్ట ప్రకారం భూ సమీకరణ ద్వారా తీసుకున్న భూముల్లో మాత్రమే రైతులకు ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. అయితే, గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా, చట్ట విరుద్ధంగా భూసేకరణ చేసిన భూముల్లో కూడా ప్లాట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో.. గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దేందుకు సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నాయి. భూసేకరణ భూముల్లో కేటాయించిన ప్లాట్లను రద్దుచేసి మరోచోట ప్లాట్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాయి. ఈ చర్యలను సవాలుచేస్తూ పలువురు రైతులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ప్లాట్ల కేటాయింపులను రద్దుచేయవద్దని మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏలు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ అప్పీళ్లపై జస్టిస్ నరేందర్ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు నామినేషన్‌ల స్వీకరణ

సాక్షి, అమరావతి: జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్-2024 అవార్డు కోసం నర్సుల నుంచి నామినేషన్‌లు స్వీకరిస్తున్నట్లు వైద్య విద్యా డైరెక్టర్ డాక్టర్ నరసింహం మంగళవారం తెలిపారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం సందర్భంగా నర్సింగ్ వృత్తిలో విశేష సేవలు అందించిన వారికి ఈ అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవార్డుకు రూ.50 వేలు, సర్టిఫికెట్, మెడల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుల పూర్తి వివరాలు నమోదుకు రాష్ట్ర కమిటీకి సంబంధించిన ప్రత్యేక ఎంపిక ప్రమాణాలను www.indiannursingcouncil.orgలో పొందుపరిచామన్నారు. నామినేషన్‌లను మార్చి1 సాయంత్రం 5 గంటల్లోగా డీఎంఈ కార్యాలయంలో అందజేయాలన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.